
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 11.12.2025 | సంపుటి :12 సంచిక : 142 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం JANAMSAKSHI TV
హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




"ఓయూకు వెళ్తా అన్నప్పుడు చాలా ధైర్యం చేస్తున్నారని నాతో కొందరు అన్నారు. ఓయూలో ప్రజాప్రతినిధులను అడ్డుకున్న చరిత్ర ఉందని చెప్పారు. నాది ధైర్యం కాదు. అభిమానం అని వారితో చెప్పాను. ఓయూని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చా. విద్యాలయాల్లో కులవివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్. ఇంజినీరింగ్ చదివిన వారికి ఉద్యోగాలు ఇప్పించడం కష్టంగా ఉంది. సర్టిఫికెట్ ఉంది కానీ నైపుణ్యాలు లేవు. 2036 లో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా మన విద్యార్థులను తీర్చిదిద్దాలి" - సీఎం రేవంత్ రెడ్డి

# ఉస్మానియాకు రూ.1000 కోట్లు

## యూనివర్సిటీపై ముఖ్యమంత్రి రేవంత్ వరాల జల్లు

- ఎంతోమంది ప్రముఖులను ఓయూ అందించింది
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- విద్య మాత్రమే ఆత్మగౌరవాన్ని పెంచుతుంది
- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా..
- చదువు రాకున్నా..దాని విలువ తెలిసినోడిని
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తాం : సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## గూగుల్‌లా స్టార్టప్‌లు ఖ్యాతి సాధించాలి

- తెలంగాణలో స్టార్టప్‌ల కోసం రూ.1000 కోట్ల ఫండ్
- టీహబ్‌లో 'గూగుల్ ఫర్ స్టార్టప్స్' ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్టర్లు, పార్టనర్లు, ప్రభుత్వానికి వారధిగా ఇది పనిచేస్తుందని వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి):గూగుల్ అంత ఎత్తుకు ఎదిగేలా స్టార్టప్‌లు కష్టపడాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. స్టార్టప్‌ల కోసం ప్రభుత్వం రూ. 1000 కోట్ల ఫండ్ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ స్టార్టప్‌లపైనే కాదు, యూనికార్న్‌లపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. కనీసం హైదరాబాద్ నుంచి 100 యూనికార్న్ సంస్థలు రావాలని మిగతా 2లో..

## పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం



- 890 గ్రామాలు ఏకగ్రీవం
- తొలి విడతలో 395, రెండో విడతలో 495..
- పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని



హైదరాబాద్(జనంసాక్షి): తొలి విడత పంచాయతీ ఎన్నికల కు సర్వం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల బలాబలాలు తేలిపో నున్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం పోలింగ్‌కు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశారు. నిర్ణీత సమయానికి మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే బందోబస్తు, మిగతా 2లో..

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

### పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం

- 3వేల కేంద్రాల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ పోలీస్ సిబ్బంది
- ప్రజలంతా ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలి
- సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక భద్రత: డీజీపీ శివధర్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మిగతా 2లో..

## ఎస్ఐఆర్‌పై సమగ్ర సమీక్ష అసాధ్యం

- నెహ్రూ, ఇందిర హయాంలోనూ ఈ ప్రక్రియ నిర్వహించారు
- కేంద్రం కోసం ఈసీ పనిచేయదు
- లోక్‌సభలో అమిత్ షా



న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో జరు గుతున్న 'ఓటరు జాబితా సమగ్ర సవరణ' ప్రక్రియపై దేశ ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. గత నాలుగు నెలలుగా ఎస్ఐఆర్ గురించి అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం లోక్‌సభలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘమే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అది నడవదని ఆయన తెలిపారు. పారదర్శక, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అని హోంమంత్రి చెప్పారు. మిగతా 2లో..


## పాదర్శకతకు పాతరేస్తే నేనొప్పుకోను

### సెంట్రల్ ప్యానెల్ చీఫ్‌ల ఎంపిక ఏకపక్షంగా కుదరదు

మోదీతో విభేదించిన రాహుల్ • వ్యతిరేకిస్తూ లిఖితపూర్వక అసమ్మతి నోట్ అందజేత



న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర సమాచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి కీలకమైన సెంట్రల్ ప్యానల్ల చీఫ్‌ల ఎంపికలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీతో విభేదించారు. పారదర్శక సంస్థలకు నియామకాలను ఖరారు చేయడానికి బుధవారం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అత్యున్నత పదవులకు ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్లు పేర్కొంటూ.. లిఖితపూర్వక అసమ్మతి నోట్‌ను అందజేశారు. అయితే సెంట్రల్ ప్యానల్ల చీఫ్‌ల ఎంపికలో షార్ట్‌లిస్ట్ చేసిన అధికారులకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. మంగళవారం లోక్‌సభ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ..దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఈసీని భాజపా వాడుకుంటోందని ఆరోపించిన విషయం తెలిసిందే. తన ప్రసంగానికి సంబంధించిన వీడియోను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో షేర్‌చేశారు. ఎన్నికల్లో అవకతవకలపై లోక్‌సభలో తాను కేంద్రాన్ని అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానం ఒకటేనని పేర్కొన్నారు. అది ఓట్ల చోరీకి భాజపా ఈసీని ఓ సాధనంగా వాడుకోవడమేనని రాసుకొచ్చారు.



సుప్రీంలో ఫోన్ ట్యాపింగ్ కేసు..
## విచారణ నేటికి వాయిదా
2లో..

## కార్పొరేషన్ చైర్మన్ పదవులు భర్తీ చేస్తాం

డిసెంబర్ నెల ఆఖరులోగా ప్రక్రియ పూర్తిచేస్తాం



- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది
- ముందస్తు షెడ్యూళ్ల వల్లే రాహుల్, ఖర్గేలు రాలేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): నెలాఖరులోగా కార్పొరేషన్ చైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని చెప్పారు. ఈ సమ్మిట్‌పై భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. సమ్మిట్‌లో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. కంపెనీల ప్రొఫైల్ చూడకుండా ఒప్పందాలు జరగవన్నారు. ఫ్యూచర్ సిటీ.. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని చెప్పారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన.. మా మిగతా 2లో..

సీఎం సహాయనిధి
## పంపిణీలో కొత్త రికార్డు

రెండేళ్లలో రూ.1,685.79 కోట్ల సహాయం అందజేత

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్ధిదారులకు రూ.1,685.79 కోట్ల సహాయం అందజేశారు. మిగతా 2లో..




## ఆటో కార్మికులను ఆదుకోండి

### సర్కారుకు కేటీఆర్ విజ్ఞప్తి

- వారికి బాకీ ఉన్న రూ. 1560 కోట్లను తక్షణమే చెల్లించాలి
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాడుతాం
- ఆటో డ్రైవర్లకు ఆత్మీయ భరోసా కార్యక్రమంలో ప్రమాద
- బీమా బాండ్ల పంపిణీ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న రూ. 1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్ల ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా, ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటోడ్రైవర్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే హైదరాబాద్‌లో మహా ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఆటో అన్నలతో బిఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం కొత్తది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, కేసీఆర్ గారు ప్రాణాలకు తెగించి ఆమరణ దీక్ష చేసినప్పుడు, రాష్ట్రవ్యాప్తంగా కదిలిన సబ్బండ వర్గాల్లో, ఆటో డ్రైవర్లు కూడా ముందుండి పోరాడారని, తెలంగాణ కావాలే, అయి తీరాల అని ర్యాలీలు తీసి కేసీఆర్‌కు మద్దతుగా నిలబడ్డారని గుర్తుచేశారు. వారి పాత్ర పోరాటంలో మరువలేనిదన్నారు. మిగతా 2లో..

## మీ డబ్బు.. మీ హక్కు

క్లెయిమ్ చేయని నగదు దక్కించుకునేందుకు ఉద్యమంలా పాల్గొనండి: ప్రధాని మోదీ

## సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే డబ్బులు దండుకుంటారా?

- ఇష్టారీతిన టికెట్ల ధరలు పెంచడానికి అనుమతి ఎవరిచ్చారు?
- ఇండిగో వ్యవహారంలో కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ప్రశ్న

నోబెల్ ప్రదానోత్సవానికి శాంతి బహుమతి గ్రహీత
## గైర్హాజరు

## ఆర్టీసికి మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి: మంత్రి పొన్నం

వివరాలు లోపలి పేజీలో..

టారీఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పునిస్తే..
## అమెరికా భద్రతకే పెనుముప్పు



దేశానికి ఆర్థిక రక్షణ లేకుండా పోతుందని : ట్రంప్

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాలపై విధించిన టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పెన్సిల్వేనియాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే దానివల్ల అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సుంకాలను వ్యతిరేకిస్తూ కొందరు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేస్తుండడాన్ని విమర్శించారు. తాను విధించిన టారిఫ్‌ల ద్వారా వందల బిలియన్ డాలర్లు సృష్టించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తాను చేసే మరిన్ని అద్భుతాలను చూస్తారని వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే అమెరికాకు ఆర్థిక రక్షణ లేకుండా పోతుందని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర దేశాలు తమ దేశం విషయంలో ఎలా అయితే ప్రవర్తిస్తున్నాయో తాము మిగతా 2లో..

భారత్‌తో వాణిజ్య చర్చల్లో
## పురోగతి

మాకు బెస్ట్ ట్రేడ్ ఆఫర్స్ అందాయి: అమెరికా ప్రతినిధి

9లో..

# కార్పొరేషన్ చైర్మన్ పదవులు భర్తీ చేస్తాం

రెండేళ్ల పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత – బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# సీఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ.850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్ధిదారులకు రూ.533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం పక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్ధిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది.తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ.1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అఫీషియల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తున్న ఈ సహాయ నిధి, అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

# ఉస్మానియాకు రూ.1000 కోట్లు



పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడుతున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.




# గూగుల్‌లా స్టార్టప్‌లు ఖ్యాతి సాధించాలి

ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని టీహబ్‌లో గూగుల్‌ఫర్ స్టార్టప్స్ కేంద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 1998లో గూగుల్ ప్రస్థానం కూడా ఒక స్టార్టప్‌గానే మొదలైందని ముఖ్యమంత్రి తెలిపారు. గూగుల్ విజయ ప్రస్థానం మాకు నిత్యం స్ఫూర్తిదాయకమని అన్నారు. గూగుల్, యాపిల్, అమెజాన్, టెస్లా వంటివి గొప్ప స్టార్టప్‌లని ఆయన కొనియాడారు. 100 స్టార్టప్స్‌లను 1 బిలియన్ జాబితాలో చేర్చేలా కృషి చేస్తామన్నారు.మేం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన సందర్భంగా ఈ కేంద్రం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇదో కొత్త ప్రారంభమని, ఇదో కొత్త ప్రయాణమని కొనియాడారు. స్టార్టప్స్ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, మా స్టార్టప్‌లకు గూగుల్ మెంటార్‌గా ఉండటం చాలా సంతోషకరమన్నారు. ఇక ఇప్పుడు యూనికార్న్ సంస్థలకు ఏర్పాటు చేసే అవకాశం వచ్చిందని సంతోషించారు. యూనికార్న్‌లను తయారు చేయడం కోసమే ఈ కేంద్రం ఉందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకోవడంపై విమర్శలు వచ్చాయని చెప్పారు. ఒక లక్ష్యం అంటూ ఉంటేనే ప్రగతి పథంలో దూసుకెళ్లగలమన్నారు. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

### టారీఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పునిస్తే..

# అమెరికా భద్రతకే పెనుముప్పు

కూడా అలాగే బదులు చెబుతామని.. ఆ విధంగా ప్రవర్తించొద్దంటూ తమను ఎవరూ అడ్డుకోవద్దని వ్యాఖ్యానించారు. తమతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై సుంకాలు అమలు చేయడం వల్ల అమెరికా జాతీయ భద్రత మెరుగుపడిందన్నారు.అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ విషయంపై విచారణ కొనసాగుతోంది.

### సుప్రీంలో ఫోన్ ట్యాపింగ్ కేసు

# విచారణ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుప్రీంకోర్టులో గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి ఒక ముఖ్య విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తు సంస్థతో ఏమాత్రం సహకరించడం లేదని అయితే, ప్రభాకర్ రావు తరపు సీనియర్ న్యాయవాది ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో, ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కీలక కేసులో విచారణ రేపు కూడా కొనసాగనుంది.

# పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం



శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్న ఆమె తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని వెల్లడించారు. 50 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు.

**ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు**

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగుస్తుందని ఎన్నికల కమిషనర్? రాణికుముదిని అన్నారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఆ వెంటనే ఉప సర్పంచి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం 3,834 గ్రామాలు, 27,628 వార్డుల్లో పోలింగ్ జరగనుందని వెల్లడించారు.ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో రూ.8.2 కోట్లను సీజ్ డీజీపీ మహేష్ భగవత్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉందన్న ఆయన రాష్ట్ర సరిహ ద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 50 వేల మంది సివిల్ పోలీసులు ఎన్నికల విధుల్లో ఉంటారని, అదనంగా 60 ప్లటూ న్లను బయటి నుంచి రప్పించామని వెల్లడించారు. సర్పంచి పదవులకు వేలం పాటలపై కఠినంగా వ్యవహరించా మని తెలిపారు. వేలం నిర్వహించిన గ్రామాల్లో కొందరిపై కేసులు నమోదు చేశామన్నారు. రేపు పోలింగ్ జరిగే మండలాల్లో సెలవు ఉంటుందని ప్రకటించారు. తొలి విడతలో పంచాయతీ ఎన్నికల్లో 21 గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. రేపు జరగబోయో సర్పంచ్ ఎన్నికల బరిలో 12,690 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకో నున్నారు. వార్డుమెంబర్ల బరిలో 65,455 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తం 189 మండలాల్లోని 3,834 గ్రామాల్లో స్థానిక సమరం జరగనుంది. రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు పంచాయతీల్లో సర్పంచి, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు నగరాల్లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్న తమ మద్దతుదారులు, బంధు వులు, స్నేహితులకు ఫోన్లు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటేయడానికి తప్పకుండా రావాలంటూ కోరుతున్నారు. ఓటర్ల లిస్టును చేతపట్టుకుని వీరంతా ఎక్కడున్నారో తెలుసుకుంటూ వారి చిరునామాలు, ఫోన్ నెంబర్లు తెలుసుకుని ఓట్ల కోసం వేట మొదలు పెట్టారు. బస్ ఛార్జీలతో పాటు ఇతర పనులకు వెళ్లేవారికి ఏ మాత్రం నష్టం కాకుండా చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు.

# నోబెల్ పురస్కార ప్రదానోత్సవానికి శాంతి బహుమతి గ్రహీత గైర్హాజరు

**ఓస్లో(జనంసాక్షి):** నేడు నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పుర'స్కార ప్రదానోత్సవం జరిగింది అయితే ఈ కార్యక్రమానికి ముందు నార్వే రాజధానిలో ఓస్లోలో నిర్వహించే మీడియా సమావేశానికి శాంతి బహుమతి గ్రహీత మరియా కొరీనా గైర్హాజరయ్యారు. దీంతో నిర్వాహకులు మీడియా సమావేశాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి కూడా ఆమె హాజరు కావట్లేదని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ వెల్లడించారు. మరియా తరపున ఆమె కుమార్తె నోబెల్ బహుమతిని స్వీకరించనున్నట్లు తెలిపారు.అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని ఇప్పటికే వెనెజువెలా అటార్నీ జనరల్ వెల్లడించిన నేపథ్యంలో.. మరియా నోబెల్ ప్రదానోత్సవానికి గైర్హాజరయినట్లు తెలుస్తోంది.

# ఆటో కార్మికులను ఆదుకోండి



కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్మికుల పట్ల తన ప్రేమను చాటుకున్నారని కేటీఆర్ తెలిపారు. కేవలం ఆటో అన్నలకే కాకుండా, రాష్ట్రంలోని సుమారు 6న్నర లక్షల నుంచి 7 లక్షల మంది ఆటో కార్మికులకు, అడగకుండానే, మ్యానిఫెస్టోలో పెట్టకుండానే, ఓట్ల కోసం దొంగమాటలు చెప్పకుండానే 5 లక్షల ప్రమాద బీమాను కల్పించారని వివరించారు.కేటీఆర్ మాట్లాడుతూ, కేసీఆర్ గారు రైతు బీమాను తీసుకొచ్చి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. దేశంలో రైతులకు బీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే. అలాగే డ్రైవర్లకు, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు కార్మిక పక్షపాతి కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లతో పాటు, అసంఘటిత రంగంలోని దాదాపు 13న్నర లక్షల మంది డ్రైవర్లకు (వ్యాన్లు, జీపులు, ట్రాక్టర్లు, టాక్సీలు, లారీలు) కూడా 5 లక్షల ప్రమాద బీమా కల్పించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. సిరిసిల్ల జిల్లా కార్మిక, ధార్మిక, కర్షక క్షేత్రమని, నేతన్నలు, కర్షకులు (రైతులు), ధార్మికులు ఇక్కడ పెద్ద ఎత్తున ఉంటారని వివరించారు. రాష్ట్రంలో మార్పు, మార్పు అంటూ జరిగిన మోసం ఎలా ఉంటుందో రెండేళ్లలో ప్రజలకు అర్థమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువత, మహిళలు సహా అందరినీ 420 హామీలు ఇచ్చి మోసం చేశారని. రైతు రుణమాఫీ విషయంలో అబద్ధాలు చెబుతూ, దేవుళ్లపై అబద్ధపు ఒట్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో మంచిగా దర్జాగా బతికిన ఆటో డ్రైవర్ మష్రత్ అలీ, నేడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీల వల్ల రెండు ఆటోలు అమ్ముకుని, కిరాయి ఆటో నడుపుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

**ఆటో డ్రైవర్లకు రూ.1,560 కోట్ల అప్పు**

నెలకు రూ. 1,000 చొప్పున ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సిన మొత్తాన్ని రెండేళ్లకు లెక్క కడితే, రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 1,560 కోట్లు అప్పు పడి ఉందని స్పష్టం చేశారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రెండేళ్లకు రూ. 24,000 బాకీ ఉన్నారని. ఆటో డ్రైవర్లకు బీమా కల్పిస్తే, ఈ ప్రభుత్వం దాన్ని కూడా ఊడగొట్టిందని, అందుకే గతంలో 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యే అని ఆవేదన వ్యక్తం చేశారు.ఆటో డ్రైవర్ల హక్కుల సాధనకు తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి లోపు బీమా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు పెట్టకుంటే, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహా ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. "కాంగ్రెసోడు ఊరికే ఇవ్వడు. గల్లా పట్టి అడిగితేనే ఇస్తాడు" అని అందుకే పోరాటం తప్పదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఒక క్రెడిట్ సొసైటీ (కోఆపరేటివ్ సొసైటీ) గా ఏర్పడాలని వారికి సూచించారు.

### ఎస్ఐఆర్‌పై సమగ్ర సమీక్ష

# అసాధ్యం

'పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. ఆ అంశం గురించి ప్రజల్లోకి తప్పుడు సందేశాన్ని పంపే యత్నం చేస్తున్నాయి. అందుకే మేం ఎన్నికల సంస్కరణలపై చర్చకు నిరాకరిస్తున్నాం. పార్లమెంటు అనేది దేశంలోనే అతిపెద్ద పంచాయతీ అయినందున, దీనిలో చర్చకు మేం ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర సమీక్ష జరపాలని విపక్ష పార్టీలు కోరుతున్నాయి. అయితే అది సాధ్యమయ్యే విషయం కాదు. ఎందుకంటే ఆ అంశం కేంద్ర ఎన్నికల సంఘం అధికార పరిధిలోకి వస్తుంది. ఎన్నికలను మేం నిర్వహించం'అని లోక్‌సభకు అమిత్‌షా తెలిపారు.

**నెహ్రూ, ఇందిర హయాంలోనూ ఎస్ఐఆర్**

'లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై మాత్రమే చర్చ జరగాలి. కానీ విపక్షాలు పూర్తిగా ఎస్ఐఆర్ ప్రక్రియ గురించే మాట్లాడుతున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రధానులుగా ఉన్న టైంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించారని విపక్షాలు తెలుసుకోవాలి. తొలిసారిగా 1952లో నెహ్రూ హయాంలో ఎస్ఐఆర్ జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనూ ఎస్ఐఆర్‌ను నిర్వహించారు. ఇవన్నీ తెలిసి కూడా ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.

# సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే డబ్బులు దండుకుంటారా?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇండిగో సంక్షోభంపై దిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. అసలు ఈ సంక్షోభం ఎందుకు తలెత్తిందని కేంద్రాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఇలాంటి సమయంలో విమాన టికెట్ ధరలు అమాంతం ఎందుకు పెరిగాయని అడిగింది. "ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. దాని నుంచి ప్రయోజనం పొందేందుకు ఇతర విమానయాన సంస్థలకు అనుమతి ఎలా లభించింది. టికెట్ ధర రూ. 40వేల వరకు ఎలా వెళ్లింది..? ఇదంతా ఎలా జరిగింది" అని కోర్టు ప్రశ్నించింది

# మీ డబ్బు .. మీ హక్కు

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. "మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయి" అని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ సెబీ ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు.

# ప్రజా రవాణాను 70 శాతానికి పెంచాలి

- ఆర్టీసీ ఉద్యోగులు మరింత కష్టపడాలి
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తాం
- ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు అధునాతన సౌకర్యాలతో ఆర్టీసీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తా
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహా లక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 డిపోల్లో ఉన్న ఆర్టీసీ అధికారులు  రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహా లక్ష్మీ పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవర్లు , కండక్టర్లు , శ్రామిక్ ఇతర సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎండీ , ఈడి లు సత్కరించారు. ఆర్టీసీని మరింత విస్తృత పర్చాలని క్షేత్ర స్థాయిలో రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీ కొత్త రూట్లను అన్వేషించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే హైదరాబాద్ నగరంలో గత మూడు నెలలుగా సర్వే చేసి 373 కొత్త రూట్లలో ఈరోజు నుండి ప్రజా రవాణా అయిన ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రింగ్ రోడ్డు వెలుపల ఉన్న దాదాపు 7 లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు. కొత్త రూట్ల లో బస్సులు నడిపినప్పుడే విజన్ 2047 లో మన లక్ష్యాలకు అనుగుణంగా ఇప్పుడున్న 28 శాతం ప్రజా రవాణా ను 70 శాతానికి పెంచుకోవడానికి సాధ్యం అవుతుందని సూచించారు. ఇపుడున్న ఆర్టీసీ మూడింతల వ్యవస్థ అవసరమని అందుకు ఉద్యోగులు సిబ్బంది కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తమకు సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ప్రథమ కర్తవ్యమని ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ సిబ్బంది స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. అటు అధికారులు సైతం ఆర్టీసీ సిబ్బంది విషయంలో కఠినంగా కాకుండా కుటుంబ సభ్యుల మాదిరి వ్యవహరించాలని అప్పుడే వారు సంస్థ కోసం మరింత పనిచేస్తారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల మీద దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇటీవల సిరిసిల్ల లో జరిగిన ఘటనలో డ్రైవర్ కి సంస్థ అండగా ఉందన్నారు. మహా లక్ష్మీ పథకం ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన డిపోలు కూడా లాభాల్లోకి వచ్చేలా పని చేయాలని ఆదేశించారు. గతంలో 2011 లో నియామకాలు జరిగితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు 3038 పోస్టులకు డ్రైవర్ , శ్రామిక్, సూపర్ వైజర్ పోస్టులకు నియామకాలు జరుగుతున్నాయని ,2014 తరువాత మళ్ళీ తమ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో 2476 నూతన బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు.

# సాధారణ ఎన్నికలను మించి స్థానిక ఎన్నికల ప్రచారం

- హామీలను గుప్పిస్తూ...సొంత ఎజెండాలతో కరపత్రాలు
- తొలివిడతలో రాత్రివేళ్లలోనూ ఓట్లు అభ్యర్థన



**ఆదిలాబాద్, డిసెంబరు 10 (జనంసాక్షి) :** గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారంతో తొలివిడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం ఉదయం తొలివిడత ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. తొలి విడత కింద 6 మండలాల పరిధిలో 166 గ్రామ పంచాయతీలు, 1390 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అభ్యర్థులు ఓటర్ల మద్దతు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సొంతంగా మేనిఫెస్టోలను రూపొందిస్తూ.. ప్రచారం చేపట్టడం విశేషం. ఒప్పంద పత్రాలు, బాండ్ పేపర్లను రాసి ఇస్తున్న వైనం గతంలో ఎప్పుడూ లేదు. వివిధ రకాల ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేస్తున్నారు. ప్రశాంతంగా ముగిసిన తొలివిడత ఎన్నికల ప్రచారం ముగియడంతో రాత్రి వేళల్లో నేరుగా కలుసుకుని ఓటును అభ్యర్థించారు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్లను రాబట్టేందుకు అభ్యర్థులు దేనికైనా తగ్గేదే లేదంటున్నారు. అప్పులు చేసి మరీ ఎన్నికల్లో నెగ్గేందుకు సిద్ధమవుతున్నారు. తొలివిడత ఎన్నికలు జరగే గ్రామాల్లో అభ్యర్థులు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధాన పార్టీల మద్దతుతో గెలిచేందుకు ప్లాన్ చేస్తున్నారు. మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఊరిని బాగు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. అయితే గత పక్షం రోజులుగా సాగిన మొదటి విడత ఎన్నికల ప్రచారం మంగళవారంతో ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, అసంపూర్తిగా ఉన్న ఆలయాలు, కుల సంఘ భవనాల నిర్మాణం పనులపై హామీలు ఇస్తున్నారు. అలాగే తమను గెలిపిస్తే గ్రామాల్లో చేపట్టే పనులకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో జోరుగా వైరల్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.

# అయ్యప్ప ఆశీస్సులు అందరి మీద ఉండాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి  ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి మీద ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. చంపాపేట లో పుల్లూరి ఉపేందర్ గుప్త నివాసంలో, నాగోల్ కోపరేటివ్ బ్యాంక్ కాలనీ రవీందర్ గౌడ్ నివాసంలో జరిగిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప పడిపూజ అనేది అయ్యప్ప స్వామి భక్తులు ముఖ్యంగా శబరిమల యాత్ర సమయంలో చేసే ఒక ప్రత్యేక సేవ అని, ఇది శబరిమల దేవస్థానంలో, వివిధ అయ్యప్ప స్వామి ఆలయాలలో ఆచరించబడే కీలక సంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ మహిళా ప్రతినిధులు యూత్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని కోల్పోయాం

- సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ కు తీరని లోటు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్






**కరీంనగర్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్ ను కడసారి చూడటం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి, కరీంనగర్ పట్టణం నుంచి పార్టీలకతీతంగా ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రతినిధులు, అభిమానులు, జమాత్ లకు అతీతంగా ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హుస్సేనీ పుర నుంచి బైపాస్ రోడ్ వరకు జన ప్రవహంతో కిక్కిరిసి పోయింది. పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేలాది మంది అశ్రునయనాల నడుమ కరీంనగర్ బైపాస్ రోడ్ లో సమద్ నవాబ్ పట్టుదలతో, కృషితో నిర్మించిన మస్జిద్ అఫ్జల్ బియాబాని లో వందలాదిమంది ముస్లింల సమక్షంలో ఇస్లామీయ సాంప్రదాయం ప్రకారం చివరగా నమాజే జనాజా ఆచరించి, సమద్ నవాబ్ కృషితో సాధించిన పక్కనే గల ఖబ్రస్తాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈఅంత్యక్రియల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లతో పాటు పలువురు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మాట్లాడుతూ పేద ముస్లింల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని సమాజం కోల్పోయిందన్నారు. సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది నాయకులు కేవలం తమ స్వార్థం కోసం జీవిస్తారని, ప్రజల క్షేమం కోసం, సమాజాన్ని ఉద్ధరించడం కోసం కొందరు నాయకులే పుడతారని, ప్రజాభిమానాన్ని సంపాదించి, పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సమద్ నవాబ్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమద్ నవాబ్ మరణం తనను కలిచివేసిందని, ఆయన కుమారులను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరఫున సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్10 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

## డిజిపిని కలిసిన నూతన మినిస్టీయల్ అసోసియేషన్ కార్యవర్గం



**హైదరాబాద్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** డిజిపి కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డిని బుధవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. డిజిపి వారికి అభినందనలు తెలుపుతూ, ఉద్యోగుల సంక్షేమం కోసం సమష్టిగా, సమర్థంగా పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి నిర్వహించిన ఎన్నికల్లో స్టాఫ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవిష్యత్ కార్యాచరణలో పారదర్శకత, సేవాభావం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

# ఎన్‌కౌంటర్ల హత్యలు, ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలు ఆపాలి

- ఆదివాసి హక్కుల సంఘీభావ వేదిక సభలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్
- ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రంగారెడ్డి కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ
- సభలో 'మహిళ లేని చరిత్ర లేదు' పుస్తకావిష్కరణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆదివాసులను వారికి అండగా నిలిచిన మావోయిస్టు ఉద్యమకారులను కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు భూటకపు ఎన్కౌంటర్ల హత్యలకు, ఆదివాసి ప్రజల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం అమానుషం, అప్రజాస్వామికం అని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. ఇంత క్రూరమైన, దుర్మార్గమైన అమానవీయ ప్రభుత్వ హత్యలను వెంటనే ఆపి, ఆదివాసి ప్రజల 1996 పేసాచట్టం, 2006 అటవీ హక్కుల చట్టాలను అమలు చేయాలని, అదేవిధంగా ఆపరేషన్ కగార్ పేరుతో జరిగిన ప్రభుత్వ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 1948, డిసెంబర్–10 అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా-జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ లో జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లక్ష్మణ్ హాజరయ్యారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీబావ వేదిక హైదరాబాద్ రంగారెడ్డి కమిటి ఆధ్వర్యంలో 2025, చంద్రపురి కాలనీ, కమ్యూనిటీ హాలులో బుదవారం రోజు బహిరంగ సభ జరిగింది. చైతన్య మహిళా సంఘం ఇ.జయ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ ప్రజాసంఘాలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాలు తమ ప్రజల హక్కులను బాధ్యతగా గుర్తించి, వాటి సంక్షరణకు పాటుపడాలని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి సూచిస్తూనే ఉంటుదని, కానీ 78 సంవత్సరాల స్వతంత్ర దేశంగా చెప్పుకొంటున్న భారత్ లోని దళారీ దోపిడి పాలకులు జీవించే హక్కు తోపాటు మత విశ్వాసాలను, సమన్యాయ పౌర ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. మనిషిని మనిషిగా గౌరవించలేని విధానాలతో మానవహక్కులను మంట గలుపుతున్నారని మండిపడ్డారు. దేశ సంపదలను, వనరులను బడా కార్పొరేట్ సామ్రాజ్యవాదుల సంస్థలకు దోచిపెట్టే కుట్రలో బాగంగానే ఆదివాసీలను బలవంతంగా అడవి నుండి వెళ్ళగొట్టే చర్యలు బీజేపీ నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అందుకే ఆపరేషన్ కగార్ పేరుతో 2026, మార్చ్ చివరి తేదీలోపల నక్సల్ రహిత భారత్ గా మారస్తామనే పేరిట  రాజ్యాంగ బద్దమైన ప్రజాస్వామ్య విలువల హననాన్ని కాలరాచి, మారణహోమానికి పాల్పడుతున్నదని గుర్తు చేశారు. పైగా ఆర్బన్ నక్సలైట్ల పేరిట ప్రశ్నించే, పోరాడే మేదావులు, నాయకులను వదలమని బహిరంగ బెదిరింపులతో ఉద్యమ శక్తులను తీవ్ర భయాందోళనలకు గురిచేసే చర్యలు వేగమంతం చేసిందని పేర్కొన్నారు. బుద్ధిజీవులు, ప్రగతిశీల శక్తులు ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమాల నిర్మాణానికి పూనుకొని, సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికైన ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేర్కొంటున్న పాలకులు కార్పొరేట్ల ప్రయోజనాలకోసం చేసుకున్న అక్రమ ఎంఓయులను రద్దుచేసి, గత రెండు సంవత్సరాలుగా జరిగిన, జరుగుతున్న ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేపట్టాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ఈపై కార్యక్రమంలో ఝాన్సీ (పిఓడబ్ల్యూ), షేక్ షావలి (ఐ.ఎఫ్.టి.యు), గడ్డం సదానందం (సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్), కుమార్ (ఏ.ఆర్.కె.ఎస్.ఎస్), ముత్తన్న (టిపిఎఫ్), మల్లేష్ (ఏ.ఐ.ఎఫ్.టి.యు), రవి (పిడిఎం), రాము(విరసం), మమత (అంబేద్కర్ సంఘం), విజయ్ (న్యూడెమొక్రసీ), రాజనర్సింహ (పికెఎం), భవానీ (ఏబిఎంఎస్), జీ.గోపాల్ (తెలంగాణ రైతు సమితి) ముస్లిం కమిటీ ఎం.డి.పాషామియా, కేహెచ్పీఎస్ జంబుక తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. సభలో పికెఎం, అరుణోదయ కళాకారులు ఆలపించిన ఉద్యమ పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం మానవ, పౌర ప్రజాస్వామ్య హక్కులు వర్ధిల్లాలని, ఆపరేషన్ కగార్ ఎత్తివేసి శాంతి చర్చలు జరపాలని నినదించారు.

**సభలో పుస్తక ఆవిష్కరణ:**

మహిళామార్గం ప్రచురించిన 'మహిళ లేని చరిత్ర లేదు' అనే పుస్తకాన్ని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ చేతులమీదుగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సభలో ఆవిష్కరించారు.

# ఈశ్వర చారి కుటుంబాన్ని పరామర్శించే తీరిక సీఎంకి లేదా?



**బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్ (జనం సాక్షి) :** రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీల ఆకాంక్షలు నెరవేరాలని తమ అమూల్యమైన ప్రాణాలను తెగించిన తొలి బీసీ ఉద్యమ అమరవీరుడు సాయి ఈశ్వర చారి మరణించి ఐదు రోజులు గడిచినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలో ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం అత్యంత బాధాకరమని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు. సాయి ఈశ్వర చారి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ నేడు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి లు శ్రద్ధాంజలి ఘటించారు.

# ఇందిరమ్మ చీరల్లో కమీషన్ల కక్కుర్తి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు**

**వరంగల్, డిసెంబర్10 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీలో, మహిళా సంఘాల పేరుతో తీసుకున్న రూ.450 కోట్ల రుణంలో కమిషన్లకు కక్కుర్తి పడి అతి పెద్ద కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో నిర్వహించిన సర్పంచి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీల అమలులో విఫలమయ్యారని చెప్పారు. ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ పేరుతో ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు.

# ఎస్‌బీఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్ హైదరాబాద్‌లో ప్రారంభం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 2025 డిసెంబర్ 9న సాయంత్రం 6:00 గంటలకు హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆల్ ఇండియా ఎస్‌బీఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్ 202526 లాంఛనంగా ప్రారంభించారు. ప్రతిష్టాత్మక ప్రారంభ సెషన్‌లో అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు, కార్పొరేట్ సెంటర్ ఎస్‌బీఐ సీజీఎం పొన్నంబలం మురుగన్, ఎస్‌బీఐ జీఎంలు రవి కుమార్ వర్మ, సతీష్ కుమార్, డిప్యూటీ జీఎం ప్రియదర్శి పంకజ్, ఏఐఎస్‌బీఐఎస్ఎఫ్ జనరల్ సెక్రెటరీ కె.చంద్రశేఖర్, హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ ఓఏ ప్రెసిడెంట్ హెచ్.శంకర్,జనరల్ సెక్రెటరీ కె.ఆంజనేయ ప్రసాద్, సీడబ్ల్యూసీ కార్యదర్శి కెవిస్ శాండిల్య పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనతో ప్రారంభమైంది, తరువాత ప్రముఖులను వేదికకు అధికారికంగా స్వాగతించారు. ఉద్యోగులలో జట్టు స్ఫూర్తి, శారీరక దృఢత్వం మరియు స్నేహాన్ని పెంపొందించడంలో క్రీడా కార్యకలాపాల కీలక పాత్రను వక్తలు నొక్కిచెప్పారు. పొన్నంబలం మురుగన్ మాట్లాడుతూ అన్ని జట్లు గొప్ప విజయాన్ని కోరుకుంటున్నారని, టోర్నమెంట్‌లో క్రీడా స్ఫూర్తిని నిలబెట్టుకోవాలని సూచించారు. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ హైదరాబాద్ సర్కిల్ మరియు కోల్‌కతా సర్కిల్ మధ్య జరిగింది. హైదరాబాద్ సర్కిల్ కోల్‌కతా సర్కిల్‌పై విజయం సాధించి పోటీని ఉత్కంఠభరితంగా ప్రారంభించింది.

KINARA CAPITAL

**కినారా క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్: 50, సెకండ్ ఫ్లోర్, 100 ఫీట్ రోడ్, హెచ్ఏఎల్ 2వ స్టేజ్, ఇందిరానగర్, బెంగళూరు, కర్ణాటక - 560038
CIN: U74899KA1996PTC068587

**పబ్లిక్ నోటీసు - బ్రాంచ్ విలీనం**

**కస్టమర్ సేవను కొనసాగించే ఉద్దేశ్యముతో తెలంగాణ లోని ఈ క్రింద కనబరచిన కినారా క్యాపిటల్ శాఖలు 31 -03- 2026 న లేదా అంతకు ముందు విలీనం చేయబడతాయని మేము ఇందుమూలంగా మా విలువైన కస్టమర్లకు మరియు ప్రజలకు తెలియజేస్తున్నాము.**

| విలీనం చేయాల్సిన ప్రస్తుత బ్రాంచీల పేరు | విలీనం చేసిన బ్రాంచీ పేరు, చిరునామా |
|---|---|
| జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, శేరిలింగంపల్లి, వరంగల్ | **కినారా క్యాపిటల్ – ఎల్.బి.నగర్** నెం.6, కె.బి.ఆర్ కన్వెన్షన్స్ ఎదురుగా, 4వ అంతస్తు శైలజాపురి కాలనీ, మన్సూరాబాద్ రోడ్డు, ఎల్.బి.నగర్, హైదరాబాద్, తెలంగాణ – 500068 |

మరింత సహాయం లేదా సందేహాల కోసం, సోమవారం-శుక్రవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం 6:00 గంటల మధ్య 18001032683 కు టోల్ ఫ్రీ కాల్ లేదా ఇమెయిల్ help@kinaracapital.com చేయండి. ప్రస్తుత కస్టమర్లు 9902224000 కు వాట్సాప్ సందేశాన్ని కూడా పంపవచ్చు. మరిన్ని వివరాలకు www.kinaracapital.com ని సందర్శించండి.

రిజిస్టర్డ్ ఆఫీస్: బెంగళూరు, కర్ణాటక
తేదీ: 11-12-2025

Sd/-
అధీకృత అధికారి

## ప్రపంచీకరణను ప్రశ్నిస్తోన్న
# ఇండిగో వైఫల్యం




ఇటీవలి ఇండిగో విమానాల సంఘటన భారతదేశంలో ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ వర్గం పాలక వ్యవస్థల పనితీరుపై అనేక ప్రశ్నలను మరోసారి లేవనెత్తింది. నవంబర్ నెలలో వేలకు వేల ఫ్లైట్లు రద్దు కావడానికి ఎలాంటి తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలు కారణం కాలేదు. గత దశాబ్దాలలో ప్రయాణీకులు ఇలాంటి అస్తవ్యస్తమైన పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు.

లగేజీ కౌంటర్లలో లగేజీని అప్పగించిన తర్వాత కూడా ఫ్లైట్లు రద్దు కావడం, ఆపై ప్రయాణీకులకు తమ లగేజీ దొరక్కపోవడంలాంటి సంఘటనలు ప్రజలకు నోట్ల రద్దు నాటి అస్తవ్యస్తతను మరోసారి గుర్తు చేశాయి. ఎక్కడివారు అక్కడే గప్చుప్ అయ్యే పరిస్థితి దాపురించింది. ఇది కేవలం ఒక్క విమాన సంస్థ వైఫల్యం అని గానీ, ప్రస్తుత పాలకవర్గం గత విధానాలపై నింద వేసి తప్పించుకునేంత తేలికైన సమస్య గానీ కాదు.

ఒక్క నవంబర్లోనే దాదాపు 900 కంటే ఎక్కువ విమానాలను ఇండిగో రద్దు చేసింది. ఆ తర్వాత డిసెంబర్ 6న 1600 ఫ్లైట్లు, డిసెంబర్ 7న 850 ఫ్లైట్లను రద్దు చేయడం చూస్తే, ఇంతటి అధిక స్థాయిలో సర్వీస్ లోపాలు, నియంత్రణలో వైఫల్యాలు భారత ప్రజలు గతంలో ఎప్పుడూ విన్నది లేదు.

**రైల్వేల వైఫల్యం, ఇండిగో స్వర్ణయుగం**

సాధారణ ప్రజలు, మధ్యతరగతి ఇప్పటికే భారతీయ రైల్వేలపై ఆశలు వదులుకున్నారు. రైల్వే ప్రమాదాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉన్నాయిబీ గత బాలసోర్ రైలు సంఘటన గాయం ఇంకా ప్రజల జ్ఞాపకాల నుండి చెరిగిపోలేదు. రైల్వే సేవలలో నాణ్యతా ప్రమాణాలు అత్యంత దిగువ స్థాయిలో ఉన్నాయనేది ప్రయాణీకులందరికీ అనుభవమే. ఒక్కొక్క సేవను కార్పొరేట్ కాంట్రాక్టుల గుప్పెట్లో పెట్టిన తర్వాత రైల్వే సేవలు మరింత దారుణంగా మారిపోయాయి. రైలు బోగీల్లో కంపుకొట్టే లెవటరీ దుర్గంధాన్ని భరించక తప్పని పరిస్థితి, దానికి తోడు గంటల కొద్దీ రైళ్ల ఆలస్యం వర్ణనాతీతం.

తక్కువ జీతాలు తెచ్చుకునే కార్మికులకు రైల్వే తప్ప మరో మార్గం లేదు. ఈ విపత్కర సంధి దశలో మధ్యతరగతి ప్రజలు, కాస్త ఎక్కువ డబ్బులు చెల్లించి అయినా సరే, విమాన సేవల్ని కొనుగోలు చేయాలని ఆశించారు. ఒకప్పుడు ధనిక వర్గానికి మాత్రమే పరిమితమైన విమాన ప్రయాణాన్ని, ఇండిగో వంటి కంపెనీలు చవకగా అందించడంతో, రైల్వేలపై అసంతృప్తితో ఉన్న మధ్యతరగతి వర్గం విమానాలపై ఆధారపడటం మొదలుపెట్టింది. సరిగ్గా ఇదే సమయంలో, ఇలాంటి వర్గంతో భారతదేశంలో వ్యాపారం చేసి భారీ లాభాలను ఆర్జించవచ్చని భావించిన ఇండిగోకు మార్గం సుగమం అయింది. ఈ రెండు అంశాలు కలసి ఇండిగోకు గోల్డెన్ ఏజ్ ను అందించాయి.

**ప్రపంచీకరణ, గుత్తాధిపత్యం (Monopoly)**

1990లో ప్రారంభమైన ప్రపంచీకరణతో, పాలకవర్గాలు దేశ ఆర్థిక విధానాలను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడి దారీ వర్గానికి అనుకూలంగా మార్చడం మొదలుపెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మొదలైన ఈ సరళీకరణ, బలహీనమైన ప్రతిపక్షం కారణంగా ఇటీవలి మోడీ ప్రభుత్వంలో మరింత వేగం పుంజుకుంది. బలమైన ప్రభుత్వ సంస్థయైన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (LIC) తన నిధుల్ని భారీగా ఒక ప్రత్యేక కంపెనీ బాండ్ల కొనుగోలులో వినియోగించిందనే చర్చ ఇటీవల కొనసాగుతున్నప్పటికీ, ఎల్ఐసీ ఆ విమర్శను తిప్పికొట్టినప్పటికీ, ప్రజల మెదళ్ళలో సందేహాలు లేకపోలేదు.

జియో ఉచిత సేవలతో టెలిఫోన్ రంగం ఒకటి రెండు సంస్థల చేతుల్లోకి వెళ్ళినట్టుగానే, 'పెద్ద చేప చిన్న చేపను తినేసే' గుత్తాధిపత్యం (Monopoly) ప్రతి రంగంలోనూ మొదలైంది. చివరకు లేబర్ కోడ్‌లలో మార్పులతో మొత్తం పారిశ్రామిక వాతావరణం కూడా పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మారబోతోంది. శ్రమ దోపిడీ ఏ స్థాయిలో కొనసాగించినా సరే, శ్రామికునికి పన్నెండు గంటలు పని స్థలాల్లో పనిచేయించినా సరే సమ్మెలను అంగీకరించేది లేదు అనే పరిస్థితి మెల్లమెల్లగా శిలాశాసనం కాబోతుందా అనే ప్రశ్న కార్మికుల్లో వస్తోంది.

నేడు విమాన సేవల్లో దాదాపు 60 శాతం మార్కెట్‌ను ఒక్క ఇండిగో ఆక్రమించింది. విరామం లేకుండా రైళ్లను నడిపే పైలట్ల మాదిరిగానే, లాభాల వేటలో విమాన సర్వీస్‌లలో కూడా పైలట్లకు సరైన విరామం కలిగించకుండా కార్పొరేట్లు సేవలందిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే ప్రభుత్వ సంస్థలు పైలట్లకు సరైన విరామం కలిగించడానికీ, ఇతర సేవల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు చేయడానికీ ప్రయత్నించడం హర్షించదగ్గ విషయం.

అయితే, ఈ మార్పులకు కంపెనీలకు సంవత్సరం కంటే ఎక్కువ సమయం ఇచ్చినప్పటికీ, వారు ఆ సర్వీసులను అందించలేకపోవడం, దాంతో పాటు బుకింగ్‌లను తీసుకుంటూ ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. సర్వీస్ అందించలేని పరిస్థితుల్లో అసలు బుకింగ్‌లను తీసుకోకూడదు. ఒకవేళ తీసుకున్నా, కనీసం రెండు రోజుల ముందు అయినా సరే రద్దు వార్తలను ప్రయాణికులకు అందించి ఉంటే, ఎయిర్‌పోర్ట్‌లో లగేజీలు జమ అయిన తర్వాత ఫ్లైట్లు అందకపోయే దారుణమైన పరిస్థితి తప్పేది.

**ప్రైవేటీకరణ పెనాసియా కాదు**

ధనవంతులు, మధ్యతరగతి వర్గం ప్రయాణం చేసే విమానాల పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పుడు, రైల్వేల వంటి సాధారణ ప్రజలు ప్రయాణించే సంస్థలైనా, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, లేదా పబ్లిక్ సెక్టార్ ఇన్సూరెన్స్ కంపెనీలైనా ఇలాంటి ప్రైవేటు సంస్థలకు పూర్తిగా అప్పగిస్తే, పరిస్థితులు ఇంకా ఎంత దారుణంగా ఉంటాయో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏ సర్వీసైనా ప్రైవేటీకరణ అయిన వెంటనే అది ఉన్నతంగా మారిపోతుందని నాయకులు భారత ప్రజల చెవుల్లో పూలు పెడుతుంటారు. భజనలో కూరుకుపోయిన కొంత భాగం మధ్యతరగతి వర్గం కూడా ఇదే భావించడం చూస్తున్నాం. కానీ, అది అన్ని వేళలా నిజం కాదని ఈరోజు ఇండిగో సంఘటన బహిర్గతం చేసింది. ప్రభుత్వాలను సైతం శాసించగలిగే స్థాయికి ఇలాంటి గుత్తాధిపత్య సంస్థలు రాకముందే, ప్రభుత్వాలు ప్రజల కోణంలో ఆలోచించి, ప్రజలకు పనికొచ్చే ఆర్థిక విధానాలు అవలంబించగలిగితేనే, ఇలాంటి విపత్కర పరిణామాల నుండి ప్రజలకు విముక్తి లభిస్తుంది.



కేశవ్
ఆర్థిక సామాజిక విశ్లేషకులు
9831314213

# కనుమరుగవుతున్న సామాజిక శాస్త్రాలు




ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కుతో మాత్రమే నిలబడేది కాదు. అది విలువలపై, అవగాహనపై, బాధ్యతాయుతమైన పౌర ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికవాదం, జాతీయ ఏకత్వం వంటి రాజ్యాంగమూల్యాలు పుస్తకాలలో మాత్రమే కాకుండా పౌరుల దైనందిన జీవితాలలో ప్రతిబింబించినప్పుడే ఒక దేశం నిజమైన అర్థంలో ప్రగతిపథంలో నడుస్తుంది. అయితే నేటి సమాజాన్ని పరిశీలిస్తే ఈ విలువల్ని నిర్మించే ప్రధాన ఆధారాలైన సామాజిక శాస్త్రాలు క్రమంగా విద్యా వ్యవస్థ నుంచి, సామాజిక చర్చల నుంచి, విధాన నిర్ణయాల నుంచి కనుమరుగవుతున్నాయని ఆందోళన కలుగుతోంది. ఇది భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాద సంకేతం.

**ప్రస్తుతం ఏం జరుగుతుంది**

మన దేశం ప్రజాస్వామ్యమని చెప్పుకోవడమే కానీ, ఆ ప్రజాస్వామ్య స్థిరత్వానికి అవసరమైన పౌర చైతన్యం, రాజకీయ అవగాహన, నైతిక ప్రవర్తన అన్నివైపులా క్షీణిస్తున్నాయి. “నేను–నాది” అన్న సంకుచిత భావన పెరిగిపోయి, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారుతున్నాయి. ఫలితంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలు బలపడుతూ, సామాజిక అసమానతలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణంయితరతరాలకు సామాజిక శాస్త్రాల ద్వారా అందాల్సిన చైతన్యం సరైన స్థాయిలో చేరకపోవడమే. పౌర హక్కులు, బాధ్యతలు ఏమిటి? పాలన వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? ఓటు విలువ ఏమిటి? ప్రజాప్రతినిధులను ఎన్నికల్లో ఎన్నుకునేటప్పుడు ఏ ప్రమాణాలు పాటించాలి? ఇవన్నీ నేర్పాల్సిన బాధ్యత విద్యా వ్యవస్థపై ఉంది. కానీ నేటి పరిస్థితిలో పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు సామాజిక శాస్త్రాలు రెండవ శ్రేణి అంశాలుగా మారిపోయాయి. వైద్య, ఇంజినీరింగ్, సాంకేతిక, వాణిజ్య విద్యకే సమస్త ప్రాధాన్యం ఇస్తూ, సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రాలను పక్కన పెట్టిన విద్యా విధానం సమతుల్యమైన మానవాభివృద్ధిని అందివ్వలేకపోతోంది.

చరిత్ర, భూగోళ శాస్త్రం, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సమాజశాస్త్రం, సాహిత్యం వంటి అంశాలపై అవగాహన లేని తరానికి “భిన్నత్వంలో ఏకత్వం” అనే భారతీయ భావన లోతుగా అర్థం కాగలదా? సమాజ సమస్యలను విశ్లేషించే సామర్థ్యం లేకపోతే, వాటికి పరిష్కారాలు సూచించే చైతన్యం ఎలా పెరుగుతుంది? సామాజిక శాస్త్రాలను కేవలం మార్కులు గడపడానికి మాత్రమే చదువుకుంటే, వాటి ఆత్మసారం యువతలో నాటుకుపోదు.

ఇలాంటి నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, నైతిక ప్రవర్తనకు ప్రోత్సాహం ఇచ్చే విధానాలపై చర్చ అవసరమైంది. ఈ సందర్భంలో చైనాలో అమలులో ఉన్న సోషల్ క్రెడిట్ సిస్టమ్ (సామాజిక పరపతి విలువ) గురించి ప్రస్తావన అవసరం. పౌరుల ప్రవర్తనను మంచిచెడుల ఆధారంగా మదింపు చేసి, మంచికి బహుమతి, తప్పుకు పరిమితులు విధించే విధానం ఇది. రోడ్డుప్రమాదాలు నివారించటం, సామాజిక సేవ, రక్తదానం, పేదలకు సహాయం, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడం వంటి చర్యలు క్రెడిట్‌ను పెంచుతాయిబీ చట్టాల ఉల్లంఘనలు, సామాజిక బాధ్యతారాహిత్యం క్రెడిట్‌ను తగ్గిస్తాయి. ఈ విధానం అక్కడ కఠినంగా అమలవుతున్నప్పటికీ, నైతిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుందన్న వాస్తవాన్ని విస్మరించలేం. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ సహాయంతో పౌరుల ప్రవర్తనను గమనించడం ద్వారా సామాజిక క్రమశిక్షణ పెరుగుతోందన్న వాదన కూడా ఉంది. అయితే భారతదేశ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో, వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలగకుండా, రాజ్యాంగ పరిధిలో ఇలాంటి ఆలోచనలపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

ఇంకా ముఖ్యంగా, ఈ తరహా సామాజిక బాధ్యత ప్రమాణాలను రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు వర్తింపజేస్తే అవినీతి తగ్గడానికి, పారదర్శకత పెరగడానికి అవకాశముంటుంది. ఎన్నికల హామీలు, విధానాల అమలు, ప్రజలకు జవాబు దారీతనం ఇవన్నీ ఒక మదింపు వ్యవస్థలోకి తీసుకొస్తే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుంది.

పాలకుల పౌర సమాజం బాధ్యతలు..

సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం కేవలం నిపుణులను తయారుచేస్తుంది కానీ బాధ్యతాయుత పౌరులను కాదు. దేశ ప్రగతికి సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో, సామాజిక చైతన్యం కూడా అంతే అవసరం. భవిష్యత్ తరాలు ప్రశ్నించే శక్తితో, విశ్లేషించే దృష్టితో, నైతిక విలువలతో ఎదగాలంటే సామాజిక శాస్త్రాలకు మళ్లీ కేంద్రస్థానం కల్పించాల్సిందే.

ప్రభుత్వాలు, విద్యా నిర్వాహకులు, మేధావులు, పౌర సమాజం కలిసి ఈ విషయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సామాజిక శాస్త్రాల పునరుత్థానం లేకుండా ప్రజాస్వామ్యానికి పటిష్టమైన పునాదులు వేయడం సాధ్యం కాదు.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

### ఓటు - ఊరిని వెలిగించే అగ్ని జ్యోతి

ఓ యువతా.. ఓ పల్లె ప్రజలారా
చెట్లలో గాలివీసినట్టు
కాలం చెవిలో ఒక మాట చెబుతుంది
“ఓటు నీది.. భవిష్యత్తు నీ చేతుల్లోది!”
ఓటు అనేది కాగితం కాదు,
ఓటు అనేది ఓ శ్వాస
నీ ఊరి రేపటిని నడిపించే జీవన రేఖ!
ఓటు వేయడం ఒక హక్కు మాత్రమే కాదు,
అది నీ బాధ్యత, నీ ధర్మం,
నీ జన్మభూమికి ఇచ్చే గౌరవం.
యువత అడుగులు బూత్ వైపు కదిలితే
మట్టిబాటలే ఆనందంతో లయ పడతాయి
ఓటు వేయని చేతులు
ఊరి కన్నీళ్లకు కారణమవుతాయి.
ఓటు వేయడం అనేది
ఒక గ్రామం ఆశ పంటను నాటే విత్తనం
ఆ విత్తనం ఎటువైపు పడుతుందో
అదే దిశగా ఐదు ఏళ్లు ఊరి జీవనం సాగుతుంది.
ఓటు అమ్ముకుంటే
ఒక నిమిషం డబ్బుకి
ఊరి ఐదు సంవత్సరాలు
చీకటిలో మునిగిపోతాయి
కానీ సత్యానికి, నీతికి,
అభివృద్ధికి నీ ఓటు నిలిస్తే
పల్లె రోడ్డు వెలుగుతుంది,
పాఠశాల నవ్వుతుంది,
గిరిజన బస్తీకి దారి తెరుచుకుంటుంది.
యువత ఓటేస్తే గ్రామం మారుతుంది
యువత నిలబడితే నాయకత్వం
సరిదారిలో నడుస్తుంది.
నీ ఓటు.. నీ గళం,
నీ విలువ, నీ గ్రామానికే ఇచ్చే ప్రమాణం.
ఏ మాట విని కాదు,
ఏ మోసానికి లోనై కాదు,
నీ గ్రామం కోసం, నీ భవిష్యత్తు కోసం ఓటు వేయి!
ఓటే ప్రజాస్వామ్యానికి గుండె చప్పుళ్లు,
ఓటే ప్రజల శక్తి, ఓటే పల్లె ప్రకాశం.
యువత ముందుకు రా
చేతి వేళ్లపై ముద్ర కాదు
చరిత్రను మార్చే నిర్ణయం పెట్టు!
ఓటు వేయి.. నీ ఊరికి నువ్వే వెలుగు కావాలి!

రైటర్ రాజు (యువ రచయిత)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.
9347196264.

## దేశంలోనే మొట్టమొదటి
# భూగోళ శాస్త్ర విశ్వవిద్యాలయం!




కొత్తగూడెం మైనింగ్ కాలేజీ ఇప్పుడు దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాన్ని మంగళవారం, డిసెంబర్ 2 న ప్రారంభించి నారు. 1976లో ప్రారంభమైన ఈ సంస్థ, కాలక్రమేణా ఇంజినీరింగ్ కళాశాలగా అభివృద్ధి చెంది..ఇప్పుడు ఏకంగా భూగోళ శాస్త్రంలో సమగ్ర విద్యను అందించే.. దేశంలోనే తొలి యూనివర్సిటీగా అవతరించింది. సుమారు 300 ఎకరాల్లో రూ. వెయ్యి కోట్లతో దీని నిర్మాణం జరిగింది.

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ డిసెంబర్ 2న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం వద్ద ప్రారంభమైన దేశంలోని తొలి ప్రత్యేక ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ. ఈ విశ్వవిద్యాలయానికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో వారి పాత్రకు కృతజ్ఞతాభివందనం అర్పించినట్టయ్యింది.

కొత్తగూడెంలో ఉన్న ఈ సంస్థకు చాలా దశాబ్దాల చరిత్ర ఉంది. మొదట ఇది కోయిలా గనుల ప్రాంత అవసరాల కోసం స్థాపించిన మైనింగ్ కాలేజీ స్థాయిలో ప్రారంభమైంది. ఆ తరువాత కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ స్థాయికి ఎదిగింది. ఇప్పుడు అదే క్యాంపస్‌ను దశలవారీగా విస్తరించి, వందల ఎకరాల్లో దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది.

తెలంగాణ గెజిట్ ద్వారా ఈ యూనివర్సిటీని “ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణా/డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ”గా అధికారికంగా ఏర్పాటుచేశారు. ఇది ఇప్పటి వరకు మైనింగ్ ఇంజినీరింగ్, జియాలజీ కోర్సులు మాత్రమే అందించిన ఇంజినీరింగ్ కాలేజీకి ఉన్న స్థాయి కంటే విశాల అకాడెమిక్, రీసెర్చ్ శక్తిని కలిగిన ప్రత్యేక విశ్వవిద్యాలయంగా రూపాంతరం పొందుతోంది.

ఈ యూనివర్సిటీలో భూమికి సంబంధించిన శాస్త్రాలన్నింటికీ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటిస్తోంది. ఖనిజ వనరుల అన్వేషణ, భూమి అంతర్గత పొరల అధ్యయనం, భూకంప విజ్ఞాన శాస్త్రం, వాతావరణ మార్పులు, గనుల సాంకేతికత, భూగోళ సమాచార వ్యవస్థలు, జియోఫిజిక్స్ వంటి విభాగాల్లో ప్రత్యేక డిగ్రీలు, పీజీ, రీసెర్చ్ ప్రోగ్రాములు ప్రారంభించాలనే లక్ష్యంతో ఈ యూనివర్సిటీ రూపుదిద్దుకుంటోంది.

కొత్తగూడెం ప్రాంతం సింగరేణి కోయిలా గనుల కేంద్రం కనుక ఖనిజ సంపదపై ఆధారిత ఇండస్ట్రీలకు విజ్ఞాన కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం నిలవడం కీలకం. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగంలో సింగరేణి కార్పొరేషన్ అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ మానవ వనరుల తయారీ ఈ యూనివర్సిటీ ప్రధాన బాధ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. గనుల భద్రత, ఆధునిక తవ్వక సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, గనుల పునరుద్ధరణ వంటి అంశాల్లో ప్రపంచ స్థాయి పరిశోధనతో సింగరేణి బలోపేతం కావాలనే ఉద్దేశ్యం ఇందులో ఉంది.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యల్లో ఈ యూనివర్సిటీని ప్రపంచ ప్రమాణాలతో నిర్మించి, భూమి శాస్త్రాల పరిశోధనలో దేశానికి కిరీటం పలికించే స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పం కనిపించింది. భారతదేశంలో ఇంతవరకు పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఎక్కడా లేకపోవడం వల్ల ఇదొక చారిత్రక అడుగు అని ఆయన వివరించారు. భూమి వ్యవస్థలపై సమగ్రమైన అధ్యయనంతో దేశానికి, ప్రపంచ సమాజానికి ఉపయోగపడే జ్ఞానం సృష్టించే సామర్థ్యం ఈ సంస్థకు ఉంటుందని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వ అభివృద్ధి విధానంలో రెండు ప్రధాన ఆలోచనలు కనిపిస్తున్నాయి. మొదటిది – ఖనిజ సంపద ఉన్న ప్రాంతానికే ఉన్నత విద్యా అవకాశాలు తీసుకువచ్చి ప్రాంతీయ అసమానత తగ్గించడం. రెండోది – ప్రకృతి వనరుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో శాస్త్రీయ ఆధారాలతో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం రాష్ట్రానికి కల్పించడం. కృష్ణా, గోదావరి నదీ తీర ప్రాంతాల సాగు విస్తీర్ణం, గనుల ప్రాంతాల పర్యావరణ సమతుల్యత, రైతులు ఎదుర్కొనే వాతావరణ మార్పుల ప్రభావం వంటి సమస్యల పరిష్కారానికి ఇక్కడ తయారయ్యే పరిశోధన ఎంతో ఉపయోగపడే అవకాశముంది.

తెలంగాణ “విజన్ 2047”లో విద్య, నీటిపారుదల రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యత లో భాగంగానే ఈ యూనివర్సిటీని ప్రభుత్వం ఒక దీర్ఘకాల పెట్టుబడిగా చూస్తోంది. భూగర్భ జలాల నిర్వహణ, నేల ఆరోగ్యం, ఖనిజ వనరుల మ్యాపింగ్, కార్బన్ న్యూట్రాలిటీ, గ్రీన్ ఎనర్జీ కోసం అవసరమయ్యే కీలక ఖనిజాల అన్వేషణ వంటి రంగాల్లో ఇక్కడి రీసెర్చ్ ఫలితాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరచగలవు.

విద్యార్థుల దృష్టిలో చూసుకుంటే ఈ యూనివర్సిటీ స్థాపనతో జియాలజీ, మైనింగ్, జియోఫిజిక్స్, క్లైమేట్ సైన్స్, జియో ఇన్ఫర్మాటిక్స్ వంటి కోర్సుల్లో నేరుగా గ్లోబల్ డిమాండ్ ఉన్న ఉద్యోగ అవకాశాలు చేరువలోకి వస్తున్నాయి. భూకంప సూచీ, గనుల ఆటోమేషన్, రిమోట్ సెన్సింగ్ ఆధారిత భూ వనరుల మానిటరింగ్, సస్టైనబుల్ మైనింగ్ పాలసీలు వంటి రంగాల్లో భారతదేశం విదేశీ నిపుణులపై ఆధారాన్ని తగ్గించుకుని స్వంత నైపుణ్యాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తోంది.

ఇతర సాధారణ యూనివర్సిటీలతో పోలిస్తే ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రత్యేకత కేవలం పేరులో కాకుండా దాని దిశలో ఉంది. భూమి, వనరులు, పర్యావరణం, అభివృద్ధి అన్న నాలుగు అంశాలను ఒకే సమగ్ర దృక్పథంతో చూడడానికి ఈ సంస్థ పునాది వేసింది. ఖనిజ సంపదతో ప్రసిద్ధి పొందిన కొత్తగూడెం ప్రాంతం నుంచి దేశానికి అవసరమైన భూ విజ్ఞాన నాయకత్వాన్ని అందించాలనే ఆకాంక్ష ఈ యూనివర్సిటీకి కేంద్రంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని స్థిరమైన అభివృద్ధి, శాస్త్రీయ నిర్ణయ విధానం, ఉద్యోగ శిక్షణ, ప్రాంతీయ అభివృద్ధి కలిపిన మోడల్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని ప్రయత్నించడం ఈ ప్రాజెక్టు అసలు ప్రాధాన్యత.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# వృద్ధుల రక్షణ, పోషణ
## చట్టాలు ప్రభుత్వ సౌకర్యాలపై అవగాహన

మన దేశంలో వృద్ధ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వారి రక్షణ, పోషణ, గౌరవప్రదమైన జీవనానికి ప్రభుత్వ పరంగా వివిధ చట్టాలను, స్కీమ్‌లను అమలు చేస్తోంది. అయితే చాలా మందికి వాటి పట్ల అవగాహన లేదు.మన దేశంలో 2025 నాటికి 15 కోట్లకు పైగా వృద్ధులు ఉన్నారు. వారి ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణతో పాటు వృద్ధులకు హక్కుల రక్షణ కీలకం కనుక వాటిపట్ల అవగాహన వృద్ధులతో పాటు సమాజం కూడా పెంచుకోవాలి. ఈ వ్యాసం వృద్ధుల చట్టాల సారాంశం, ప్రభుత్వం అందించే సౌకర్యాలపై సులభంగా అర్థమయ్యేలా వివరిస్తుంది. తద్వారా వృద్ధులతో పాటు, వారి కుటుంబ సభ్యులు తమ హక్కులు వినియోగించుకోవడానికి సహాయపడుతుంది.




**వృద్ధుల రక్షణకు ముఖ్య చట్టాలు:**

భారత రాజ్యాంగం వృద్ధుల హక్కులను మానవ హక్కులుగా గుర్తిస్తుంది. ఇందులో ప్రధానమైన చట్టం “తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల జీవనాధారం, సంక్షేమ చట్టం, 2007” (మేయిటేనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సిటీజెన్స్ యాక్ట్- 2007). ఈ చట్టం ప్రకారం, 60 ఏళ్ళ పైబడిన వృద్ధులు (సీనియర్ సిటిజెన్స్) తమ పిల్లలు లేదా వారసుల నుంచి జీవనాధారం, వైద్య సంరక్షణ గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు కలిగి ఉంటారు. నెలవారీ జీవనాధారం గరిష్ఠంగా ₹10,000 వరకు (రాష్ట్రాలు నిర్ణయిస్తాయి) ఆదేశించవచ్చు,వృద్ధులను విడిచిపెట్టడం లేదా హింసించడం జరిగితే రూ.5,000 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధించవచ్చు.

మెయింటెనెన్స్ ట్రిబ్యునల్స్ (సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్ స్థాయి) దరఖాస్తులను 90 రోజుల్లో పరిష్కరిస్తాయి.హింసించే కుటుంబ సభ్యులను ఇంటి నుంచి బయటకు పంపవచ్చు. ఆస్తి బహుమతి (గిఫ్ట్ డీడ్) రద్దు చేసే అధికారం కూడా ఉంది.

మరో ముఖ్య చట్టం “జాతీయ వృద్ధుల విధానం, 1999” (నేషనల్ పాలసీ ఫర్ ఓల్డర్ పర్సన్స్ –1999) ఇది 2020లో సవరణలతో అప్‌డేట్ అయింది. ఇది వృద్ధులకు ఆర్థిక భద్రత, ఆరోగ్య సేవలు, ఆశ్రయం, దుర్వినియోగం నుంచి రక్షణపై దృష్టి సారిస్తుంది. 2025లో, కొత్త జాతీయ వృద్ధుల విధానం ప్రవేశపెట్టబడింది, ఇది డిజిటల్ ఇన్‌క్లూజన్, పెన్షన్ రిఫార్మ్స్ మరియు ఆర్థిక సురక్షణ పై ఫోకస్ చేస్తుంది.

అలాగే, “వృద్ధుల సంరక్షణ, రక్షణ బిల్లు, 2024–25” ప్రతిపాదినలా ఉంది, ఇది తప్పనిసరి ఆరోగ్య బీమా, డిజిటల్ మోసాల నుంచి రక్షణ, ప్రతి జిల్లాలో వృద్ధ సంరక్షణ కేంద్రాలు ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకుంది.

భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) కింద కూడా వృద్ధులపై హింసకు శిక్షలు ఉన్నాయి, ఉదాహరణకు సెక్షన్ 420 (మోసం), 506 (బెదిరింపు) మరియు 498A (దేశీయ హింస).

2025లో, ప్రభుత్వం వృద్ధుల చట్టాల అవగాహనా కార్యక్రమాలను విస్తరించింది, ముఖ్యంగా దుర్వినియోగం మరియు డిజిటల్ ఎక్స్‌క్లూజన్ సమస్యలపై.

**ప్రభుత్వం అందించే పోషణ సౌకర్యాలు:**

వృద్ధుల పోషణకు ప్రభుత్వం వివిధ స్కీమ్‌లు అమలు చేస్తోంది, ఇవి ఆర్థిక, ఆరోగ్య మరియు సామాజిక సహాయాన్ని అందిస్తాయి.

**1."పెన్షన్ స్కీమ్‌లు" :**

ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ స్కీమ్ (ఐజీఎన్ ఓఏపీఎస్) :(బీపీఎల్) కుటుంబాల్లోని 60-79 ఏళ్ల వారికి రూ.200-500, 80 ఏళ్ల పైబడినవారికి రూ.500–1,000 నెలవారీ పెన్షన్. రాష్ట్రాలు అదనంగా జోడిస్తాయి. ప్రధానమంత్రి వయో వందన యోజన (పీఎంవీవీవై)": 60 ఏళు పైబడినవారికి పెన్షన్, ఎల్ఐసీ ద్వారా నిర్వహణ. నెలవారీ రూ.1,000–9,250 వరకు గ్యారంటీ పెన్షన్.

“అటల్ పెన్షన్ యోజన” (ఏపీవై)", “నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్.పీ.ఎస్)": వృద్ధాప్యంలో స్థిరమైన పెన్షన్ కోసం.

**రాష్ట్ర స్కీమ్‌లు:**

ఆంధ్రప్రదేశ్ (వై.ఎస్.ఆర్.) పెన్షన్, తెలంగాణ ఆసరా వంటివి రూ.3,000–4,000 నెలవారీ పెన్షన్ అందిస్తాయి.

**2. “ఆరోగ్య సంరక్షణ" :**

జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం (ఎన్. పీ. హెచ్. సీ. ఈ.)" : వృద్ధులకు ఉచిత ఆరోగ్య సేవలు, ఫిజియోథెరపీ, మెంటల్ హెల్త్ సపోర్ట్. ప్రతి జిల్లాలో గెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు.

“ఆయుష్మాన్ భారత్": వృద్ధులకు రూ.5 లక్షల వరకు ఉచిత హాస్పిటలైజేషన్ బీమా.

**"ఆర్థిక మరియు ఇతర సౌకర్యాలు":**

- “సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్. సీ. ఎస్ఎస్ )": 60 ఏళ్ళ పైబడినవారికి రూ. 1,000–30 లక్షల డిపాజిట్, ఎక్కువ వడ్డీ రేటు (2025లో 8% పైగా).
- **ప్రయాణ రాయితీలు** : రైల్వేలో పురుషులకు 40 శాతం మహిళలకు 50 శాతం రాయితీబీ విమానాలు మరియు బస్సుల్లో కూడా రాయితీలు ఉంటాయి.
- **“ఆదాయపు పన్ను రాయితీలు"**: 60–80 ఏళ్ల వారికి రూ.50,000 వైద్య బీమా మినహాయింపు, 80 పైబడినవారికి రూ.1 లక్ష.
- అటల్ వయో అభ్యుదయ యోజన: (ఏవివైఏవై)": వృద్ధాశ్రమాలు, డే-కేర్ సెంటర్లు, ఆహారం మరియు వైద్య సహాయం. 2025–26లో 84 కొత్త వృద్ధాశ్రమాలు ఏర్పాటు.
- హెల్ప్‌లైన్ 14567 – 24×7 ఉచిత సహాయం దుర్వినియోగం, నిర్లక్ష్యం ఫిర్యాదులకు.

**సవాళ్లు, ముందుకు సాగాల్సిన దారి**

- చట్టాలు మరియు స్కీమ్‌లు ఉన్నప్పటికీ, అమలు బలహీనత, అవగాహన లోపం మరియు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాలు తక్కువగా ఉండటం సవాళ్లు. 2025లో ప్రభుత్వం నాలుగు కొత్త స్కీమ్‌లు లాంచ్ చేసింది, ఇవి ఆర్థిక సురక్ష, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచాయి.
- వృద్ధులు తమ హక్కులు తెలుసుకోవడం, స్థానిక అధికారులను సంప్రదించడం ముఖ్యం. సమాజం కూడా వృద్ధులను గౌరవించి, సహాయం చేయాలి.
- వృద్ధుల రక్షణ మరియు పోషణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజ బాధ్యత కూడా. ఈ చట్టాలు మరియు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటే, వృద్ధాప్యం సంతోషకరంగా మారుతుంది. అవసరమైతే, స్థానిక సోషల్ వెల్ఫేర్ ఆఫీస్ లేదా హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

● **కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** పోలింగ్ సిబ్బంది ప్రజాస్వామ్య పద్ధతిలో, నిష్పక్షపాతంగా, బాధ్యతయుతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.బుధవారం ఆత్మకూర్ (ఎస్), నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను సందర్శించారు.ఆయా డిఆర్సీ కేంద్రాలలో కలెక్టర్ మాట్లాడుతూ పిఓలు, ఏపీఓలు పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలని అన్నారు.అన్ని సరిగ్గా ఉన్నాయో మరోసారి పరిశీలించుకోవాలని చెప్పారు. రిజర్వు సిబ్బందికి ఏదో ఒక గ్రామ పంచాయతీలో విధులు కేటాయించడం జరుగుతుందని, సిబ్బంది అందరూ వారికి కేటాయించిన గ్రామపంచాయతీ పోలింగ్ స్టేషన్లకు జోనల్ ఆఫీసర్ తో వెళ్లి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని అక్కడ రాత్రి బస చేయాలని అన్నారు. సాయంత్రం సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే ఆ పోలింగ్ స్టేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించి పోలింగ్‌కు అనుకూలంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని



ఆదేశించారు.నేటి ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించాలని తెలిపారు.మధ్యాహ్నం 1 తర్వాత ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూ లైన్లో ఉన్నట్లయితే పై అధికారుల అనుమతితో పోలింగ్ నిర్వహించాలని చెప్పారు.పోలింగ్ కేంద్రాల పరిధిలో శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు మండల టీంకు సమాచారం అందిస్తే,అవసరమైతే అదనపు పోలీస్ సిబ్బందిని పంపించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ తదుపరి మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టాలని, ఓట్ల లెక్కింపులో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రజాస్వామ్య పద్ధతిలో లెక్కింపు జరపాలని అన్నారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప స్టేజ్ టూ రిటర్నింగ్ ఆఫీసర్లు ఫలితాలు వెల్లడించే ముందు జిల్లా ఎన్నికల అధికారి, జనరల్ అబ్జర్వర్ అనుమతి తీసుకొని తుది ఫలితాలు ప్రకటించాలని తెలిపారు.జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక ఎలక్షన్ సెల్ విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలక్షన్ సెల్ కు ఫోన్ కాల్ ద్వారా , వాట్సాప్ మెసేజ్ ద్వారా అనుమతి తీసుకొని ఫలితాలు ప్రకటించాలని అన్నారు.ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్, మండల స్పెషల్ ఆఫీసర్లు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, అశోక్, నాగయ్య, నాగులు నాయక్, ఎంపీడీవోలు ఎండి హుస్సేన్,సునీత, సత్యనారాయణ రెడ్డి, శేష్ కుమార్, భీమ్ సింగ్, పి.ఝాన్సీ, తాసిల్దార్లు అమన్ సింగ్, శ్రీనివాస్, దయానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి



**కృష, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు, వార్డు అభ్యర్థులు, ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని తెలిపారు, బుధవారం కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామ పంచాయతీలో సమావేశంలో ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ ఎన్నికల ప్రవర్తన నియమాలు ఎన్నికలలో ఖర్చు చేసే వివరాలు గురించి 10, 12, 14 వ తేదీలో వివరాలను రిటర్నింగ్ ఆఫీసర్ కు చూపించాలని సమావేశం నిర్వహించారు. నామినేషన్ వేసిన తేదీ నుండి గెలుపొంది వరకు ప్రతి ఖర్చుకు రసీదులు ఉండాలని సర్పంచ్ అభ్యర్థులకు రెండు లక్షల 50 వేల వరకు, వార్డు సభ్యులకు 50 వేల వరకు ఖర్చు చేయొచ్చని తెలిపారు. అంతకన్నా ఎక్కువ ఖర్చు చేస్తే అనర్హులు అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు పర్యవేక్షణ ఎల్లప్పుడూ ఉంటుందని అభ్యర్థులు జాగ్రత్తగా ఖర్చు చేయాలని రిటర్నింగ్ అధికారులు సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, పంచాయతీ ఆఫీసర్ చవిటోళ్ళ తిమ్ము, తదితరులు, పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య బుధవారం సందర్శించారు. హత్నూర మండలం కేంద్రం లో గల సాంఘిక సంక్షేమ గురువుల పాఠశాలలో, సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని చెప్పారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

**మెదక్, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, నిజాంపేట్ మండల నాయకులతో కలసి బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, వార్డు సభ్యుల గెలుపు కోసం వారి తరఫున మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాలుగా మారనున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేండ్లు గడుస్తున్నా,ఏఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయలేక పోయిందని విమర్శించారు. నేడు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల క్రితం మోసపూరితమైన వాగ్దానాలు చేసి ప్రజల ఓట్లను దండుకొని ఆ తర్వాత మొండి చేయి చూపిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా



ప్రజలను వంచించిందని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో వాగ్ధానం చేసిన ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ సర్పంచ్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థులకు ఓటేసి బారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ ప్రచారంలో నిజాంపేట్ పట్టణ పార్టీ అధ్యక్షులు, నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్. బాపురెడ్డి,మాజీ కో ఆప్షన్ అబ్దుల్ అజిత్, మాజీ సర్పంచ్ తిరుమల్ గౌడ్,మాజీ ఎంపిటిసి వెంకటస్వామి, బిఆర్ఎస్ నాయకులు స్వామి గౌడ్,లచ్చపేట రామగౌడ్,తాడేం మల్లేశం,నాయిని మహేష్ రంజిత్ గౌడ్,మౌరం రాజు నాయిని లక్ష్మణ్,మహమ్మద్ పజిల్ పంపరి శివ,పంపరి రాజశేఖర్, బోప్పరం రాజు రెడ్డి, రాకేష్ బండారి తిరుమల్ కొమ్మాట చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి



**హుస్నాబాద్, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్పెషల్ లీవ్ మంజూరు చేయాలని సిద్దిపేట జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమర్పించిన వినతిపత్రంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఉద్యోగులు తమ తమ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుందని, ఈ సమయంలో విధుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల విధుల్లో ఉండి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించే ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తగిన ఆదేశాలు జారీ చేస్తే, ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోగలుగుతారని అన్నారు. అలాగే, అధికారుల ఆదేశాలను పాటిస్తూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో ఉద్యోగులు ముందుంటారని ఈ సందర్భంగా తెలిపారు.

## ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలి

● **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్**

**తాండూరు, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** నేడు జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం పెద్దేముల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మరియు తాండూర్ ఎంపిడిఓ కార్యాలయం లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ల ను పరిశీలించారు.గురువారం జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను ,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణి ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో, తాండూర్ లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి... పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అడిగి తెలుసుకున్నారు.అనంతరం బొంరాస్ పేట్ ఎంపిడిఓ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి...ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్ లు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్



కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని.విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు.ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్లల వారీగా బస్సు లు బయలుదేరే విధంగా జిల్లా కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లు,ఎంపీడీవోలు, స్పెషల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీతాలను ట్రెజరీ శాలరీ పరిధిలోకి తీసుకురండి..

● **ఆసుపత్రి సూపరింటెండెంట్ కు వైద్య ఉద్యోగుల వినతి..**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకమై వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులమైన తమకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేదని నెలనెల వేతనాలు ఆలస్యం కావడంతో పాటు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నమని వైద్య విధాన పరిషత్ ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసి ట్రెజరీ శాలరీస్ పరిధిలోనికి తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామూహిక వినతి పత్రాల కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే సిబ్బంది ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్ కి ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పద్మలత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ మాధవి, నర్సింగ్ సిబ్బంది హేమలత, పారా మెడికల్ సిబ్బంది సునీత ఫార్మాసిస్టు పూర్ణిమ నందకిషోర్ లక్ష్మి, శ్రేణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఎన్‌హెచ్ఎఐ పనుల పురోగతిపై పీడీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, ప్రతి అంశాన్ని కలెక్టర్ వివరంగా పరిశీలించారు. రోడ్డు విస్తరణలో ఎదురవుతున్న ఇబ్బందులు, భూ స్వాధీనం, కోర్టు కేసులు వంటి అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. కేసుల పూర్వపరాలు సేకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణం ప్రజలకు అత్యంత కీలకమని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.రోడ్డు విస్తరణకు అవశ్యకమైన అనుమతులు, ఫీల్డ్ స్థాయి పరిశీలనలు, అడ్డంకుల తొలగింపు ప్రక్రియలను వేగవంతం చేయాలని, ప్రజల నుండి వచ్చే వినతులను కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్‌హెచ్ఎఐ అధికారులు కూడా నిర్మాణానికి సంబంధించిన కీలక అంశాలను సమావేశంలో వివరించారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, ఎన్‌హెచ్ఎఐ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృత్రిమ గర్భధారణ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

● **జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జి శివానంద స్వామి**



**మల్దకల్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** మండలం పరిధిలోనికుర్తిరావులచెర్వు గ్రామంలో బుధవారంఉచిత గర్భకోశావ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జి శివానంద స్వామి,ఏడి డాక్టర్ రమేష్ హాజరయ్యారు. రైతులు పశువులు ఉన్న రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని,సకాలంలో పశువుల ఏదను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించి ఏడాదికి ఒక పశువుకు ఒక దూడ వచ్చేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాగంగా 13 పశువులకు చూలు పరీక్ష 11 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించటం జరిగింది.అలాగే 24 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించటం జరిగింది.ఈ కార్యక్రమంలోపశువైద్యాధికారులు డా!వినయ్ కుమార్, డా.ఉషా,డాక్టర్ యామినిసాయి, డాక్టర్ వెంకట్రాజు పాల్గొని చికిత్స చేశారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాజేంద్ర,యుగేందర్ రెడ్డి,అర్జున్ సింగ్,విఏ రామాంజనేయులు, రమేశ్వరయ్య,రాము,మధు తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వహించాలి

● **మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

**పాపన్నపేట, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** గురువారం జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ వ్యాఖ్యానించారు. గురువారం పాపన్నపేట మండల గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బుధవారం తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, సిబ్బందితో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పాపన్నపేట మండలంలో లోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పంపిణీ కేంద్రాన్ని సందర్శించి,పోలింగ్ అధికారులకు ఇచ్చిన సామాగ్రిని పరిశీలించారు. పంపిణీ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు.పీ.ఓ..ఓ.పీ.ఓ లతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన



వాహనాలను పరిశీలించి,సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలన్నారు.మైక్రో అబ్జర్వర్లలతో మాట్లాడి పలు సూచనలు చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలన్నారు. పంపిణీ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. పోలింగ్ సామాగ్రి,ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. జిల్లాలో మొదటి విడత స్థానిక ఎన్నికలలో 160 గ్రామ పంచాయతీలు ఉండగా 16 గ్రామ పంచాయతీలు సర్పంచులు ఏకగ్రీవమయ్యాయని మిగిలిన 144 గ్రామ పంచాయతీలకు గాను 411 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారన్నారు. 1402 వార్డులకు గాను 332 ఏకగ్రీవం కాగా పాపన్నపేట మండలంలోని ఆర్కేల గ్రామంలో రెండు వార్డులకు ఎలాంటి నామినేషన్లు రాలేదన్నారు. 1068 వార్డులకు గాను 2426 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారని తెలియజేశారు. ఆరు మండలాలకు గాను 1292 పోలింగ్ కేంద్రాలు,14 21 పిఓలు,1529 ఓపిఓలు,155 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించినట్టు వెల్లడించారు. జిల్లా సైన్స్,పాపన్నపేట ఎన్నికల పర్యవేక్షణ అధికారి రాజిరెడ్డి,ఎంపీడీఓ విష్ణువర్ధన్, తహసీల్దార్ సతీష్ కుమార్ ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
11 డిసెంబర్ 2025

# పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్త్

- ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించాలి
- ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పి డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** కల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందరరేగాకోస్గి,గుండుమల్, మద్దూర్, కొత్తపల్లి మండలా ల్లో ఎన్నికల నిర్వహణను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిపేందుకు నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మద్దూరు, కొత్త పల్లి మండల లకు గ్రామపంచాయతీ ఎన్నికల బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు సిబ్బందికి మద్దూర్ మండలం లోని షా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కోస్గి, గుండు మాల్‌లో బందోబస్తు కు వచ్చిన పోలీ సులకు పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ భద్రత పరమైన సూచనలు చేశారు. ఈ నాలుగు మండలాలకు మొత్తం 650 మంది పోలీసు ఫోర్స్, 02 టిఎస్ఎస్‌పి బెటాలియన్స్, సిఐడి నుండి వచ్చిన ఫోర్స్‌తో బారి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ప్రతి గ్రామంలో భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఈ నాలుగు మండలాల్లో మొత్తం 67 గ్రామ పంచాయతీలు ఉండగా, 12 ఏకగ్రీవం అయ్యావి అని, మిగతా 55 గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహణ జరుగు తోందని తెలిపారు. అందులో 13 సమస్యత్మక గ్రామ పంచా యతీలు ఉన్నాయి అని, అందులో 27 సమస్యత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించ బడినట్లు ఎస్పీ పేర్కొన్నారు.సమస్యాత్మక గ్రామపంచా యతీలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువ ఫోర్స్‌తో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయ డం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ఇన్సిడెంట్ ఫ్రీగా నిర్వహించాలని,ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండా లని తెలిపారు. విధి నిర్వ హణలో బాధ్యత రాహితంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే మద్దూరు, కొత్త పల్లి లో మండలాలకు మొత్తం 18 రూట్లుగా, కోస్గి, గుండు మాల్ మండలలో 15 రుట్లూ గా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిం దని తెలిపారు. రూట్ మొబై ల్ ఆఫీసర్లు నిరంతరం పెట్రో లింగ్ నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలని, గ్రామాలలో గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని, ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం, డబ్బులు పంపిణీ,రాజకీయ పార్టీలు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పోలింగ్ బూత్ దగ్గర విధులు నిర్వర్తించే పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉం టూ పోలింగ్ బూత్ వద్ద క్యూ లైన్స్ మైంటైన్ చేయాలని, ఎలాంటి గొడవలు జరుగ కుండా శాంతియుతంగా పోలింగ్ జరిగే విధంగా చూడాలని తెలిపారు.పోలిం గ్ బూత్ నుండి 200 మీటర్ల వరకు ప్రజలు దూరంగా ఉండాలనీ అత్యవసరమైతే వెంటనే సంబంధిత లోకల్ పోలీసులకు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కి సమాచారం ఇవ్వాలని అన్నా రు.అందరూ శాంతియు తంగా ఎన్నికలు నిర్వహించే విధంగా కష్టపడి బాగా పని చేయాలని సూచించారు. ఎన్నిక సమయంలో ప్రతి పోలీసు అధికారి తన డ్యూ టీని పూర్తిగా నిబద్ధతతో నిర్వర్తించి, న్యాయబద్ధంగా నిష్పక్షికంగా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడడం అత్యంత కీలకమని పేర్కొ న్నారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా, ప్రతి సమస్యాత్మక గ్రామం,పోలింగ్ కేంద్రంలో అదనపు ఫోర్స్‌ను మోహ రించి మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల సంద ర్భంగా ఎవరైనా భంగం కలి గించే ప్రయత్నం చేస్తే ఎవ్వ రినీ విడిచిపెట్టమని. అల్లర్లు, భయభ్రాంతులు స ృష్టించా లని చూస్తే వారిపై చట్టప రమైన కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.ప్రజాస్వామ్య వ్యవస్థను ఎవరైనా దెబ్బతీయాలనే ఉద్దేశంతో చుట్టూ తిరిగే వ్యక్తులు, గుంపులు ఎవరైనా ఉన్నా వెంటనే అరెస్టులు చేసి, కఠినంగా వ్యవహరి స్తాం" అని స్పష్టం చేశారు. ప్రజలు ధైర్యంగా,భయభ్రాంతులు లేకుండా స్వేఛగా తమ ఓటు హక్కును విని యోగించాలని, అనుమా నాస్పదంగా కనిపించే కార్య కలాపాలను వెంటనే పోలీ సులకు సమాచారం అందిం చాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్ లు, సీఐ సైదులు, ఎస్సైలు విజయ్ కుమార్, బాలరాజు, పోలీసు అధికారులు, సిబంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



**సంగారెడ్డి టౌన్ డిసెంబర్ 10 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల మొదటి విడత ఎన్నికలు నేడు సంగారెడ్డి మండలం 11 గ్రామపంచాయతీలకు పోలింగ్ ఎన్నికలు నిర్వహించేందుకు సమర్ధవంతంగా పోలింగ్ నిర్వహించేందుకు, ఎన్నికల సమగ్రితో సంగారెడ్డి మండలంలోని 11 గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది సమగ్రత తరలి వెళ్లారు పోలీసు బందోబస్తు మధ్యన పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని అలాంటి పోలి కేంద్రాల దగ్గర సంఘటనలు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు పోలీస్ పోలీసునిగా సంగారెడ్డి మండలం 11 గ్రామపంచాయతీలకు సమర్థవంతంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య, పోలింగ్ సిబ్బందికి సమగ్రని అందించారు పోలింగ్ సిబ్బంది ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామపంచాయతీలకు తరలి వెళ్లారు.

## ముంపు కాల్వల నిర్మాణ పనుల పరిశీలన



**జడ్చర్ల, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం చేపడుతున్న ముంపు కాలువల (డ్రైనేజీ) నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ భాస్కర్ రెడ్డి, డిఈ మల్లేష్, విద్యుత్ ఏడి చంద్రశేఖర్ లు పరిశీలించారు. ఈ మేరకు అధికారులు మున్సిపాలిటీ పరిధిలో 14 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న ముంపు కాల్వలు, కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణ పనులలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. అలాగే నూతనంగా నిర్ మున్సిపల్ కార్యాలయ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపును పరిశీలించారు. నల్లకుంట, నాగర్ కర్నూల్ రోడ్, కావేరమ్మపేట రోడ్డులో నిర్మాణం చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పర్యవేక్షించి పనులను త్వరగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంట్రాక్టర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ విజేత గీతం

- 1.5 లక్షల నగదు పురస్కారం




**పటాన్‌చెరు, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** జాతీయ సా'యి పోటీలలో గీతం విద్యార్థులు మరోసారి రాణించారు. అహ్మదాబాద్ (గుజరాత్) నోడల్ సెంటర్‌లో ఇటీవల జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) 2025ను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు జట్టు గెలుచుకుంది. ఆ జట్టు వినూత్న సాంకేతిక పరిష్కారాన్ని మెచ్చిన జ్యూరీ రూ. 1.5 లక్షల నగదు పురస్కారాన్ని అందజేసి సత్కరించింది. బీటెక్ సీఎస్ఈ, ఏఐఎంఎల్ రెండో యేడాది విద్యార్థులు కె.క ృష?ప్రియ, అబ్దుల్ బాసిత్ హసన్ షేక్, కె.అమోఘ్, కర్మన్ ఘాట్ యశ్వంత్, యుక్త చావలి, శరణ్య మదీనాలతో కూడిన విజేత బృందం, ప్రభుత్వ ఈ-కన్సల్టేషన్ మాడ్యూల్ ద్వారా సమర్పించే ప్రజా వ్యాఖ్యల యొక్క సెంటిమెంట్ విశ్లేషణ కోసం క ృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వేదికను అభివృద్ధి చేసింది. విధాన రూపకర్తలు సెంటిమెంట్, విధాన వైఖరిని వర్గీకరించడం, సారాంశాలను రూపొందించడం, సాక్ష్యం ఆధారిత నిర్ణయం తీసుకోవడాన్ని ప్రారంభించడం ద్వారా ముసాయిదా చట్టాలు, నిబంధనలపై పౌరుల అభిప్రాయాన్ని పెద్ద మొత్తంలో సమర్థవంతంగా విశ్లేషించడానికి ఈ ఏఐ వేదిక సహాయ పడుతుంది. ఈ బృందానికి మార్గదర్శి (మెంటార్)గా వ్యవహరించిన డాక్టర్ చంద్రశేఖర్ ఉద్దగిరి, విద్యార్థుల విజయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'ఈ అద్భుతమైన బృందానికి మార్గదర్శకత్వం వహించడం చాలా గర్వకారణం. వారి పరిష్కారం, దాని ఆవిష్కరణ, సాధించగల ప్రభావం జ్యూరీని ఆకట్టుకుంది. వారి కృషి, అంకితభావానికి విద్యార్థులందరికీ అభినందనలు' అని ఆయన వ్యాఖ్యానించారు. గీతం హైదరాబాదులోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) సహకారానికి డాక్టర్ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆవిష్కరణ, అనుభవపూర్వక అభ్యాసంపై వారి నిరంతర సహకారం, ఈ ప్రతిష్టాత్మక జాతీయ విజయంలో కీలక పాత్ర పోషించినట్టు వీడీసీ తెలియజేసింది.

# పోలింగ్ సక్రమంగా జరిగేలా చూడాలి



**ఉర్కొండ, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కల్వకుర్తి ఊరుకొండ మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందిచే తరలించే ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పరిశీలించారు. కల్వకుర్తి డివిజన్లోని ఊరుకొండ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బ ృందాలన్నీ హాజరయ్యారా లేదా అనే అంశాన్ని సమీక్షించారు. పోలింగ్ అధికారులకు అందజేస్తున్న పోలింగ్ మెటీరియల్‌ను స్వయంగా చెక్ చేసి, పంపిణీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది, ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా కలెక్టర్ పరిశీలించి, సిబ్బంది సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పర్యవేక్షణ చేయాలని మైక్రో అబ్జర్వర్‌లకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామాగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని, బ్యాలెట్ పత్రాలను ప్రత్యేక జాగ్రత్తతో చెక్కు చేసి ప్యాక్ చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అన్ని ఏర్పాట్లను మరోసారి నిర్ధారించుకోవాలని సూచించారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, పోలింగ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామగ్రి పంపిణీ సమయంలో ప్రతి పోలింగ్ బ ృందానికి అవసరమైన సామాగ్రి సమయానికి అందించేందుకు ప్రత్యేక డెస్కులను కలెక్టర్ పర్యవేక్షించారు. బ ృందాలు వచ్చిన క్రమానుసారం రిజిస్ట్రేషన్ నుంచి మెటీరియల్ పంపిణీ వరకూ మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఎక్కడ ఆలసత్వం, అయోమయం తలెత్తకుండా తగిన సూచిక బోర్డులు, సహాయక కేంద్రాలు ఏర్పాటు సరి చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలింగ్ సిబ్బందికి త్రాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య అత్యవసర సదుపాయాల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సామాగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో బందోబస్తు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్, మార్గ సౌకర్యాలు సమగ్రంగా ఉండేలా చూడాలని, ఏవైనా లోపాలు కనిపించిన వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## మానవ హక్కులను పరిరక్షిద్దాం



**నారాయణపేట, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దామని నారాయణపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. సాయి మనోజ్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యం లో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ సంద ర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించినవి. ప్రపంచంలో పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించడానికి ఏటా డిసెంబర్ 10న 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం' జరుపుకుంటున్నాం. తమ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ, స్త్రీ మరియు పురుష ఆధిక్యత, వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డేగే హోమ్ గురించి సీనియర్ సిటిజన్స్ చట్టాలు వయో వృద్ధులకు న్యాయ సేవలు పథకాలు అనుగుణంగా సామాన్య ప్రజలు ఏవిదంగా న్యాయం పొందాలి పలు చట్టాల వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కే.సురేష్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కే.లక్ష్మిపతి గౌడ్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పారాలీగల్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ



**వనపర్తి/గోపాల్‌పేట్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గోపాల్ పేట్ మండలంలోని పోలికపాడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు శాంతియుతంగా జరగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగేందుకు అభ్యర్థులు, రాజకీయ నాయకులు,స్థానిక ప్రజలందరూ పోలీసులకు సహకరించాల్సిందిగా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య గోపాల్పేట ఎస్సై,నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఖిల్లా పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ప్రశాంత వాతావరణం ఎన్నకలను నిర్వహించాలి
- జాయింట్ కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ఖిల్లా ఘనపురం, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల పరిధిలో 29 గ్రామ పంచాయతీల గాను రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 27 గ్రామాలకు నేడు పోలింగ్ నిర్వహించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సందర్శించిన సందర్భంగా తెలిపారు. అనంతరం సంబంధిత ఎన్నికల అధికారులకు పాలు సలహా సూచనలు చేస్తూ ప్రజా శాఖల అధికారులు ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చిన వారికి కావాల్సిన ఎన్నికల సామాగ్రిని అందచేయ్యాలని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు,పనిచేసే అందరిని సమానంగా చూసి ఓటు హక్కు ను ప్రతి ఒక్కరు వినియోగించుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఓటర్లను ప్రలోభే పెట్టకుండా స్వఛరేదంగా ఓటు హక్కును వినియోగించుకునెల ప్రజ సామ్య బద్దంగా ఎన్నికలను జరిగేలా చూడాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో తశిల్దర్ సుగుణ, ఎంపిడిఓ విజయ్ సింహ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రక్రియను నిర్ణీత సమయంలో ప్రారంభించాలి

- మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలి
- సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సందర్శించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11 జిల్లాలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తీసుకున్న సిబ్బంది ఒకటికి రెండుసార్లు సామాగ్రిని సరి చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని, పోటీ చేసే అభ్యర్థులకు సమానంగా గుర్తులు ఉన్నాయా లేదా నిశితంగా పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల సరఫరా ఉండేలా చూడాలన్నారు.పోలింగ్ కేంద్రాలలో ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, ఎంట్రీ, ఎగ్జిట్, తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. జిల్లాలో మూడు విడతలలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత లో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగితే మిగతా రెండు విడతలు కూడా అదే విధంగా జరుగుతాయని ఆమె తెలిపారు.పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ కోస్గి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంత ృప్తి వ్యక్తం చేశారు. అక్కడ పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం,భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బ ృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని,చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు.పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ ద ృష్టికి తేవాలని ఆర్‌ఓలకు సూచించారు.పోలింగ్ సామాగ్రిని సర్దుకుని కేంద్రంలో భోజనం చేస్తున్న పీవోలు, ఓపివోల వద్దకు వెళ్ళిన కలెక్టర్ భోజనం చేశాక మరోసారి పోలింగ్ సామాగ్రినీ సరిచూసుకోవాలని తెలిపారు.భోజనం బాగుందా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఆమె బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్లు వెంట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, శ్రీను కొత్తపల్లి, గుండుమల్ మండల కేంద్రాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, ఆయా మండల ల తహాసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటుహక్కు వినియోగించుకోవాలి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట డిసెంబర్ 10 (జనం సాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జరగనున్న పోలింగ్ లో అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటింగ్ హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, దండేపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హాజీపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మొదటి విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఓటింగ్, కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో భాగంగా ఈ నెల 11వ తేదీన జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో ఏకగ్రీవం అయిన స్థానాలను మినహాయించి మిగిలిన 81 గ్రామపంచాయతీ సర్పంచ్, 514 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2 వేల 600 మంది పోలింగ్ విధులు, 400 పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారని, 24 వెబ్ కాస్టింగ్ లొకేషన్ల ద్వారా 200 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ ఉంటుందని, 20 మంది సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల ప్రచారం ముగిసిందని, ఈ నెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని, గత ఎన్నికలలో 85.26 శాతం ఓటింగ్ నమోదు అయిందని, ఈసారి 90 శాతం నమోదు జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు.

## ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులు

- ఏదైనా చూపించి ఓటేయొచ్చు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 10(జనంసాక్షి) :** ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్/ బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్ కార్డు, ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐ.డీ కార్డ్, ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్ స్మార్ట్ కార్డు.. వీటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## సర్పంచ్ బరిలో వృద్ధురాలు!


- అమీనాబాద్ లో బరిలోకి దిగిన బరిగెల కట్టమ్మ...



**చెన్నారావుపేట, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** 70 సంవత్సరాల వృద్ధురాలు సర్పంచ్ బరిలో నిలుచుంది. మండలంలోని అమీనాబాద్ గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీ జనరల్ కు కేటాయించారు. ఇదే గ్రామం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బరిగెల కట్టమ్మ 70 సంవత్సరాల వృద్ధురాలు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసింది. ఏ పార్టీలకు సంబంధం లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గ్రామస్తులు ఆదరించి సర్పంచ్ గా గెలిపిస్తే ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ తన సేవలు అందిస్తానని ఇంటింటికి తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తుంది.

## సర్పంచ్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేయాలి

- కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలి
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**చెన్నారావుపేట, డిసెంబర్ 10 (జనంసాక్షి):** సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం చెన్నారావుపేట గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి రాధారపు నాగలక్ష్మి ప్రతాప్ రెడ్డిని టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచిగా గెలిస్తేనే మన ప్రభుత్వంలో మన గ్రామాలను మనం మరింత అభివృద్ధి దిశగా నడిపించుకోవచ్చన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అభివృద్ధి ఏజెండాగా ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను కచ్చితంగా తీసుకెళ్లాలని గడిచిన రెండు ఏళ్లలో చేసిన అభివృద్ధిని అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, చెన్నారావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, జిల్లా నాయకులు ఓర్సు తిరుపతి, మొగిలి వెంకటరెడ్డి, చెన్నారావుపేట ఎన్నికల అబ్జర్వర్ చింతల సాంబ రెడ్డి, వేముల సాంబయ్య, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, మాదారపు చరణ్, కందిక ప్రవీణ్ కుమార్, బొంత రజిత శ్రీనివాస్, బండి పద్మ, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గురుశిష్యుల కలయిక

- ఒకే మండల కేంద్రంలో ఎన్నికల విధులు



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్10 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాల్లో నేడుజరుగుతున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో చదువు నేర్పిన గురువులు, శిష్యులు ఒకే చోటా కలిసిన సంఘటన ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండల కేంద్రంలో చోటుచేసుకుంది.. పెంబి మండల కేంద్రంలోని ఎన్నికల సామాగ్రి పంపిన సెంటర్ లో హరినాథ్ శిష్యుడు జంగిటి శేఖర్ , శేఖర్ శిష్యుడు మోయిజ్ ,మెయిజ్ శిష్యుడు రవి కుమార్ గురు, శిష్యులు గ్రామ పంచాయతీ ఎన్నికల విధులలో కలుసుకొని యోగక్షేమలు తెలుసుకున్నారు.. అక్కడ ఉన్న ఇతర ఉద్యోగులు వీరిని అభినందించారు. వీరంతా నిర్మల్ కు చెందిన ఉపాధ్యాయులు కావడం గమనార్హం.

## ఎన్నికల వ్యయంపై అవగాహనా సదస్సులు



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల వ్యయం పై అవగాహన సదస్సు ల ను హనుమకొండ జిల్లాలోని నడికూడ, దామెర, శాయంపేట మండలాల్లో బుధవారం నిర్వహించారు. దామెరలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సుకు జిల్లా ఎన్నికల పరిశీలకులు దేవేందర్, ఎంపీడీవో కల్పన, ఇతర అధికారులు పాల్గొని అభ్యర్థులకు ఎన్నికల వ్యయంపై అవగాహన కల్పించారు. శాయంపేట, నడికూడ లలో ఎంపీడీవోలు ఫణి చంద్ర, రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొని ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన కల్పించారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరగనున్న గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకం, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మొత్తం 570 మంది పోలీసు అధికారులు సిబ్బందితో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు లేదని అన్నారు. అధికారులు, సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా, క్రమశిక్షణతో పనిచేయాలని, ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బందోబస్తు సిబ్బందికి అన్ని స్పష్టమైన ఆదేశాలు ఇప్పటికే జారీ అయ్యాయని తెలిపారు. జిల్లాలోని గణపురం, రేగొండ, గోరికొత్తపల్లి, మొగుళ్లపల్లి మండలాలలో ఏకగ్రీవం అయిన 5 గ్రామపంచాయతీలను మినహాయించి, మొత్తం 86 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లు ఇబ్బంది లేకుండా ఓటు వేయడానికి అవసరమైన సహాయాన్ని అందించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుమికూడడం నిషేధమని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సున్నితమైన కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు అదనపు పికెట్టింగ్, స్ట్రైకింగ్ ఫోర్సులు వీడియో రికార్డింగ్ టీంలు, క్విక్ రెస్పాన్స్ టీంలు విధులు సక్రమంగా నిర్వహించాలని నిషేధిత కార్యకలాపాలు, పోలింగ్ స్టేషన్ వద్ద పార్టీ చిహ్నాలు, ప్రచార సామగ్రి అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ బూత్‌లో మొబైల్ ఫోన్లు నిషేధమని, ఓటర్లపై ఒత్తిడి, బెదిరింపులు, గుంపులు గుమికూడడం పూర్తిగా చట్టవిరుద్ధమని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మద్యం పంపిణీ, డబ్బుల పంపిణీ, ఉద్రిక్తత సృష్టించడం వంటి కార్యకలాపాలు జరిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని, విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమని, సోషల్ మీడియా లేదా ఇతర ప్లాట్‌ఫార్ములలో తప్పుడు ప్రచారం, వ్యక్తులను, పార్టీలను కించపరచే పోస్టులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 219, పోలింగ్ కేంద్రం సమీప ప్రాంతాల్లో ప్రచారం చేయడం నిషేధమని, జిల్లాలో ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ సిబ్బంది తన విధులను అత్యంత క్రమశిక్షణతో నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ కోరారు. అనంతరం సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను ఎస్పీ పరిశీలించారు.

## మొదటి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం

**భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 10 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో గురువారం జరగనున్న మొదటి విడత ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కమలాపూర్ లోని మోడల్ స్కూల్ లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా ఎంతమంది పోలింగ్ సిబ్బంది హాజరయ్యారని, ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారని, ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఎన్ని వాహనాలను ఏర్పాటు చేశారని, ఎన్నికల సిబ్బంది కోసం ఏర్పాటుచేసిన భోజన సదుపాయాల గురించి కలెక్టర్ పరిశీలించి వివరాలను ఎంపీడీవోలు వీరేశం, బాబులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లను, హెల్ప్ డెస్క్ లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీని కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా రూట్స్ అలాట్ చేసి జోనల్ రూట్ ఆఫీసర్ల సమన్వయంతో ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బందికి ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభమవుతుందని, అందుకు సిబ్బంది ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. హనుమకొండ జిల్లాలో మొదటి విడత మూడు మండలాలైన భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల్లో 69 గ్రామపంచాయతీల గాను ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని, 64 గ్రామపంచాయతీలకు, 153 వార్డులు ఏకగ్రీవం కాగా 505 వార్డులకు గురువారం పోలింగ్ జరగనుందని తెలిపారు. 69 గ్రామ పంచాయతీలలో 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో రవి, భీమదేవరపల్లి, కమలాపూర్ తహసిల్దార్లు రాజేష్, సురేష్ కుమార్, ప్రత్యేకాధికారులు అనసూయ, నరసింహస్వామి, జోనల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ఆత్మకూర్, డిసెంబర్ 10 (జనం సాక్షి):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో, నీరుకుళ్ళ, పెద్దాపూర్, అక్కంపేట గ్రామాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైందని, ఆ పార్టీ మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు.మండలంలోని గ్రామాలలో ఏనాడు జరగని అభివృద్ధి మన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని గుర్తుచేశారు.గ్రామాలలో మనం చేసిన అభివృద్ధి కళ్ళముందు కనిపిస్తున్నది ప్రజలు గమనించాలి.కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడాల్సిన అవసరంలేదని అన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు లేతకుల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బో ల్లోజు కుమారస్వామి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాకాని శ్రీధర్, వంగేటి వేణు నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- భైంసాలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల




**భైంసా, డిసెంబర్10 (జనం సాక్షి) :** భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుదువారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు "నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

### పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## ఓటర్లకు మౌలిక వసతులను స్వయంగా పరిశీలించిన అబ్జర్వర్ ఐశా మస్రత్ ఖనం



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్10 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందర్భంగా నిర్మల్ జిల్లా జనరల్ ఆబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం మంగళవారం పెంబి మండలంలోని యాపాలగూడ గ్రామ పంచాయతీని సందర్శించారు. పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలీస్టేషన్లకు చేరుకునే ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో వాగు ఉండడం వల్ల, స్థానికంగా తయారు చేసిన థర్మాకోల్ పడవను ఉపయోగించి సిబ్బందిని సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏర్పాట్లను ఆబ్జర్వర్ సమగ్రంగా పరిశీలించి, సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరుగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రేపే మొదటి విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు. నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు, సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆబ్జర్వర్ స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
11 డిసెంబర్ 2025

# ఖమ్మం పాత బస్టాండ్‌లో అధికారుల 'వసూళ్ల దందా'

- రసీదు లేదు..
- లెక్కా పత్రం లేదు..
- అధికారుల జేబుల్లోకి 28 లక్షలు..?
- మార్కెట్‌లో బీజేపీ ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం టౌన్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** ఖమ్మం నడిబొడ్డున బ్రతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న కూరగాయల మార్కెట్ ఇప్పుడు అవినీతికి అడ్డాగా మారిందంటూ భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. పాత బస్టాండ్ సమీపంలోని వీధి వ్యాపారుల నుండి అధికారులు అక్రమంగా లక్షల రూపాయలు వసూలు చేశారని, నెలలు గడుస్తున్నా వారికి రసీదులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం బీజేపీ శ్రేణులు సంఘటనా స్థలాన్ని సందర్శించాయి. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పేదల కష్టార్జితాన్ని దోచుకుంటున్న అధికారుల తీరుపై, స్థానిక రాజకీయాలపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్, టీటీడీ కల్యాణ మండపం సమీపంలో గత అనేక సంవత్సరాలుగా సుమారు 40 నుండి 60 కుటుంబాలు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పుడు కూడా వీరు ఇక్కడే వ్యాపారం చేసుకునేవారు. అయితే 2014 తర్వాత అప్పటి ప్రభుత్వం ఇక్కడ షెడ్లను పొడిగించినప్పటికీ, వాటికి సంబంధించిన పూర్తి అనుమతుల విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రస్తుత మెప్మా అధికారులు, లైసెన్సులను పునరుద్ధరించడానికి అంటూ ఒక్కొక్కరి దగ్గర నుండి 10 వేల రూపాయల చొప్పున వసూలు చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. పేద వ్యాపారుల నుండి ఇంత భారీ మొత్తంలో వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవసాని వాసుదేవరావు మరియు జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు ఇతర నాయకులతో కలిసి నేరుగా మార్కెట్‌ను సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ మెప్మా పీడీ సుజాత, శివరామకృష్ణ అనే అధికారులు వ్యాపారుల నుండి రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల జిరాక్సులు తీసుకొని, దాదాపు 28 లక్షల రూపాయలకు పైగా నగదును మూడు నెలల క్రితమే వసూలు చేశారని ఆరోపించారు. డబ్బులు కట్టి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్కరికి కూడా రసీదు ఇవ్వలేదని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులకు రసీదు ఇవ్వకుండా ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఇక్కడ ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటున్న వారిని బెదిరించి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చి పెట్టే కుట్ర జరుగుతోందని బీజేపీ నేతలు ఆరోపించారు. స్థానిక వ్యాపారులు గంజాయి లేదా డ్రగ్స్ అమ్ముతున్నారంటూ అబద్ధపు ప్రచారాలు చేస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేసి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే, తమకు అనుకూలమైన వారిని అక్కడ చొప్పించడానికి అధికారులు, కొంతమంది స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారని, ఇది అత్యంత హేయమైన చర్య అని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడి పొట్ట కొట్టి రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి వసూలు చేసిన 28 లక్షల రూపాయలకు పక్కా లెక్క చెప్పాలని, లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయపరమైన పోరాటం చేస్తామని నెల్లూరి కోటేశ్వరరావు అల్టిమేటం జారీ చేశారు. అక్రమంగా డబ్బులు వసూలు చేయడం ఒక దందాగా మారిందని, రసీదు లేకుండా ప్రజల డబ్బును తీసుకోవడం మనీ లాండరింగ్ కిందకే వస్తుందని వారు గుర్తుచేశారు. తరతరాలుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకుంటే వారి అర్హతలను పరిశీలించి వేరే చోట స్థలం కేటాయించాలి తప్ప, ఉన్నవారి ఉపాధిని దెబ్బతీయవద్దని తేల్చిచెప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకు బాధితులకు అండగా ఉంటామని బీజేపీ నేతలు హామీ ఇచ్చారు.

## విద్యార్థికి గోల్డ్ మెడల్ బహూకరించిన ఇమ్మడి భద్రయ్య



**దేవరకొండ, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రమశిక్షణగా మెలగాలని, మీ తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయాలని శ్రీ గరుడాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఉపాధ్యక్షులు, సీనియర్ ఎల్ఐసి ఏజెంట్, ఇమ్మడి భద్రయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా కీర్తిశేషులు ఇమ్మడి వీర మల్లయ్య- తిరుపతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్ఐసి లో ఘనాపాటి,ఎల్ఐసిలో ఎంతోమందికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఇమ్మడి భద్రయ్య గుండాల శ్రీనాథ్ విద్యార్థికి గోల్డ్ మెడల్ బహూకరించారు. ఈ సందర్భంగా ఇమ్మడి భద్రయ్య విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో, పట్టుదలతో చదివితే భవిష్యత్తు బంగారు మయం అవుతుందని, భయం వీడితే విజయం సొంతం అవుతుందని అన్నారు.ప్రతి ఒక్కరూ నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రతిక్షణం పరితపిస్తూ ముందుకు సాగితే ఎలాంటి విజయాలైన కూడా సాధించగలుగుతామని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ నిజానికి ఇమ్మడి భద్రయ్య దాతృత్వంలో తండ్రికి మించిన తనయుడు అని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరు అన్న అనగానే నేనున్నానంటూ అపన్న హస్తం అందిస్తున్న ఇమ్మడి భద్రయ్యకి కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులతోనే పంచాయతీల అభివృద్ధి



**చంద్రుగొండ, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా గ్రామాలలో అభివృద్ధి జరుగుతుందని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారి ఆదినారాయణ తెలిపారు. బుధవారం సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ బలపడుతున్న అభ్యర్థుల ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తద్వారా ఆ గ్రామాలలో అభివృద్ధికి బాట వేసినట్లేనని తెలిపారు. మద్దుకూరు తిప్పనపల్లి సీతయ్య గూడెం తుంగారం రేపల్లెవాడ పంచాయతీలో ఆయన పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దారం గోవింద్ రెడ్డి, బోజ్యానాయక్, సారేపల్లి శేఖర్ సయ్యద్ రసూల్ ఆయా గ్రామాల అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌కు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వేముల



**రామన్నపేట, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నారపాక మాధవి యాదయ్య ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందనలు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు మెచ్చి ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వస్తున్నారనటానికి ఈ ఏకగ్రీవ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ లు గుత్త నర్సిరెడ్డి, కొండ బుచ్చిబాబు, గంగుల కృష్ణారెడ్డి, మందడి ఉదయ్ రెడ్డి, ఎండి రెహమాన్, వర్కాల మొగులయ్య, నారపాక యాదయ్య, నారపాక అశోక్, చల్లా బిక్షం, నారపాక లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా ఓటు వినియోగించుకోవడానికి సహకరించండి



**టేకులపల్లి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** టేకులపల్లి మండలంలో మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓట్లు స్వేచ్ఛగా వినియోగించుకునేలా సహకరించాలని ఇల్లందు డీఎస్పీ చంద్రబాను,సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఎన్నికల కోడ్, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బోడు లో తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భం గా అక్కడ ఉన్న వివిధ పార్టీల నాయకులు,ముఖ్య కార్యకర్తలతో డీఎస్పీ చంద్రబాను, సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్ ఐ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. గ్రామీణ స్థాయి నుండి మండల స్థాయి వరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.పోలీసుల సూచనలు పాటిస్తూ, ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యాత్మక అంశాలపై పోలీసులు నిఘా ఉంచారని, అందరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలు పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** నేడు జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ కె.నరసింహ సూర్యాపేట మండల పరిధి ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి విధులు నిర్వహణపై సలహాలు, సూచనలను అందజేశారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడటంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని అన్నారు.బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దని అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలని,అనుమతి లేని వ్యక్తులను ఓటరు కాని వారిని పరిసరాల్లో రానివ్వద్దన్నారు. 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు.ఓటర్లు సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తీసుకువస్తున్నారా అనే దానిపై నిఘా ఉంచాలని అన్నారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.విధుల నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు లేదా ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వాటిని వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమష్టి బాధ్యత అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



## సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**నూతనకల్, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో అధికారులు పారిదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్ పవార్ అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బంది నిబంధన మేరకు విధులు నిర్వహించాలని ఎలాంటి ప్రలోభాలకు గురైనా,విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టేజ్ 2 ఆఫీసర్లతో పాటు పోలింగ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించి వారికి కేటాయించిన గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.సిబ్బందికి కేటాయించినటువంటి పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నియమావళి ప్రకారము ఎన్నికల సమయము పూర్తయ్యే వరకు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులకు గురైన ఎన్నికల ప్రత్యేక అధికారులకు సమాచారం అందించాలని,ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని,సిసి కెమెరాలతో పాటు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు.ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, మండల విద్యాధికారి రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



**చేర్యాల, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను ఎదగకుండ చేస్తున్న జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య విద్యా సంస్థల గుర్తింపును రద్దు చెయ్యాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగ శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఒలంపియాడ్, సీబీఎస్ సీ,ఐపీఎల్, స్టేట్ సెలబస్ రకరకాలుగా విద్యార్థులపై వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని విద్యాసంస్థలు పర్మిషన్ లేకుండా వ్యాపారం చేస్తున్నా కూడా విద్యాశాఖ అధికారులకు కనిపిస్తలేదా ప్రభుత్వ జీతం తీసుకుంటూ కూడా శ్రీ చైతన్య విద్యాసంస్థల సొమ్ముకు కాపు కాస్తున్న పరిస్థితి ఉందని, విద్యాశాఖ అధికారులు తక్షణమే విద్యాసంస్థలు గుర్తింపును రద్దు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకలు ఆరిత్య, రాకేష్, భరత్ పాల్గొన్నారు.

## పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

- పట్టించుకోని అధికారులు
- కలుషితమవుతున్న తాగునీరు



**చండూరు, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** చండూర్ మున్సిపాలిటి పరిధిలో 9వ వార్డు కు చెందిన ఇందిరా కాలనీ నందు గత రెండు వారాల నుండి మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా... ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పట్ల కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ ఏర్పడిన చోట నీరు నిల్వ ఉండడం వలన గుంటలా ఏర్పడి అందులో పందులు, కుక్కలు పొర్లడుతున్నాయి.అదేవిధంగా పైప్ లైన్ కు పడిన రంధ్రం గుండా కాలనీకి సంబంధించిన డ్రైనేజ్ నీరు పైపులోకి వెళుతుందని ఈ కలుషితమైన నీటిని తాగడం వల్ల 9వ వార్డు ప్రజలే కాకుండా మిగతా వార్డు ప్రజలు సైతం అనారోగ్యానికి గురవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రంధ్రం పడిన మిషన్ భగీరథ లైన్ పైపుకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- నేడు 152 సర్పంచ్, 1244 వార్డులకు పోలింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్


**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 159 గ్రామపంచాయతీలు, 1442 వార్డులో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.ఇందులో 7 సర్పంచులు ,198 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని, 3 వార్డులకు ఎలాంటి నామినేషన్లు రాలేదని తెలిపారు. 152 సర్పంచులు,1244 వార్డులకు నేడు పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు.బుధవారం మొదటి విడత ఎన్నికలు నిర్వహించనున్న మండలాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ఎన్నికల డిఆర్సి కేంద్రంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు.మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఎన్నికల ఫలితాలను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పాటిస్తూ ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.మొదటి విడత ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు.మొదటి విడత ఎన్నికలలో ఓటర్లందరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లు ఓటు వినియోగించుకునేందుకుగాను రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించిన 18 గుర్తింపు కార్డులను ఏదో ఒక దాన్ని గుర్తింపుగా చూపించి ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం గ్రామాలలో శాంతియుతగా, స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు.ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని కోరారు.కాగా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు 152 పోలింగ్ కేంద్రాలలో, 1244 వార్డులలో పోలింగ్ జరుగుతుండగా, స్టేజ్ వన్ ఆర్వోలుగా 52 మంది, స్టేజ్ టు ఆర్వోలుగా 178 మంది,16 ఎఫ్ఎస్ టి బృందాలు, 28 మంది జోనల్ అధికారులు, 65 రూట్లు,1683 మంది ప్రిసైడింగ్ ,2260 ఇతర ప్రెసిడెంట్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. 264 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు






## హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్

హైదరాబాద్:గూగుల్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా హైదరాబాద్‌లోని టి-హబ్‌లో'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ను ప్రారంభించాయి. తెలంగాణలో వేగంగా పెరుగుతున్న స్టార్టప్ , ఇన్నోవేషన్ వ్యవస్థకు మరింత బలం చేకూర్చే ఈ కేంద్రం .. భారతదేశంలోనే ఈ తరహాలో తొలి హబ్‌గా నిలిచింది. ప్రాంతీయ ఆవిష్కర్తలకు ప్రపంచ స్థాయి వనరులు, నైపుణ్యం, నెట్‌వర్క్‌అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్నిఏర్పాటుచేశారు.తెలంగాణలోని ఏఐ-ఫస్ట్ స్టార్టప్‌లను ఎంపిక చేసి, వారికి ఏడాది పొడవునా ఉచిత కో-వర్కింగ్ సౌకర్యాలు, గూగుల్ నిపుణుల మెంటర్‌షిప్, వెంచర్ ఇన్వెస్టర్లతో కనెక్షన్ వంటి అవకాశాలను హబ్ అందిస్తుంది. సాంకేతిక ప్రతిభను పెంపొందించడం, గ్లోబల్ మార్కెట్లకు యాక్సెస్ కల్పించడం, బాధ్యతాయుతమైన ఏఐ ఆధారిత వ్యాపారాల్ని నిర్మించడంలో స్టార్టప్‌లకు దోహదపడడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం.గూగుల్ ఫర్ స్టార్టప్స్ గ్లోబల్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ హబ్, ఆలోచనల దశ నుండి స్కేలింగ్ దశ వరకు స్టార్టప్‌ల ప్రయాణానికితోడ్పాటుఅందిస్తుంది. వర్ధమానవ్యవస్థాపకులకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు, ఏఐ నైపుణ్యం, మెంటర్‌షిప్, ప్రోడక్ట్, యూఎక్స్ గైడెన్స్‌తో పాటు కమ్యూనిటీ ఈవెంట్స్, మార్కెట్ యాక్సెస్ ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉంటాయి. మహిళా ఎంట్రాప్రెన్యూర్లు, టైర్-2 ఆవిష్కర్తలు, విశ్వవిద్యాలయ ప్రతిభకు ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వడం కూడా ఈహబ్ ప్రత్యేకత.
గూగుల్ ఫర్ స్టార్టప్స్హబ్ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గౌరవ అతిథిగా ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణను ప్రపంచ పోటీతత్వ ఆవిష్కరణ కేంద్రంగా మార్చడానికి ఇది మౌలిక సదుపాయాలకన్నా పెద్ద అడుగు. హైదరాబాద్‌లో రూపొందుతున్న ఆలోచనలకు ప్రపంచ వ్యాప్తి కల్పించే మార్గదర్శకత్వం, సాంకేతికత, మార్కెట్ యాక్సెస్‌ను గూగుల్ హబ్ అందిస్తుంది" అన్నారు.గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ.. "గూగుల్ క్లౌడ్ ఏఐ సామర్థ్యాల నుండి ఆండ్రాయిడ్, ప్లే, ప్రకటనలు, డెవలపర్ ప్రోగ్రామ్‌ల వరకు గూగుల్ పూర్తి మద్దతును తెలంగాణ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు అందిస్తున్నాము. ఈ హబ్ భారత్‌తో సహా ప్రపంచమంతటికీ బాధ్యతాయుత ఏఐ ఆధారిత డీప్-టెక్ పరిష్కారాలను రూపొందించడంలో స్టార్టప్‌లకు సహాయపడుతుంది" అన్నారు.



## అసంఘటిత కార్మికులకు అండగా ఏఐ




**న్యూఢిల్లీ:**దేశంలోని 31 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులకు కృత్రిమమేధ(ఏఐ) ప్రయోజనాలను అందించడానికి కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖతో కలిసి మైక్రోసాఫ్ట్ కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది.ఇందులో భాగంగా ఈ-శ్రమ్, నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌ల్లో అత్యాధునిక ఏఐ చాట్‌బాట్‌లను విడుదల చేయనున్నట్లు తెలిపింది.భారతదేశంలో కృత్రిమ మేధ ప్రభావాన్ని ఒక ప్రజా ఉద్యమంలా విస్తరించాలనే లక్ష్యంతో మైక్రోసాఫ్ట్ ప్రభుత్వంలో ఈమేరకు భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు చెప్పింది. ఇటీవల మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన భేటీ అనంతరం మైక్రోసాఫ్ట్ సంస్థ ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. 2026 నుంచి 2029 వరకు 17.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపింది. దీని ద్వారా దేశంలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల కల్పన, డేటాను బలోపేతం చేయనున్నట్లు చెప్పింది.ఇండియా 'ఏఐ-ఫస్ట్ కంట్రీ'గా మారాలంటే ప్రతి ఒక్కరికీ దీని ప్రయోజనాలను అందించాలని సత్య నాదెళ్ల ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. 'ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను సులభతరం చేయడం నుంచి ఎన్‌సీఎస్‌లో మెరుగైన ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు రూపొందించడం వరకు ఏఐ సాయంతో కేంద్ర మంత్రిత్వ శాఖతో కలిసి పని చేయనున్నాం' అని చెప్పారు.ఈ చాట్‌బాట్‌లు కార్మికులకు తక్షణ సహాయం అందిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగాల సరిపోలికను మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. ఇవి మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్‌లో హోస్ట్ చేయబడి ప్రభుత్వ ప్లాట్‌ఫామ్ 'భాషిణి'ని ఏకీకృతం చేస్తామని కంపెనీ చెప్పింది. దీనివల్ల 22 స్థానిక భాషల్లో రియల్-టైమ్ ట్రాన్స్‌లేషన్ అందుతుందని తెలిపింది. ఇది ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఈ-శ్రమ్‌లో నమోదు ప్రక్రియను సులభతరం చేస్తుందని చెప్పింది. ఈ పోర్టల్‌ల నుంచి సేకరించిన డేటా, భారతదేశం, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలతో కార్మికుల నైపుణ్యాలను సరిపోల్చడానికి కార్మిక విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని చెప్పింది.

## మూడో రోజూ నష్టాల్లోనే..



### గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ 600 పాయింట్లు పతనం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (రాబినీఇ-ఎ ఎజీతీఎవబి) మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడినా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల ప్రకటన వేళ మదుపర్ల లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. అమెరికా ఫెడ్ నిర్ణయాలు బుధవారం రాత్రి వెలువడనున్నాయి. సెన్సెక్స్ ఉదయం 84,607.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,666.28) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లోకి వచ్చినప్పటికీ.. తర్వాత మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 85,020.34 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. గరిష్ఠాల నుంచి దాదాపు 600 పాయింట్ల మేర పతనమైంది. 275 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.65 పాయింట్ల నష్టంతో 25,758 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ట్రెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, సన్‌ఫార్మా, ఐటీసీ, ఎన్టీపీసీ, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4194 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## టెక్‌లో కొలువుల జాతర


**2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు • అమెజాన్ భారతదేశంలో భారీగా విస్తరణ ప్రణాళికలు**

**న్యూఢిల్లీ:**ప్రపంచ టెక్ దిగ్గజం అమెజాన్ భారతదేశంలో తన విస్తరణ ప్రణాళికలను మరింత ముందుకు తీసుకెళ్లాలని యోచిస్తోంది. అందులో భాగంగా 2030 నాటికి దేశంలో అదనంగా 10 లక్షల ఉద్యోగ అవకాశాలను అందించేందుకు సిద్ధమవుతుంది.రానున్న రోజుల్లో కంపెనీ మొత్తం 35 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.14 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. 2010లో భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి చేసిన సుమారు 40 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ఇది అదనంగా ఉంటుంది.న్యూఢిల్లీలో జరిగిన ఆరో అమెజాన్ సంభవ్ సమ్మిట్‌లో ఈ మేరకు ప్రకటన వెలువడింది. కంపెనీ తన దీర్ఘకాలిక భారత వ్యూహాన్ని కొన్ని ప్రధాన విభాగాల్లో కేంద్రీకరించినట్లు చెప్పింది. ఏఐ నేతృత్వంలోని డిజిటలైజేషన్, భారతీయ ఎగుమతులను పెంచడం, ఉపాధి అవకాశాల విస్తరణపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంది. ఇది భారతదేశం డిజిటల్, తయారీ ఎకోసిస్టమ్‌ల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేస్తుందని అమెజాన్ పేర్కొంది.




**డిజిటలైజేషన్, ఉద్యోగాలు**

కొన్నేళ్లుగా అమెజాన్ దేశంలో డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేస్తోంది. ఈ సమ్మిట్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2024 వరకు భారత పరిశ్రమల్లో సుమారు 28 లక్షల ప్రత్యక్ష, పరోక్ష, కాలానుగుణ ఉద్యోగాలకు అమెజాన్ మద్దతు ఇచ్చింది. అంతేకాకుండా, ఈ ప్రయత్నాలు 1.2 కోట్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజేషన్‌వైపు మళ్లించినట్లు చెప్పింది. ఈ క్రమంలో కొత్తగా ప్రకటించిన 10 లక్షల ఉద్యోగాల లక్ష్యం అమెజాన్ విస్తరిస్తున్న డెలివరీ నెట్‌వర్క్‌లు, తయారీ, ప్యాకేజింగ్, రవాణా, సర్వీసులకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొంది.అమెజాన్ ఎమర్జింగ్ మార్కెట్ల సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ మాట్లాడుతూ.. 'మిలియన్ల మంది భారతీయులకు ఏఐను అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నాం. 2030 నాటికి మా ఈ-కామర్స్ ఎగుమతులను 80 బిలియన్ డాలర్లకు అంటే నాలుగు రెట్లు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం' అని తెలిపారు.




## ఆస్ట్రేలియాలో డిజిట్రబుల్స్

**టీనేజర్లకు సోషల్‌మీడియా వాడకంపై నిషేధం**



**సిడ్నీ:**ఆస్ట్రేలియా చరిత్రలో తొలిసారిగా ఒక చట్టం అమల్లోకి రానుంది. దేశంలోని 16 ఏళ్ల లోపు యువతకు సోషల్ మీడియా తలుపులు మూసుకుపోయాయి అయితే, ప్రపంచంలోనే ఈ తొలి నిషేధం, రిలే అలెన్ అనే 15 ఏళ్ల స్కూల్ బాయ్‌కి నిద్ర లేకుండా చేస్తోంది. దక్షిణ ఆరస్టేలియాలోని కేవలం 1,000 మంది జనాభా ఉన్న 'వుడిన్నా' అనే చిన్న కమ్యూనిటీకి 5 కిలోమీటర్ల దూరంలో రిలే కుటుంబం నివసిస్తోంది. గొర్రెల ఫారంలో నివసించే ఈ కుర్రాడికి, దూరంగా ఉన్న స్నేహితులతో మాట్లాడడానికి సోషల్ మీడియానే ఏకైక మార్గం. బుధవారం అర్ధరాత్రి దాటితే, 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సహాధ్యాయులతో ఎలా అందుబాటులో ఉండాలి?.. ఒక్క మీట నొక్కగానే.. తమ ప్రపంచం తెగిపోతుందనే భయం ఈ పల్లెటూరి పిల్లాడిని వెంటాడుతోంది.బుధవారం నుంచి 16 ఏళ్లలోపు ఉన్నవారు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, కిక్, రెడ్డిట్, స్నాప్‌చాట్, థ్రెడ్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్, ట్విచ్ తదితర ప్లాట్‌ఫాంలలో ఖాతాలను కలిగి ఉండకుండా చట్టం నిషేధిస్తుంది. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే, ఆయా ప్లాట్‌ఫాంలపై 32.9 మిలియన్ల వరకు భారీ జరిమానాలు విధిస్తారు. 'మెటా'.. ఇప్పటికే అనుమానిత యువకుల ఖాతాలను తొలగించడం ప్రారంభించింది. రిలేకు.. ఇంకా నోటిఫికేషన్ రాలేదు, కానీ ఏ క్షణమైనా తనను తొలగిస్తారేమోనని భయపడుతున్నాడు. రిలే తల్లి, స్కూల్ టీచర్ అయిన సోనియా అలెన్ మాత్రం.. నిషేధాన్ని తప్పించుకోవడానికి తన కొడుక్కి సహాయం చేయనని స్పష్టం చేసింది. అయితే, ఇతర తల్లిదండ్రులు సహాయం చేస్తారని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. గతంలో రిలే.. అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాలో మునిగితేలుతూ హోంవర్క్ చేయనందుకు, రెండు నెలలపాటు అతని సోషల్ మీడియాను ఆమె నిషేధించింది. 'అప్పటినుంచే తన కొడుకు మరింత బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను ఉపయోగించడం నేర్చుకున్నాడు'.. అని అలెన్ గుర్తు చేసుకుంది. ఏప్రిల్‌లో 16 సంవత్సరాలు నిండనున్న రిలే.. ఈ నిషేధం లక్ష్యాలను అర్థం చేసుకున్నానని, అయితే వాటిని సాధించడానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశాడు. చిన్న పిల్లలు నిద్రకు దూరం కాకుండా, రాత్రి 10 గంటల నుండి సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తప్పనిసరిగా నిషేధించాలని సూచించాడు.

**హైకోర్టులో టీనేజర్ల పోరాటం**

రిలేకు.. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద నగరమైన సిడ్నీలో ఒక మిత్రుడు ఉన్నాడు. ఆగస్టులో 16 ఏళ్లు వచ్చే నోహ్ జోన్స్. మరో విద్యార్రి?థని మేసీ నైలాండ్‌లు ఈ చట్టాన్ని హైకోర్టులో సవాలు చేస్తున్నారు. ఈ చట్టం అక్రమంగా 2.6 మిలియన్ల యువ ఆస్ట్రేలియా రాజకీయ భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కును లాగేసుకుంటుందని వారు వాదిస్తున్నారు. కాగా, సోషల్ మీడియా వల్ల తమ పిల్లలకు కలుగుతున్న హానిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారని ఆ?రస్టేలియా ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ సోషల్ మీడియా నిషేధాన్ని వ్యతిరేకిస్తూ 140 మందికి పైగా అంతర్జాతీయ విద్యావేత్తలు.. ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కు రాసిన బహిరంగ లేఖపై సంతకం చేశారు.

**నిషేధం దాటేస్తారు: నిపుణుల హెచ్చరిక**

డిజిటల్ ఫ్రీడమ్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు జాన్ రూడిక్.. ఈ నిషేధం అమలులోకి రాకుండా కోర్టు నిషేధాజ్ఞ కోసం ప్రయత్నించాలని భావించారు, కానీ న్యాయవాదుల సలహా మేరకు విరమించుకున్నారు. ఈ రాజ్యాంగ సవాలుపై పూర్తిస్థాయి విచారణ ఫిబ్రవరి చివరిలో జరగనుంది. పిల్లలు ఈ నిషేధాన్ని తప్పించుకోవడానికి వీపీఎన్‌లను ఉపయోగించి తమ స్థానాన్ని మార్చుకుంటారని ఆయన అంచనా వేశారు. 'పిల్లలు దీన్ని తప్పించుకుంటారు, ఆ తర్వాత వారు తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా, మరింత ప్రమాదకరమైన 'అండర్‌గ్రౌండ్' సోషల్ మీడియాను




## వారం రోజులు.. ముంబై అష్టకష్టాలు

**ముంబై:** ముంబై.. దేశంలోఅత్యంతకీలకమైననగరం. దీన్నిదేశఆర్థికరాజధానిగా కూ డాపేర్కొంటుంటారు. దేశంలోనిఅనేకకార్పొరేట్సంస్థలు, కంపెనీలప్రధానకార్యాల యాలుఇక్కడేఉంటాయి . ఆర్థికపరమైన కార్యకలాపాలు ఇక్కడి నుంచే జరుగుతుంటాయి . ఈ నేపథ్యంలో విదేశాలతోపాటు , దేశ నలుమూలల నుంచి ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు . ఈ క్రమంలో విమానయాన సంస్థ ఇండిగోలో తలెత్తిన సంక్షోభం ముంబై నగరాన్ని ప్రభావితం చేసింది .ఇండిగో విమాన అంతరాయాల ప్రభావం ముంబై విమానాశ్రయంలో వారంరోజులుగాప్రయాణికులను సతాయించింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, డిసెంబర్ 1 నుంచి 8 వరకు 905 విమానాలు రద్దు అయ్యాయి. 1,475 విమానాలు 30 నిమిషాలకు పైగాఆలస్య మయ్యాయి. ఈ అంతరాయాల వల్ల సుమారు 40,789 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముంబైఎయిర్పోర్టోఇండిగో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. ఎనిమిది రోజులలో 3,171 విమానాలు నడపాల్సి ఉండగా కేవలం 2,266 మాత్రమే నడిపగలిగింది.డిసెంబర్ 4, 5 తేదీల్లోఅయితేపరిస్థితి మరింత దారుణం గామారింది. డిసెంబర్ 1న 14గా ఉన్న విమానరద్దులు డిసెంబర్ 5న 295కి పెరిగాయి.ఆలస్యాలు కూడా ఎక్కువయ్యి, డిసెంబర్ 3న 281 విమానాలు గరిష్ట ఆలస్యాన్నమోదు చేశాయి. అంతరాయాలు పెరుగుతూనే ఉండటంతో టెర్మినళ్లలో కార్యకలాపాలు క్రమంగా స్తంభించాయి.రద్దయిన విమానాల కారణంగా సుమారు 780 చెక్-ఇన్ బ్యాగులుప్రయాణికులకు అందకుండా నిలిచిపోయాయి. వీటిలో 90% బ్యాగులను బుధవారం నాటికి పంపిణీ చేస్తామని అధికారులుతెలిపారు.

**ఎక్కువగా ప్రభావితమైన మార్గాలుఇవే..**

ముంబై నుంచి బయలుదేరే అనేక దేశీయ మార్గాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యాయి.ప్రధానంగాఅహ్మదాబాద్, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్కతా, కొచ్చి, గోవా, లక్నోనగరాలకు రాకపోకలు సాగించాల్సిన ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. అంతర్జాతీయంగా ఆమ్స్టర్డామ్, ఇస్తాంబుల్మార్గాల లోకూడా పెద్ద ఎత్తున ఆలస్యాలు, రద్దులు చోటుచేసుకున్నాయి.

## భారత్‌తో వాణిజ్య చర్చల్లో పురోగతి

**మాకు బెస్ట్ ట్రేడ్ ఆఫర్స్ అందాయి: అమెరికా ప్రతినిధి**

**న్యూయార్క్(జనంసాక్షి):**
భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ చర్చల్లో భాగంగా తమకు భారత్ నుంచి అత్యుత్తమ ట్రేడ్ ఆఫర్స్ అందాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ వెల్లడించారు. భారత వ్యవసాయ మార్కెట్‌లోకి విస్తరించే దిశగా, అడ్డంకులను అధిగమించేలా చర్చలు ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు సెనెట్ కేటాయింపుల సబ్‌కమిటీ విచారణలో పేర్కొన్నా రు. గత ప్రభుత్వాలతో పోలిస్తే తాము ఈ వాణిజ్య ఒప్పందం విషయంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. అలాగే అమెరికా వస్తువులకు చైనా మార్కె ట్‌లో ఇబ్బందులు ఎదురవుతోన్న సమయంలో ఇప్పుడు భారత్ ప్రత్యామ్నా య మార్కెట్‌గా ఉంటుందని సూచిం చారు.ఢిల్లీలో జరుగుతున్న చర్చల్లో యూఎస్ తరఫున డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొంటు న్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అగ్రరాజ్య ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. అనంతరం సెప్టెంబరు 22న పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాకు వెళ్లింది. ఈ క్యాలెండర్ ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఇటీవల వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. అందులో భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాల అంశాన్ని కూడా ప్రస్తావిస్తామని తెలిపారు. టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి ఓసారి.. పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరోసారి చర్చలు జరుపుతామని చెప్పారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ట్రంపు.. కంపు..

**ప్రెస్ సెక్రటరీ సౌందర్యంపై అమెరికా అధ్యక్షుడి వివాదాస్పద వ్యాఖ్యలు**





**న్యూయార్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన నోటికి పని చెప్పారు.పెన్సిల్వేనియాలో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, అకస్మాత్తుగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అందాన్ని పొగడటం అందరీగ్ర్ష్ణంతికి గురి చేసింది. సూపర్‌స్టార్ కరోలిన్ కూడా ఈ మీటింగ్‌కు వచ్చిందంటూ ఆమె వ్యక్తిగత సౌందర్యాన్ని, అందాన్ని ఆకాశానికెత్తేశారు. తన పరిపాలన ఆర్థిక విజయాలపై ప్రసంగాన్ని పక్కన పెట్టి మరీ అందమైన ముఖం, గన్నులాంటి పెదవులు చీప్ కామెంట్స్ చేయడం విస్తుగొల్పింది.79 ఏళ్ల ట్రంప్ తనకంటే దాదాపు 50 ఏళ్లు చిన్నదైన 28 ఏళ్ల కరోలిన్ శారీరక సౌందర్యంపై వ్యాఖ్యలు చేశారు. ఆమె పెదవుల్ని ఏకంగా మెషీన్‌గన్‌తో పోల్చేశారు. ఆమె గొప్పది కాదా? కరోలిన్ గొప్పదా?" అని ఆయన ఉత్సాహంగా ఉన్న ప్రేక్షకులను అడిగారు. 28 ఏళ్ల ఎంత అందంగా ఉందో అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. తెలుసా, ఆమె టెలివిజన్‌లో, ఫాక్స్ వంటి టీవీ స్క్రీన్ పై ఆధిపత్యాన్ని చెలాయిస్తుందనీ, చిన్న మెషీన్‌గన్‌లాంటి పెదవులు, అందంతో కట్టి పడేస్తుందన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ వింతైన శబ్దాలను చేయడం సభికులను ఆశ్చర్యపరిచింది. కరోలిన్ నిర్భయంగా వాదిస్తుందని, ఎందుకంటే మన విధానాలను ఆమె సూటిగా చెప్పేస్తుందన్నారు. ఆగస్టులో న్యూస్‌మ్యాక్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా కరోలిన్ బ్యూటీపై దాదాపు ఇలాంటి కమెంట్స్ చేశారు.కాగా డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నసమయంగా అసిస్టెంట్ ప్రెస్ సెక్రటరీగా 2019 నుంచి 2021 వరకు లివియట్ పనిచేశారు. న్యూహ్యాంప్‌షైర్‌కు చెందిన ఆమె రియల్ ఎస్టేట్ డెవలపర్ నికోలస్ రిక్కోను( 60) ను పెళ్లాడింది. ఎన్నికల్లో ఓడిన ఆమె మళ్లీ జనవరిలో వైట్‌హౌజ్‌లో ప్రెస్ కార్యదర్శిగా చేరింది.చరిత్రలో అతి పిన్న వయస్కురాలైన వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ ఆమె. ట్రంప్ ప్రెస్ సెక్రటరీగా పనిచేసిన ఐదో వ్యక్తి, రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టాక తొలి వ్యక్తి ఆమె.మరోవైపు ఆమె నైపుణ్యం, శక్తి సామర్థ్యాలపై కాకుండా, కేవలం అందంపై, ముఖ్యంగా పెదవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు నెటిజన్లు. మహిళలపై ఇలాంటి సెక్సిస్ట్ కామెంట్లు చేయడం ట్రంప్‌నకు కొత్తేమీ కాదనీ, తన కంపు నోరును మరోసారి బయటపెట్టుకున్నాడని మండిపడుతున్నారు.

| మండలం | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | ఇతరులు |
|---|---|---|---|---|
| చందుర్తి | 28,094 | 13,445 | 14,649 | - |
| కోనరావుపేట | 35,225 | 17,180 | 18,045 | - |
| రుద్రంగి | 13,665 | 6,454 | 7,208 | 3 |
| వేములవాడ అర్బన్ | 18,492 | 8,953 | 9,523 | 16 |
| వేములవాడ రూరల్ | 18,825 | 9,020 | 9,805 | - |
| మొత్తం | 1,14,301 | 55,052 | 59,230 | 19 |




# మొదటి విడత ఎన్నికలు నేడే

## 76 జీపీలు,521 వార్డుల్లో ఎన్నికలు..


- 18 రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేసేందుకు అర్హత..
- వేములవాడలో పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధం
- 2250 మంది సిబ్బంది.. 902 మందితో పటిష్ఠ బందోబస్తు
- ప్రతి ఓటరూ గుర్తింపు కార్డు తీసుకురండి.. సెల్‌ఫోన్లు నిషేధం
- క్రిటికల్ 61, సెన్సిటివ్ 51 కేంద్రాలపై ప్రత్యేక నిఘా

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 (జనంసాక్షి) :** నేడు మొదటి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తున్న క్రమంలో అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.నేడు 76 గ్రామ పంచాయతీలు,521 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల క్రమంలో వేములవాడ డివిజన్ పరిధిలోని చందుర్తి, కోనరావుపేట,రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో మొదటి విడుత ఎన్నికలు నిర్వహించనున్నారు. చందుర్తి మండలంలో మొత్తం 28,094 మంది ఓటర్లు ఉండగా పురుషులు 13,445 మంది పు మహిళలు 14,649 మహిళలు ఉండగా, కోనరావుపేట మండలంలోమొత్తం ఓటర్లు 35225 ఉండగా పురుషులు 17,180, మహిళలు 18,045, రుద్రంగి మండలంలో 13665 మంది ఓటర్లు ఉండగా పురుషులు 6,454,మహిళలు 7,208 మహిళలు, ఇతరులు ముగ్గురు, వేములవాడ అర్బన్ మండలంలో మొత్తం ఓటర్లు 18492 ఉండగా పురుషులు 8,953, మహిళలు 9,523, ఇతరులు 16 మంది, వేములవాడ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 18825 ఉండగా పురుషులు 9,020 మంది, మహిళలు9,805 ఓటర్లు ఉన్నారు.



### పోలింగ్ కేంద్రాలు..

మొదటి విడుత ఎన్నికలలో భాగంగా కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి వేముల వాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లోని మొత్తం 76 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 521 వార్డుల్లో 521 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా గ్రామాల్లో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో పీఓలు 898 మంది, ఓపీఓలు 1,135 మంది ఉన్నారు.




### ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి ఓటరు గుర్తింపు కార్డు కాకుండా 18 ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఆధార్, పాస్ పోర్ట్,డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు,బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, పాన్ కార్డు,నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, శాసనసభ, శాసనమండలి జారీ చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డులు, ఫోటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు, లోక్ సభ, రాజ్యసభ జారీ చేసిన ఎంపీ గుర్తింపు కార్డు,ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన ఫోటోలతో కూడిన ఉపాధి హామీ జాబ్ కార్డు, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, రేషన్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ధ్రువపత్రాలు, పెన్షన్ పత్రాలు, ఆయుధాల లైసెన్స్, దివ్యాంగ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్ వున్నా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న సిబ్బంది
- 902 మందితో పోలీస్ బందోబస్త్

తెలంగాణలో జరుగుతున్న రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం పోలింగ్ సర్వం సిద్ధం చేసినట్లు ఆర్డీవో రాదాబాయి తెలిపారు. వేములవాడ అర్బన్ ఎంపీడీవో కార్యాలయం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డివో రాధా బాయ్ మాట్లాడుతూ ఐదు మండలాల్లో 25 రూట్లుగా విభజించి 2250 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ తో పాటు, అదనపు భద్రత సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటు వేసే ప్రతి ఒక్కరు ఏదైనా 18 గుర్తింపు కార్డుల్లో ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాన్నం 1 గంట వరకు, 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుంద న్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల వరకు సెల్ ఫోన్లు అనుమతించబడవన్నారు.
జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని,ఐదు మండలాల్లో జరిగే ఎన్నికల్లో ఉదయం 7 గంటల నుండి ఒంటిగంట వరకు ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.ఎన్నికలలో 902 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 5 మండలలాలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను 61,సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను 51 గుర్తించమన్నారు. ఆ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.




## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

- రోడ్లు, డ్రైనేజ్, డంప్ యార్డ్ సమస్యలను పరిష్కరించాలని కోరిన వైద్యుల..సానుకూలంగా స్పందించిన కమిషనర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10(జనంసాక్షి):** బుధవారం రోజు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ని కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణ సమస్యల పై కమిషనర్ దృష్టికి తీసుకురావడం అందులో భాగంగా మొదట కరీంనగర్ పట్టణంలో సీఎం అస్యూరెన్స్ కింద హడావుడిగా ప్రారంభించిన పనులు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆనాటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ పనుల గురించి ప్రజలు పట్టణంలో అనేక ఇబ్బందులుకు గురవుతున్నారని తెలిపారు. అర్ధాంతరంగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఈ విషయంలో జిల్లా మంత్రి సానుకూలంగా స్పందిస్తున్నారని, మంత్రి తో మాట్లాడి వీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. అదేవిధంగా కరీంనగర్ పట్టణంలో ఉన్నటువంటి వీధి దీపాలు సమస్యపై చర్చించగా, గతంలో స్మార్ట్ సిటీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పని కాలం ముగిసినందున అన్ని వసతులతో కొత్త లైట్లు ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారని, కరీంనగర్ పట్టణంలో ఉన్నటువంటి నిరుపేదలకు డబుల్ రూమ్ ఇండ్ల గురించి ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ లిస్టుల గురించి వారితో మాట్లాడడం జరిగింది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి రేకుర్తి నుంచి బొమ్మకల్‌కు పోయే డి94 కాలువలోని మురుగు నీళ్లు, సిల్టు తొలగించా లని కోరడంతో పాటు డంప్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని చర్చించడం జరిగిందని తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో అంజన్ కుమార్ తో పాటు మాజీ కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, పడిశెట్టి భూమయ్య, కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి, మడుపు మోహన్, వీర దేవేందర్ పటేల్ తదితరులు ఉన్నారు.

## డాక్టర్ పున్నం చందర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు



**సిరిసిల్ల టౌన్ డిసెంబర్ 10 (జనంసాక్షి) :** ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తు లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రధానోత్సవంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గత 15 సంవత్సరాలుగా సైకాలజిస్ట్‌గా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ సైకాలజిస్ట్, డాక్టర్ కనుకుంట్ల పున్నం చందర్ బెస్ట్ సోషల్ సర్వీస్ అండ్ సైకాలజిస్ట్ అవార్డ్ ను అందుకున్నారు.హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ, స్వఛరేద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న అల్వాల ఈశ్వర్, హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ రాజన్న సిరిసిల్ల జిల్లా వైస్ చైర్మన్ మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో సేవలు అందిస్తున్న గడ్డం దినకర్ లు ఉత్తమ సామాజిక సేవా అవార్డులు అందుకున్నారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమా గౌడ్ లు హాజరై మాట్లాడారు.మానవ హక్కుల రక్షణ కోసం అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ కన్వీనర్ గాజుల వేణు కుమార్, రాష్ట్ర విమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ లు అభినందించారు.

## పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- కొతపల్లి, కరీంనగర్ రూరల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10(జనంసాక్షి):** మొదటి విడతలో గురువారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరగనున్న కరీంనగర్ రూరల్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొత్తపల్లి మండలానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## చదువు గొప్పతనం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే

**బోధన్, డిసెంబర్ 10 ( జనంసాక్షి ) :** చదువు గొప్పదనం తెలుసుకోవాలంటే విద్యార్థులకు తల్లిదండ్రులు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత ఉందని బ్రహ్మర్షి వేదమూర్తులు గరిక పాటి నర్సింహారావు స్పష్టం చేశారు. బుధవారం బోధన్ పట్టణంలోని విజయ సాయి పాఠశాల విద్యార్థులకు గరికపాటి నర్సింహారావు ఆశీర్వా దాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన పిల్లలకు దైవభక్తి దేశభక్తి పెంపొందించేటట్లుగా విద్యా విధానం ఉండాల ని గురువులు తల్లిదండ్రులే దీనికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తెలుగు భాష మాతృభాష మీద శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. వ్యసనాలకు అలవాటు పడకుండా చూసుకోవల సిన బాధ్యత మనదే అన్నారు. జిల్లా సిపి సాయి చైతన్య, అసిస్టెంట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ప్రమీల ఉమామహేశ్వర రావు, బోధన్ ఏసిపి శ్రీనివాస్, అడిషనల్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి, ట్రస్మా డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ కిషోర్, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, బోధన్ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దళిత,గిరిజన,ఆదివాసీలకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం

- ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహనీయుడు పూలాజీ బాబా
- ప్రభుత్వపరంగా కనిపించాల్సిన సదుపాయాలు కల్పిస్తాం
- జగన్నాథ్ పూర్,బోర్నపల్లి బ్రిడ్జికి నిర్మాణానికి 17.50 కోట్ల నిధులు
- మంత్రి అడ్లూరి తొలి సంతకం..జగన్నాథ్ పూర్ బ్రిడ్జి మంజూరు పైనే
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**రాయికల్ డిసెంబర్ 10 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో నిరుపేదలైన దళిత, గిరిజన, ఆదివాసీలకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని బోర్నపల్లి గ్రామం మరాఠా కాలనీలో సద్గురు పూలాజీ బాబా ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షిక మహోత్సవ వేడుకలకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరాఠాలు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే ఆరాధ్య సద్గురు పూలాజీ బాబా ప్రత్యేక పూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలాజీ బాబా చూపిన ఆధ్యాత్మిక, ధ్యాన సన్మార్గాలు ఎంతో గొప్పవన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలలో బాబా ప్రవచనాలు, బోధనల వల్ల ఎన్నో కుటుంబాలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నాయని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహనీయుడని తెలిపారు. వ్యవసాయ,ఇతరేతర పనుల నిమిత్తం బోర్నపల్లి గ్రామానికి వచ్చిన మరాఠాలు మీ కాలనీలో ప్రభుత్వపరంగా కనిపించాల్సిన సదుపాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కల్పిస్తానని అన్నారు. ఆదివాసి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇంటి నిర్మాణం చేపట్టేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. గోదావరి తీర ప్రాంతంలో ఉన్న బోర్నపల్లి గ్రామంతోపాటు రాయికల్ మండలం అభివృద్ధి చెందుతాదనే సంకల్పంతో బోర్నపల్లి వంతెన నిర్మాణం చేపట్టాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకురాగా బ్రిడ్జ్ మంజూరు చేశారని బోర్నపల్లి,కమ్మునూరు బ్రిడ్జిల నిర్మాణం దగ్గరుండి పర్యవేక్షించానని తెలిపారు.బోర్నపల్లి గ్రామానికి అనుబంధ గ్రామమైన జగన్నాథ్ పూర్, బోర్నపల్లి గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రి అడ్లూరికి వినతి పత్రం అందించగా బ్రిడ్జ్,రహదారి నిర్మాణానికి 17.50 కోట్ల నిధులు మంజూరుకు జీఓ 207 ఉత్తర్వులు జారీ చేయడం పై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్ర కృష్ణారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,నాయకులు కోడిపెల్లి ఆంజనేయులు, తంగెళ్ల రమేష్,జలపతి,కొయ్యేడి మహిపాల్, లక్ష్మణ్,సత్యం,మోతిరాం,ఆత్మరామ్,రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టిబి వ్యాధి నిర్మూలనలో ఛాంపియన్ల పాత్ర కీలకం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ వాణిశ్రీ



**గోదావరిఖని, జనంసాక్షి :** పెద్దపల్లి జిల్లా, రామగుండం బ్లాక్, గోదావరిఖనిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అడ్డగుంటపల్లి లో టిబి చాంపియన్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ వాణిశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టిబి వ్యాధి నిర్మూలనలో టిబి చాంపియన్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. క్షయవ్యాధి గురించి ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, మందులను సక్రమంగా వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా టిబి ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు 12 ఆమ్ (ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్) సెంటర్ల నుండి, అలాగే సింగిల్ ఆమ్‌ల నుండి కూడా టిబి చరిత్ర కలిగిన 30 మందిని ఎంపిక చేసి టిబి చాంపియన్లకు శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ స్టేట్ లీడ్ మిస్టర్ పురుషోత్తం, జిల్లా లీడ్ దేవోజు శ్రీనివాస్, టిబి రిసోర్స్ పర్సన్ దాసరి అంజలి తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో టిబి కేసులు తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అందుబాటులో ఉన్న సేవలు, పరీక్షలు, చికిత్స విధానాలను వారు వివరించారు. గతంలో టిబి వ్యాధి వచ్చి పూర్తిగా కోలుకున్నవారిని టిబి చాంపియన్‌లుగా ప్రకటించి, వారి అనుభవాలను ప్రజల్లో పంచుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ అనంతరం ఆయా ఆమ్ సెంటర్ల పరిధిలో గ్రామసభలు, మహిళా సంఘాల సమావేశాలు, పాఠశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా చేరే ప్రదేశాల్లో టిబి చాంపియన్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. టిబి ఇన్ఫెక్షన్ కేసులు, మరణాలు తగ్గించేందుకు తమ వంతు పాత్రను నిబద్ధతతో కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం,హెచ్ఓ డాక్టర్ వాణిశ్రీ , డిప్యూటీ డిఎం,హెచ్ఓ డాక్టర్ బి. శ్రీరాములు గారు, డిటిఓ డాక్టర్ కె.వి. సుధాకర్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీ భవాని, డాక్టర్ స్నేహలత (యూపిహెచ్‌సీ అడ్డగుంటపల్లి), ఎన్‌టిఇపీ సిబ్బంది గోపికృష్ణ (ఎస్‌టిఎస్), హెచ్ఇఓ, యూపిహెచ్‌సీ సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం

### కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే

**కోనరావుపేట(జనంసాక్షి):** గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికలు జరుగు మండలాలలో ఎన్నికలు పురస్కరించుకొని బందోబస్త్ కు వచ్చిన పోలీస్ సిబ్బందికి కోనరావుపేట పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ..పోలింగ్ జరుగుసమయంలో,ఓట్ల లెక్కింపు సమయంలో పోలీస్‌అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలుతీసుకోవాలన్నారు.ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సమయంలో రూట్ మొబైల్ పోలీస్ అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ,పోలింగ్ కేంద్రాలు,ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తపడాలన్నారు.ఏదైన సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం అందించాలన్నారు. ఆయన వెంట డిఎస్పి నాగేంద్ర చారి సీఐ శ్రీనివాస్ గౌడ్ ఎస్సై ప్రశాంత్ రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

### ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్

**కోనరావుపేట(జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా కోనరావుపేట మండలం లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతో ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసు కోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు ఆమె వెంట జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తహసీల్దార్లు, వరలక్ష్మి ఎంపీడీఓ సిగ్మ రెడ్డి ఎంపీఓలు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలి

### మొదటి విడత పంచాయతీ ఎన్నికల జరిగే మండలాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని,డిసెంబర్ 10(జనం సాక్షి) :** పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మొదటి విడత పోలింగ్ జరిగే మంథని, ముత్తారం, రామగిరి, కమానపూర్, కాల్వ శ్రీరాం పూర్, మండలాల లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 11 న జరుగుతున్నాయని, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాల్లో చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తూ తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి అలసత్వం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.నిబంధనలు అతిక్రమిస్తూ విధులు నిర్వహించ కూడదని,ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని,ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని తెలిపారు.ఎన్నికల విధిని నిర్వహించే సిబ్బందికి గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శు లు, ఎంపిడిఓ లు అవసరమైన తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, ఎలక్ట్రిసిటీ, వాహనాలు ఇతర అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మంథని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏసిపి రమేష్, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎంపీడీవోలు, ఎంపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ ప్రగతికి పాటుపడాలి

- అవకాశవాద, వారసత్వ రాజకీయాలతోనే దేశానికే ప్రమాదకరం
- నేషన్ పీపుల్స్ పార్టీ ఏపీ, తెలంగాణ కోఆర్డినేటర్ గవ్వల భరత్ కుమార్
- ఎన్పీపీ యూత్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీలకు ఘనంగా స్వాగతం
- భరత్ నేతృత్వంలో ర్యాలీ... జాతీయ నాయకులకు భారీ సన్మానం




**హైదరాబాద్, (జనంసాక్షి) :** దేశంలోని యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ ప్రగతికి పాటుపడాలని నేషన్ పీపుల్స్ పార్టీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ గవ్వల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. అవకాశవాద, వారసత్వ రాజకీయాలతోనే ఈ దేశానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దేశ ప్రగతి కోసం పాటుపడే ప్రతి యువతీ యువకుడు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని సూచించారు. నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ యూత్ ప్రెసిడెంట్ నిక్కీ నాన్గహలా, పార్టీ నేషనల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్), అరుణాచల్ మాజీ హోంశాఖ మంత్రి పక్నా బాగే బుధవారం హైదరాబాదులో పర్యటించగా, వారికి గవ్వల భరత్ నేతృత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, సాంప్రదాయ డప్పు చప్పుల్లతో వారికి బ్రహ్మరథం పట్టారు. రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్టు నుంచి బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సభకు తీసుకువచ్చారు. ఈ సమావేశం గవ్వల భరత్ నేతృత్వంలో జరిగింది. సన్మాన కార్యక్రమం ముగిసిన తర్వాత భరత్ సభికులను ఉద్దేశించి మాట్లాడారు. బడుగు, బలహీనవవర్గాలకు చెందిన తాను నేడు ఇక్కడ నిలబడి, మన తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతతో మాట్లాడటం తనకెంతో గర్వంగా ఉందన్నారు. యావత్ దేశవ్యాప్తంగా తిరుగులేని నాయకుడిగా పీ.ఏ. సంగ్మా జాతీయ స్థాయిలో ఎదిగారని, అటువంటి మహనీయుడు పెట్టిన పార్టీకి తాను రెండు తెలుగు రాష్ట్రాల్లో నాయకత్వం వహించడం హర్షణీయం అన్నారు. మహనీయుడు పీ.ఏ సంగ్మా సేవలను స్మరించడానికి మనమందమున్నారని తెలిపారు. ఆయన గిరిజనులకైనా, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాన్నే అంకితం చేశారన్నారు. వాస్తవానికి ఈ రోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవమని, మన సమాజంలోని ప్రతి వ్యక్తి గౌరవంగా, న్యాయమైన హక్కుల కోసం నిలబడే రోజు అని గుర్తు చేశారు. అయితే, ఈ సమానత్వం కేవలం మాటల్లో ఆగిపోవద్దన్నారు. ప్రతి మనిషి హక్కులు సాధించే వరకు%ూ% మనమంతా ఉద్యమం చేయాలని అన్నారు. మార్పు తరంగంగా మారాలని సూచించారు. కాగా, ఈరోజు సమానత్వం ఎందుకింత ముఖ్యమయ్యిందంటే, యువతను భవిష్యత్తు నాయకులుగా కాకుండా కేవలం ఓటు బ్యాంకులుగా దేశంలోని అన్ని పార్టీలు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ నేషనల్ పీపుల్స్ పార్టీ ఆ దృష్టికోణాన్ని తిరస్కరిస్తున్నట్టు వివరించారు. విద్యా, వైద్య రంగాల్లో ఫీజుల నియంత్రణ, ఉద్యోగులకు సమయానికి రిటైర్మెంట్, ఆరోగ్య ప్రయోజనాలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ భద్రత, పోలీసులకు సముచిత పని గంటలు, రైతులకు అగ్రికేర్ సపోర్ట్ కేంద్రాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి డీఏ, పీఆర్సీ, మండల స్థాయిలో పేదలకు ఉచిత న్యాయ సలహాల సాయం, కాంట్రాక్ట్ ఉద్యోగుల భద్రత, ప్రైవేట్ ఉద్యోగుల జీతాలు, పని గంటలు, ఒత్తిడి సమస్యల పరిష్కారం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**మేఘలయ సీఎం కాన్రాడ్ సంగ్మా ఒక గొప్ప నేతః గవ్వల భరత్ కుమార్**

మనకి ఒక గొప్ప నాయకుడుగా మేఘలయ సీఎం కాన్రాడ్ సంగ్మా దొరికారని నేషన్ పీపుల్స్ పార్టీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ గవ్వల భరత్ కుమార్ అన్నారు. ఆయన నిజాయితీ, ధైర్యం, ప్రజల కోసం పనిచేసే మనస్తత్వం మన అందరికీ ఒక గొప్ప ఉదాహరణ అని స్పష్టం చేశారు. ఎన్నాళ్లుగానో అన్యాయం చూస్తున్నామని, అయితే నేడు మన భవిష్యత్తు కోసం యువతే లేవాలని అన్నారు. ఇది మేలుకొలుపు... నేషనల్ పీపుల్స్ పార్టీతో కలిసి నడిచి... మనకు నిజమైన రాజకీయాలు, నిజమైన మార్పు, నిజమైన నాయకత్వం ప్రారంభమవుతుందన్నారు. యువత కేంద్రీకృత సమాజాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అయితే, మన చుట్టూ సమస్యలు ఎన్నో ఉన్నాయని, కానీ వాటిని చెప్పడానికి యువతకు ఒక వేదిక లేదని... అయితే, ఆ వేదిక నేషనల్ పీపుల్స్ పార్టీ అని గుర్తు చేశారు. మన భవిష్యత్తు మనమే రూపుదిద్దడానికి సిద్ధంగా ఉండాలని... ఎందుకంటే – "లేచి నిలబడే సమయం వచ్చిందని.. మన కోసం మనం సమరం చేసే సమయం వచ్చిందన్నారు. ఎందుకంటే, ప్రజలు.. యువత అన్ని కోణాల్లో ఆలోచించాలన్నారు.




# పారా షూటింగ్‌లో అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్)కు చెందిన పారా షూటర్లు 6వ నేషనల్ పారా షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో అద్భుత ప్రతిభ కనబరిచారు. న్యూఢిల్లీలో ఉన్న డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో రెండు బంగారు, నాలుగు రజత పతకాలు సాధించారు. తెలంగాణకు చెందిన బానోత్ పావని (18 సంవత్సరాలు) అత్యంత పిన్న వయస్కురాలు. పారా ఎయిర్ రైఫిల్ షూటర్ పావని, సీనియర్ కేటగిరీలో కూడా పోటీ పడి అద్భుత ప్రతిభ చూపింది. ఆమె మూడు రజత పతకాలు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (జూనియర్)లో రజతం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (జూనియర్ మిక్స్‌డ్)లో రజతం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (మిక్స్‌డ్)లో రజతం సాధించింది. జూనియర్ కేటగిరీకి చెందినప్పటికి సీనియర్ విభాగాల్లో పోటీ పడిన ఈ యువ షూటర్లు అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. భారత పారా షూటింగ్ రంగంలో కొత్త శక్తులుగా అవతరించారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ఖుష్బూ (15 సంవత్సరాలు) సీనియర్ అథ్లెట్లతో పోటీ పడి రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించింది. ఆమె ప్రదర్శన మొత్తం ఛాంపియన్‌షిప్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (జూనియర్)లో స్వర్ణం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (జూనియర్ మిక్స్‌డ్)లో స్వర్ణం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ (మిక్స్‌డ్)లో రజతం సాధించింది.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

## ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు


- బషీరాబాద్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు
- పోలింగ్ ఏజెంట్లుగా నియమితులు గైర్హాజర్.. బాధ్యతారాహిత్యానికి శిక్ష
- మొదటి దశ ఎన్నికలకు ముందస్తు చర్యలు.. మిగిలినవారిపై కూడా దృష్టి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (జనం సాక్షి):** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశ (డిసెంబర్ 11)కు ముందస్తుగా వికారాబాద్ జిల్లాలో పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం చూపిన ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ చర్యలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేసి, వారిని విధుల నుంచి తొలగించారు. ఈ చర్యలు ఎన్నికల సమయంలో బాధ్యతాయుత ఏర్పాట్లను బలోపేతం చేసేందుకు ఎందుకొక్కటి కావటంలో భాగంగా తీసుకున్నాయి.
బుధవారం బషీరాబాద్ మండల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సామగ్రి పంపిణీ, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది సిద్ధతలను సమీక్షించారు. కుల్కచర్ల మండలానికి చెందిన పటేల్ చెరువు తండా ఎస్‌జీటీ మానస్, నీటూరు ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నసీం రెహానా, అలాగే పెద్దేముల్ మండల ఎంపీపీఎస్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ అన్నపూర్ణలు గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులుగా (ఏజెంట్లుగా) నియమితులు. వీరు విధుల్లో బాధ్యతారాహితంగా వ్యవహరించి, గైర్హాజర్ అయినందున వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. "ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం లేదు. మొదటి దశ పోలింగ్‌కు మిగిలిన రెండు రోజుల్లో అందరూ అలర్ట్‌గా ఉండాలి. సస్పెన్షన్‌లు హెచ్చరికగా ఉంటాయి" అని చెప్పారు. జిల్లాలో మొత్తం 175 పంచాయతీల్లో 1,113 మంది అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో, పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, మిగిలిన మండలాల్లో సిబ్బంది పనితీరును కూడా పరిశీలిస్తూ, అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 9.3% సర్పంచ్ పదాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిసింది. మొత్తం 12,278 పంచాయతీల్లో మొదటి దశలో 4,236 పదాలకు ఎన్నికలు జరగను న్నాయి. వికారాబాద్‌లో ఈ సస్పెన్షన్‌లు ఎన్నికల శ్రేణి, పారదర్శకతను మరింత బలోపేతం చేస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది

మహేశ్వరం,డిసెంబర్10(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు.కందుకూరు మండలం సార్లరావులపల్లి గ్రామ పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో బుధవారం సర్పంచ్ శ్రీను నాయక్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలకు ప్రజలు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.మహేశ్వరం,కందుకూరు మండలాలలో అత్యధిక గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు.




# పరిగి సబ్ జైల్లో నయా దందా

**వివిధ కేసుల్లో జైలుకెళ్లిన నిందితుల నుంచి వసూళ్లు**

- ముడుపులు చెల్లించకపోతే జైల్లో చిత్రహింసలు
- ఒక్క ఫోన్ కాల్ కు 2 వేలు వసూలు
- పరిగి సబ్ జైలు కానిస్టేబుళ్ల వసూళ్ల వ్యవహారంపై ఫిర్యాదు
- జైలర్ దృష్టికి ముడుపుల వ్యవహారం




**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 10 (జనం సాక్షి):** నాలుగు గోడల మధ్య ముడుపుల దందా జోరుగా సాగుతుంది. వివిధ కేసుల్లో జైలుకు వెళ్లిన నిందితుల నుంచి జోరుగా వసూళ్ల లకు పాల్పడుతున్నారు. మామూళ్లు ఇవ్వని నిందితులకు చిత్రవధ. చిత్రహింసలు భరించలేక బంధువులకు సమాచారం ఇచ్చి గూగుల్ పే ఫోన్ పే ల ద్వారా ముడుపుల చెల్లింపులు జోరుగా దంద సాగుతున్నాయి. ఇది సబ్ జైల్లో జరుగుతున్న అవినీతి బాగోతం.. వికారాబాద్ జిల్లా పరిగి సబ్ జైల్లో మామూళ్ల దందా జోరుగా సాగుతుంది. వివిధ కేసుల్లో జ్యుడీషియల్ కస్టడికి వెళ్లిన నిందితుల నుంచి జైలు కానిస్టేబుళ్లు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వికారాబాద్ పరిగి కొడంగల్ తాండూర్ కోర్టుల న్యాయమూర్తులు పదుల సంఖ్యలో జ్యుడీషియల్ కస్టడీ ఇచ్చిన కారణంగా వివిధ కేసుల్లోని నిందితులను పరిగి సబ్ జైలుకు పోలీసులు తరలిస్తారు. నేరం తీవ్రతను బట్టి కొన్ని నెలల పాటు నిందితులు పరిగి సబ్ జైల్లో ఉండవలసి ఉంటుంది. అయితే జైలుకు వెళ్లిన నిందితుల పట్ల జైలు కానిస్టేబుళ్లు అమానుష్యంగా వ్యవహరిస్తున్నారు. నిందితులను కలవడానికి వారి బంధువులు ఎవరైనా పరిగి సబ్ జైలుకు మూలాఖత్ కోసం వెళితే వారి నుంచి భారీగా మామూళ్ల వసూళ్ల కు పాల్పడుతున్నారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులను బెదిరించి వారి పట్ల అమానుషంగా వ్యవహరించి బలవంతంగా మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. జైల్లో ఉన్న నిందితులు బంధువులకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేయించి ఫోన్ పే గూగుల్ పే ద్వారా జైల్ కానిస్టేబుళ్లలకు చెల్లించే వ్యవహారం సాగుతుంది.జైల్ కానిస్టేబుల్ లకు మామూళ్లు ఇవ్వలేని నిందితుల వారు పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. కాళ్లు చేతులపై కొట్టి ఎండలో నిల్చోబెట్టి అనధికార శిక్షలను అమలు చేస్తున్నారు. జైల్ కానిస్టేబుల్ ల బాధలు భరించలేక జైల్లో ఉన్న నిందితులు తెలిసిన వారితో ఫోన్ పే గూగుల్ పే చేసి జైలు కానిస్టేబుల్ లకు మామూ ళ్లు చెల్లిస్తున్నారు. మామూళ్లు చెల్లించని వారు నిత్య నరకం అనుభవిస్తున్నారు. కొందరు జైలు కానిస్టేబుళ్లు తన ఫోన్ కు గూగుల్ పే ఫోన్ పే ద్వారా మామూళ్లు వేయించుకుంటే మరికొందరు కానిస్టేబుళ్లు తనకు తెలిసిన వారి ఫోన్ నెంబర్ ఇ.చ్చి మామూళ్లు వేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై సీనియర్ అడ్వకేట్ రమేష్ గౌడ్ జిల్లా న్యాయ సేవ సంస్థ. (డి ఎల్ సి) పరిగి సబ్ జైల్ జైలర్ రాజ్ కమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్య తీసుకుంటానని పరిగి సబ్ జైలు జైలర్ రాజ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. సబ్ జైల్లో ఇంకోసారి మామూళ్ల వ్యవహారం జరగకుండా చర్యలు తీసుకోవాలని నిందితుల బంధువులు కోరుతున్నారు.


# ఓటును ఆయుధంగా వాడుకో!




## నువ్వు వేసే ఓటే ఐదేళ్ల తలరాతలను నిర్ణయిస్తుంది

- ఓటు అమ్ముకోని బానిసగా మారబోకు
- ఓటు విలువ తెలుసుకో మిత్రమా
- నేటి నుండి మూడు విడతల్లో జీపీ ఎన్నికలు

**రాజోలి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :**
ఎన్నికల్లో అనేక మంది అభ్యర్థులు ఒక్క ఓటుతో ఓడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పలు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల్లో ఒక్క ఓటుతో ఓడిపోయిన అరుదైన సంఘటనలు చరిత్రలో లేకపోలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలితులు. ప్రజలే ఓటర్లు, ప్రజలే పాలకులను ఎన్నుకుంటారు. ఓటు, ఎన్నిక, మెజార్టీ ఓటర్లతో అధికారం ఇవే ప్రజాస్వామానికి మూలధారాలు. ఎన్నికలో నిలబడాలి. మెజార్టీ ఓట్లతో గెలవాలి. ఒక్క ఓటు తేడాతో ప్రజా ప్రతినిధి కావచ్చు. అధికారం చేపట్టొచ్చు. ప్రజాస్వామ్యంలో బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పదని చాటుతాం. ఓటే వజ్రాయుధం అని నినదిస్తాం. అలాంటి ఓటు నేటి కాలంలో రాజకీయ పార్టీల నోట్ల కట్టలకు లొంగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నికల్లో నీతి నిజాయితీతో కూడిన గెలుపుకంటే డబ్బుతో ఓట్లను కొని గెలిచే సంస్కృతి అంతకంతకు పెరుగుతున్నది. మెజార్టీ ఓట్లను కొనుగోలు చేస్తే చాలు, గెలుపు తమదే అనే ధోరణి రాజకీయ పార్టీల్లో హెచ్చుమీరుతున్నది. పదులు, వందల కోట్లలో డబ్బులు ఖర్చు చేసిన వారే చట్ట సభలో అడుగుపెట్టే జాడు పెరుగుతున్నది. సంతలో పశువులను కొన్నట్టుగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది.



**నిర్లిప్తతను వీడాలి..!**

ఐదేళ్లకోసారి ఒక్కగంట కేటాయిస్తే చాలు తమ తలరాతలు మార్చే ప్రతినిధిని ఎన్నుకోవచ్చన్న వాస్తవాన్ని ఓటర్లు గుర్తించాలి. ఓటేసినప్పుడే ప్రజాప్రతినిధిని ప్రభుత్వాన్ని నిగ్గదీసి, నిలదీసే హక్కు ఉంటుందని తెలుసుకోవాలి. ఒకవేళ బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే 'నోటా' బటన్ నొక్కినా ఓటు హక్కు వినియోగించుకున్నట్లే.. 'నేను ఒక్కడినే ఓటేయకపోతే మన తలరాతలు మారవు కదా ? అన్న నిర్లిప్తతను వీడాలి. పంచాయతీ మెంబర్ నుంచి పార్లమెంటు మెంబర్ దాకా జరిగే ఎన్నికల్లో పాలకులను ఓటుతోనే ఎన్నుకునే ఎన్నికల వ్యవస్థ మనది. స్వేచ్ఛగా ప్రజలు ఓటు వేసే హక్కును మన రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 326 ద్వారా 18 ఏళ్ళు నిండిన ప్రతి పౌరుడికి కుల, మత, ప్రాంతీయ, వర్గ, వివక్ష భేదం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఎన్నికలు వస్తే ముందుగా రాజకీయ పార్టీలు నేతలు చేసే దుష్ప్రలోచన ఏమిటంటే..ఓటర్లను ఎలా లొంగదీసుకోవాలి ఏమిచ్చి ప్రలోభపెట్టాలి ? ఓటర్లను సంతలో పశువులను కొన్నట్టుగా కొనడం..కుల, మత ప్రాతిపదికగా గంపగుత్తగా వేయించుకోవడం దుష్ట రాజకీయ సంస్కృతి సాక్షాత్కారంగా నిలుస్తున్నది.

**ప్రజాస్వామ్యానికి పునాది**

ప్రజలు ఒకరోజు వేసే ఓటే వారి ఐదేళ్ల తలరాతలను నిర్ణయిస్తుంది. రాజకీయాల తలరాతలను మార్చేదిగా ఓటు ఉండాలి. అలా కాకుండా నోటు తీసుకొని ఓటు వేస్తే జవాబు దారితనం ఉండదు.. అది రాజకీయ పార్టీలు నేతల అక్రమాలకు తావిస్తుంది. ఒక వ్యవస్థకు ప్రజాప్రతినిధి ఎంత అవసరమో, అతడిని ఎన్నుకునేందుకు ఓటరు అంతే ముఖ్యం. నా ఓటే నా భవిష్యత్తు అనే చైతన్యం పెరగనంత కాలం ఓటును నోటుతో కొనుగోలు చేసినంతకాలం ప్రజాస్వామ్యం వర్ధిల్లదు. ఈ దిశగా ఓటర్లలో చైతన్యం తీసుకురావడం ఎంత ముఖ్యమో పటిష్టమైన ఎన్నికల సంస్కరణలు రావాలి. రాజకీయ పార్టీల ఓట్ల కొనుగోలు వైఖరి మారే మౌలిక సంస్కరణలు పటిష్ట నిబంధనలు రావాలి. ఎరకు చిక్కుతున్న ఓటరు దేవుళ్ళు ఓటర్లను దేవుళ్ళతో పోలుస్తుంటాం కానీ, రాజకీయ పార్టీలు నీతి, నైతికతకు సమాధి కట్టి డబ్బు.. కండ, అధికార బలం ఓటర్లపై ప్రయోగిస్తూ.. మందు, మటన్, విందు, తాయిలాలు పంచుతూ నిర్బంధంగా వేసేలా, నోటు తీసుకొని ఆ తర్వాత వేయకుంటే ఏం చేస్తారోననే భయానక పరిస్థితుల్లోకి నెట్టివేశాయి.



## ఓటరన్న నీశక్తి తెలుసుకో.!

హనుమంతునికి తన బలం ఎంతటిదో తెలియదని అంటారు. అలాగే ప్రజల్లో కూడ తమ ఓటు విలువ దాని శక్తి తెలియడం లేదు. ప్రజాస్వామ్యంలో ఓటరే అత్యంత శక్తిమంతుడు. ప్రభుత్వాన్ని నిలబెట్టాలన్న కూల్చాలన్న అతని ఒక్కడికే సాధ్యం, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి మన పాలకులను మనమే ఎన్నుకునే అవకాశం వచ్చింది. అలాంటి సువర్ణకాశం నేటి నుండి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుండడంతో ఎటువంటి పాలకుడు కావాలో ఓటర్లే నిర్ణయించుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం మన హక్కు ' నేను నా దేశ ప్రజల చేతికి అదునైన కత్తి ఏది ఇవ్వలేదు. నేను ఇచ్చింది ఓటు హక్కు మాత్రమే అది కత్తి కంటే పదునైనది అని, భారత రాజ్యాంగ రచనల్లో కీలక భూమిక పోషించిన అంబేద్కర్ అనాడే చెప్పారు. భవిష్యత్తును మార్చే ఆయుధమై నా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే ఓటు హక్కు ఒకటే మార్గం. తాయిలాలకు లొంగి మరిచిపోతే ప్రగతి కుంటుపడుతుంది. ఓటుహక్కు దేశం భవిష్యత్తును మార్చే ప్రజా ఆయుధం. అందుకే ఓటును దుర్వినియోగం చేయకుండా తగిన ప్రాధాన్యతను గుర్తించి సరైన నాయకున్ని ఓటరు ఎన్నుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. ఓట్లు వేయడాన్ని ప్రజలు రాజకీయలో ప్రక్రియలో భాగంగానే చూస్తూ నోటు తీసుకొని ఓటు వేస్తే ప్రశ్నించే హక్కును కోల్పోతారనే విషయం మరిచిపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదు.

# పంచాయతీ ఎన్నికలు... శంషాబాద్ జోన్ పరిధిలో నిషేధాజ్ఞలు

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధి శంషాబాద్ జోన్‌లో ఎన్నికల నిషేధాజ్ఞలు అమలు అవుతున్నాయని శంషాబాద్ జోన్ డిసిపి బి. రాజేష్ తెలిపారు. మొదటి విడత ఎన్నికలు నేడు, రెండవ విడత ఈనెల 14న అలాగే మూడవ విడత ఎన్నికలు ఈనెల 17న జరగనున్న నేపథ్యంలో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ఐదుగురికి మించి గుమికూడవద్దని నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నామని డిసిపి వివరించారు. శంషాబాద్ జోన్ పరిధి శంషాబాద్, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, కందుకూరు, చౌదరిగూడెం, కేశంపేట, కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ ప్రాంతాల్లో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఫేజ్–1కు సంబంధించి డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటల నుంచి 12 సాయంత్రం 6 గంటల వరకు, ఫేజ్–2కు సంబంధించి డిసెంబర్ 12 సాయంత్రం 5 గంటల నుంచి 15 సాయంత్రం 6 గంటల వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని డిసిపి తెలిపారు. నిషేధాజ్ఞలు కొనసాగుతున్న సమయంలో ప్రజా సమావేశాలు, గుమికూడడాలకు పూర్తిగా నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

- స్వేచ్ఛగా ఓటు వేయండి
- వివిధ పోలీస్ స్టేషన్ లో తుపాకుల డిపాజిట్
- సోషల్ మీడియా పై గట్టి నిఘా
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ (10 జనం సాక్షి):** జిల్లాలో జరగబోయే మొదటి దశ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పౌరులందరూ ఎటువంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు, ట్రబుల్ మంగర్‌లందరినీ ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, లైసెన్స్ పొందిన తుపాకులు, ఇతర ఆయుధాలను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేసుకునే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు, ప్రభుత్వ ఆస్తులకు, లేదా సాధారణ ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగించినా, భయభ్రాంతులకు గురిచేసినా, చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాకుండా, ఎన్నికలలో అలజడులు సృష్టించాలనే ప్రయత్నం చేసినా, సామాజిక మాధ్యమాలలో సోషల్ మీడియా లోతప్పుడువిద్వేషపూరిత ప్రచారాలు చేసినా, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైతే షీట్ కూడా ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, పోలింగ్ బూత్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్‌లు, కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లడం లేదా వాటితో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు.జిల్లాలోని ప్రజలు ఎటువంటి అనుమానాలు, ఇబ్బందులు లేకుం డా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీస్ అధికారులకు సంపూర్ణంగా సహకరించాలని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపినారు. ఎక్కడైనా అలజడులు అవాంఛనీయ సంఘటనలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గమనిస్తే, వెంటనే తమ పరిధిలోని పోలీస్ అధికారులకు లేదా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 11 డిసెంబర్ 2025

# ఎస్సారెస్పీకి భీమిరెడ్డి పేరు పెట్టాలి

- ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్
- రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో సీనియర్ జర్నలిస్టులు కవులు రచయితలు, సామాజిక కార్యకర్తలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎస్సారెస్పీ కాలువ పేరు మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు చేసి భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని పలువురు పత్రికా సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు కోరారు. ఎస్సారెస్పీ (శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్) రెండో దశ ద్వారా ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు 4.40 లక్షల ఎకరాలకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ భీమిరెడ్డి నర్సింహారెడ్డి అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో పోరాడి సాధించారని గుర్తు చేశారు. భీమిరెడ్డి ఆశయసిద్ధితోనే కరువు నేలపైకి గోదావరి జలాలు వచ్చాయని, ఆయోధుని పేరుతోనే ఆ రెండో దశ కాలువకు ఆయన పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బి.ఎన్. ఆలోచనా వేదిక ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు వర్ధెల్లి మురళి అధ్యక్షతన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఎస్సారెస్పీ రెండో దశ కాలువకు భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేసింది. దేశంలో భూ సంస్కరణలకు అమలు కోసం పోరాడిన భీమిరెడ్డి పేరున సూర్యాపేట జిల్లాకు నామకరణం చేయాలని సమావేశం తీర్మానించింది. ఆ మహనీయుని పేరుతో సూర్యాపేటలో భీమిరెడ్డి విజ్ఞాన పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, వ్యవసాయ రంగాలపై పరిశోధనలకు ఆలవాలంగా ఆ కేంద్రాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఇందుకోసం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణాలు, మౌలిక వసతులను ఏర్పాటుచేయాలని, ఈ పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాల పరిశోధన కేంద్రం నెలకొల్పాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. తెలంగాణ సాయుధ పోరాట స్మృతికేంద్రం, పరిశోధన కేంద్రంతో పాటు ట్యాంక్‌బండ్‌పై బి.ఎన్. విగ్రహం ప్రతిష్ఠించాలని కోరారు. నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీకి బిఎన్ పేరు పెట్టాలని, పాఠ్యపుస్తకాల్లో బిఎన్ చరిత్రతో పాటు అలనాటి భూమి-భుక్తి విముక్తి కోసం పోరాడిన యోధుల పేర్లను సిలబస్‌లో చేర్చి మన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. సమావేశం చేసిన తీర్మానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలి. ఇందుకు జిల్లా మంత్రులు కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు బాధ్యత తీసుకోవాలని సమావేశం కోరింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు.

ఈ సందర్భంగా జర్నలిస్టు, రచయిత కట్టా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నేలపై జరిగిన వీరోచిత పోరాటాల వీరుల స్మరణలతో స్మారకకేంద్రం లేకపోవడం విచారకరమన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఇందుకోసం ముందుకు వచ్చి డిమాండ్ చేయకపోవడం మరింత విచారకరమని, జలియన్‌వాలా బాగ్‌లాంటి ఘటనలు తెలంగాణలో అనేకం జరిగాయి. వాటి చరిత్రను రికార్డు చేసి భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.

పత్రికా సంపాదకులు కె. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ బి.ఎన్. పేరున అలనాటి త్యాగధనుల చరిత్రను నిలబెట్టే స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ఆలోచనాపరులంతా కదిలి రావాలని అన్నారు.

ప్రముఖ రచయిత టంకశాల అశోక్ మాట్లాడుతూ గోదావరి జలాల కోసం కృషి చేసిన వారిని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా బి.ఎన్. పేరున ఎస్సారెస్పీకి పేరు పెట్టాలని అడగాల్సిన దుస్థితి రావడం తెలంగాణ అస్తిత్వానికి దెబ్బ అని, బిఎన్ పేరు పెట్టకపోవడం అన్యాయమని, ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలని కోరుతున్నామని అన్నారు.

మాజీ ఎడిటర్ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ జలాల కోసం బి.ఎన్. పోరాడితే, ఆ వరద కాలువకు దామోదర్ రెడ్డి పేరు పెట్టడం చరిత్రకు అన్యాయం చేసినట్టేనని, ఇందుకోసం పౌర సమాజంతో పాటు కమ్యూనిస్టుల నుంచి బలమైన ప్రతిపాదనలు రావాలని సూచించారు.

ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను సిలబస్‌లో పెట్టాలని, బిఎన్ మెమోరియల్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పాలని, తెలంగాణ సాయుధ పోరాట విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఆనాటి పోరాట వీరుల చరిత్రను భవిష్యత్ తరాలకు చేరవేయాలని అన్నారు.

దేగల జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అక్షేపణీయమని, సూర్యాపేట జిల్లాకు బిఎన్ పేరు పెట్టాలని, మహాత్మా గాంధీ యూనివర్సిటీకి బి.ఎన్. పేరు పెట్టాలని సూచించారు.

వేద కుమార్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువకు బి.ఎన్. పేరు పెట్టడం ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా మొత్తం తెలంగాణ సమాజం బాధ్యతని, ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు.

కట్టా భగవంత రెడ్డి మాట్లాడుతూ బీఎన్ చేసిన కృషిని పుస్తక రూపంలో తేవాలని, జిల్లాల్లో సమావేశాలు చేపట్టాలని, అన్ని పార్టీలు, యువజన సంఘాలు, రైతు-కూలీ సంఘాల మద్దతు కూడగట్టి ఉద్యమాన్ని బలంగా నిర్మించాలని సూచించారు.

దర్శకుడు ఎన్. శంకర్ మాట్లాడుతూ నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భీమిరెడ్డి పేరు పెట్టాలని, భీమిరెడ్డి పై సినిమా తీసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎఫ్‌డీసీ ద్వారా తీసుకురావాలని, ఈ నేల చరిత్రను విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు.

అడ్వకేట్ అయోధ్య మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై బిఎన్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సారెస్పీ జలాల ఉద్యమకారుడు కొత్తగట్టు మల్లయ్య మాట్లాడుతూ ఎస్సారెస్పీ జలాలకు కాలువల పక్కనే ప్రజలు ఎప్పుడూ 'బి.ఎన్. రెడ్డి కాలువ' అనే బోర్డు పెట్టుకున్నారని, ప్రభుత్వం తన తప్పిదాన్ని తెలుసుకుని బి.ఎన్. పేరు పెట్టాలని, ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.

అల్లం నారాయణ మాట్లాడుతూ ఎందుకోసం ఈ నేలపై రాష్ట్ర సాధన ఉద్యమం జరిగిందో ఆ స్ఫూర్తిని పాలకులు విస్మరించడం విచారకరమని, తెలంగాణ చరిత్రను, సంస్కృతిని మరిచిపోయారని, తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చేశారని తెలిపారు. ఇప్పుడు అంతా వ్యాపారం కోసం చర్చ జరుగుతోంది. లాల్-నీల్ పోరాటాలకు పునాది వేసిన తాత్వికుడు బి.ఎన్. తెలంగాణ చరిత్రను మనం కాపాడుకోకపోతే అది మన కళ్లముందే కనుమరుగవుతుందని, ఇది తెలంగాణకు విషాదకరమని అన్నారు.

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ మలిదశ ఉద్యమానికి ముందు తెలంగాణను కాపాడగలిగిందని, గోదావరి జలాలేనని చాటి చెప్పిన దార్శనికుడు బిఎన్ ఆయన చరిత్రను విస్మరించడం ద్రోహమేనన్నారు. 'తరమెల్లి పోతున్నది... ఆ త్యాగాల స్వరం మాగిపోతున్నది...' అన్న పాటను భీమిరెడ్డి కన్నుమూసినపుడు రాశానని అవలోకనం చేశారు. ఆయన చరిత్రను చరిత్రకే ఇవ్వటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని సూచించారు.

ది హిందూ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రవి కాంత్ రెడ్డి మాట్లాడుతూ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, జిల్లా మంత్రులు ఇందుకోసం కృషి చేయాలని సూచించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తీర్మానాలను ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో భారత జన విజ్ఞాన వేదిక నాయకులు రమేష్, మేకల శ్రీనివాస్, భారత విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్. వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బి.ఎన్. తనయుడు ప్రభాకర్ రెడ్డి, జర్నలిస్టులు వర్ధల్లి వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు మారుతీ సాగర్, తదితరులు చర్చలో పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం

- కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు
- యువకుడిని పిలిపించి దారుణంగా హత్య

**సంగారెడ్డి, డిసెంబర్10 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును ప్రేమించాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని అతడిని ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిడిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ కుటుంబం ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందామని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లా పూర్‌లో రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించు కోక పోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. హతమార్చారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## ప్రయివేట్ డాక్టర్ల మత్తు వ్యాపారం గుర్తింపు

- మత్తు ఇంజెక్షన్ల వ్యవహారంలో పురోగతి

**హైదరాబాద్, డిసెంబర్10 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట పరిధిలో మత్తు ఇంజెక్షన్ల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. మత్తుకోసం అనస్తీషియా తీసుకుని ఇద్దరు డ్రైవర్లు మృతిచెందడంతో పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు డాక్టర్లను అరెస్ట్ చేశారు. రోగులకు ఇవ్వాల్సిన డోసు కంటే ఎక్కువ మోతాదులో మత్తు ఇచ్చినందువల్లే వారు మృతిచెందినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు ఆటోడ్రైవర్లు ఆటోలనే కుప్పకూలి మరణించడంతో.. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా విశ్లేషించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఇంజెక్షన్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశంపై పలు ఆధారాలు సేకరించారు. రోగులకు చికిత్స చేసేందుకు వాడాల్సిన మత్తు ఇంజెక్షన్లను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జైపాల్ రెడ్డి బహిరంగ మార్కెట్లో అక్రమంగా అమ్ముతున్నాడు. అతడి వద్ద నుంచి ఈ ప్రమాదకర ఇంజెక్షన్లు బయటకు వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో మరో ఆసుపత్రికి చెందిన ఇంకో వైద్యుడి పాత్ర కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఇరువురూ కలిసి అక్రమంగా అనస్తీషియా ఇంజెక్షన్లు విక్రయిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఆసుపత్రుల్లో నిల్వ ఉన్న ఔషధాలను దారిమళ్లించి.. మత్తుకు అలవాటుపడిన వారికి అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్సల సమయంలో మాత్రమే వినియోగించాల్సిన ఇంజెక్షన్లను ఇలా బహిరంగంగా అమ్మడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

## ఫ్రస్టేషన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం

- అన్ని ఆరోపణలకు ఆధారాలతో సమాధానమిస్తా..
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, డిసెంబరు10 (జనంసాక్షి) :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూల్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరపున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణకు మల్టీ ఓమిక్స్ ల్యాబ్స్

- 'వీజ్జీ హెూల్డింగ్ ఐఎన్‌సీ'తో కుదిరిన ఒప్పందం
- పదేండ్లలో రూ.2500 కోట్ల పెట్టుబడులు
- గ్లోబల్ సమ్మిట్ లో సీఎం తో పిట్స్ బర్గ్ వర్సిటీ డీన్ అనంత శేఖర్, సంస్థ కో -ఫౌండర్ కళ్యాణ్ చక్రవర్తి
- తెలంగాణ ఆరోగ్య రంగంలోకి వీజ్జీ కి స్వాగతమన్నా సీఎం రేవంత్ రెడ్డి
- ఐదేండ్లు ముందే ప్రాణాంతరకమైన వ్యాధుల్ని గుర్తించవచ్చు: విజ్జీ కో-ఫౌండర్ కళ్యాణ్ చక్రవర్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : పీ-5 సొల్యూషన్‌తో మల్టీ ఓమిక్స్ ల్యాబ్స్ అప్రోచ్ తో వైద్య రంగంలో విప్లవాన్ని సృష్టిస్తోన్న యూఎస్ బేస్డ్ కంపెనీ విజ్జీ హెూల్డింగ్ ఐఎన్‌సీ.. ఇకపై తెలంగాణ సేవలందిచనుంది. ఈ మేరకు 'తెలంగాణ రైజింగ్ -2047' గ్లోబల్ సమ్మిట్ లో తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. విజ్జీ హెూల్డింగ్ ఐఎన్ సీ ఫౌండర్, సీఈఓ డాక్టర్ విష్ణు వర్ధన్ నేతృత్వంలో ఆ సంస్థ ప్రతినిధులు పిట్స్ బర్గ్ యూనివర్సిటీ డీన్, వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ అనంత శేఖర్, విజ్జీ కో-ఫౌండర్ పీఎస్ కళ్యాణ్ చక్రవర్తి, సంస్థ ప్రతినిధులు మంగళవారం గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి భేటితో భేటి అయ్యారు. దాదాపు 10 నిమిషాలకు పైగా సాగిన ఈ భేటిలో వైద్య రంగంలో వీజ్జీ తెచ్చిన ఆవిష్కరణలు, సేవలను విని సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మంచి ఆరోగ్యం, వైద్య సేవలు అందంచే దిశలో వీజ్జీతో ఎంఓయూకు అంగీకారం తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో వీజ్జీ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ అనంత శేఖర్, కళ్యాణ్ చక్రవర్తి మధ్య అవగాహనం ఒప్పందం జరిగింది. అనంతరం సంస్థ ప్రతినిధులు డాక్టర్ అనంత శేఖర్, కళ్యాణ్ చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ పీ-5 సొల్యూషన్స్‌తో మల్టీ ఓమిక్ అప్రొచ్ తో విజ్జీ ల్యాబ్స్ తెలంగాణకు వస్తోందన్నారు. ఇప్పటి వరకు అమెరికా లోని పిట్స్ బర్గ్ తర్వాత రెండోవ ల్యాబ్‌ను తెలంగాణలోనే ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇందుకు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమ ల్యాబ్స్ ద్వారా ఐదేండ్ల ముందు మానవ శరీరంలో రాబోయే రుగ్మతలు, ప్రాణాంతకరమైన వ్యాధులను గుర్తించవచ్చన్నారు. ఈ హెల్త్ చెకప్ లతో ముందుగానే కావాల్సిన వైద్యం తీసుకోవచ్చన్నారు.

### పదేండ్లలో రూ.2500 కోట్ల పెట్టుబడులు

రాబోయే పదేండ్ల తెలంగాణలో విజ్జీ రూ. 2500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ కో ఫౌండర్ పీసీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. తొలుత హైదరాబాద్ వేదికగా మల్టి ఓమిక్ ల్యాబ్ పని చేస్తోందని, పదేండ్లలో ఈ ల్యాబ్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. కాగా... వైద్య రంగంలో తాము తీసుకువస్తోన్న ఈ పీ-5 సొల్యూషన్ పై సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారన్నారు. త్వరలో చేపట్టబోయే అమెరికా పర్యటనలో పిట్స్ బర్గ్ యూనివర్సిటీని లోని వీజ్జీ ల్యాబ్స్ ను సందర్శిస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే తెలంగాణ ఆరోగ్యం రంగంలోకి విజ్జీ హెూల్డింగ్ ఐఎన్ఎసీ కి స్వాగతం పలికారన్నారు.

## 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు

- 'హైదరాబాద్ కనెక్ట్' పేరుతో టీజీఎస్ఆర్టీసీ సరికొత్త ప్లాన్
- ఈ డిసెంబర్ నెల నుంచే సేవలు ప్రారంభం
- సుమారు 7.61 లక్షల మంది నగరవాసులకు రవాణా సదుపాయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాలు, కొత్త కాలనీల వాసులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ సరికొత్త కార్యాచరణను ప్రకటించింది. 'హైదరాబాద్ కనెక్ట్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలోని 373 కొత్త కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ డిసెంబర్ నెల నుంచే ఈ బస్సులు రోడ్డెక్కనున్నాయి. సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నగర శివారుల్లోని 30 సర్కిళ్లు, 150 వార్డుల పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల రవాణా అవసరాలను గుర్తించారు. ఈ కొత్త సేవల ద్వారా ఆయా కాలనీల్లో నివసించే సుమారు 7,61,200 మంది పౌరులకు లబ్ధి చేకూరనుంది. ఉద్యోగులు, సాఫ్ట్వేర్ ఎంప్లాయిస్ సౌకర్యార్థం హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఉప్పల్, తదితర ఎంప్లాయిమెంట్ హబ్స్ కాలనీల నుంచి నేరుగా బస్సులను నడపనున్నారు. దీనివల్ల ప్రయాణ సమయం ఆదా అవ్వడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుంది. హైదరాబాద్ కనెక్ట్ కార్యక్రమాన్ని మూడు దశల్లో అమలు చేయనున్నారు. వచ్చే రెండు నెలల్లో అత్యధిక రద్దీ ఉన్న కాలనీల్లో మొదటి దశ సేవలు అందుబాటులోకి వస్తాయి. సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించి, ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త కాలనీల బస్సుల రాకపోకల వివరాలను రియల్ టైమ్లో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు 'టీజీఎస్ఆర్టీసీ గమ్యం' యాప్ను వినియోగించుకోవచ్చు. ఈ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ సేవలు అందుబాటులో ఉంటాయి. మొత్తం 373 కాలనీలకు గాను హైదరాబాద్ రీజియన్లో 243, సికింద్రాబాద్ రీజియన్లో 130 కాలనీలను ఎంపిక చేశారు. ప్రయాణికులు రూట్ సమాచారం కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే టీజీఎస్ఆర్టీసీ హెల్ప్లైన్ నంబర్లు 040 69440000, 040 23450033 ను సంప్రదించాలని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి సూచించారు.

### ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

'గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీల వాసులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే 'హైదరాబాద్ కనెక్ట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. క్షేత్రస్థాయిలో విస్తృత సర్వేలు నిర్వహించి, ప్రజల విజ్ఞప్తులు, అవసరాలకు అనుగుణంగానే 373 కాలనీలను ఎంపిక చేశాం. ముఖ్యంగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఉద్యోగ కేంద్రాలకు ఈ కాలనీల నుంచి కనెక్టివిటీ పెరగడం వల్ల ఉద్యోగులకు ప్రయాణ సమయం, ఖర్చు ఆదా అవుతాయి. ప్రజలు సొంత వాహనాలపై ఆధారపడకుండా, సురక్షితమైన ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి' అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## ఇండిగో సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

- కేరళ సిపిఎం ఎంపీ రహీమ్ విమర్శలు



**న్యూఢిల్లీ, డిసెంబర్10 (జనంసాక్షి) :** ఇండిగో సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని సిపిఐ(ఎం) ఎంపీ ఎఎ రహీమ్ పేర్కొన్నారు.నియంత్రణ లేని ప్రయివేటీకరణ మరియు నిబంధనల సడలింపుల ప్రత్యక్ష ఫలితమే ఈ సంక్షోభమని అన్నారు. ఇది భారతదేశ విమానయాన రంగాన్ని ద్విధాధిపత్యంగా మార్చిందని అన్నారు. విమానయాన సంస్థకు అనుగుణంగా ఫ్లైలట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డిటిఎల్) నిబంధనలను నీరుగార్చవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ సంక్షోభానికి ఇండిగో ఒక్కటే కారణం కాదని అన్నారు.'ఈ భారీ సంక్షోభం వెనుక ఉన్న ఏకైకక దోషి కేంద్ర ప్రభుత్వం. ఇది ప్రభుత్వ నయాఉదారవాద ఆర్థికవిధనాలు, ప్రైవేటీకరణ మరియు భారత విమానయాన రంగంపై నియంత్రణ సడలింపుల ప్రత్యక్ష ఫలితం' అని అన్నారు. మార్కెట్ కేంద్రీకరణను సూచిస్తూ.. ఇండిగో ప్రస్తుతం అన్ని విమాన సర్వీసుల్లో 65.6శాతం నిర్వహిస్తుండగా, ఎయిర్ ఇండియా 25.7శాతం నిర్వహిస్తోందని కేరళ ఎంపి అన్నారు. భారతీయ విమానయాన రంగంలో 90శాతం కంటే ఎక్కువ ఇండిగో మరియు టాటా అనే ఈ ఇద్దరు బాస్‌లచే నియంత్రించబడుతున్నాయని అన్నారు. ఎయిరిండియా ప్రైవేటీకరణ విమానయాన సంస్థను మారుస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హామీని ఆయన తోసిపుచ్చారు. భద్రత, సేవల నాణ్యత మరియు విమానాల నాణ్యత పరంగా, పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రభుత్వం రంగం పనికిరానిదని, ప్రైవేట్ సంస్థలు అద్భుతాలు సృష్టించగలవని మోడీ ప్రభుత్వం ఒక అపోహను సృష్టించిందని అన్నారు. ఇండిగో సంక్షోభాన్ని ఎయిర్ ఇండియా దోపిడీ చేస్తోందని అన్నారు. ఇండిగో సంక్షోభ సమయంలో టాటాకి చెందిన ఎయిర్ ఇండియా ప్రజలు పడుతున్న బాధ నుండి లాభం పొందుతోందని విమర్శించారు. 1500 కి.మీ కంటే ఎక్కువ దూరం ఉన్న మార్గాలకు విమాన చార్జీలను రూ.18,000కి పరిమితం చేస్తూ గత శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ.. అదే రోజు ఢిల్లీ-తిరువనంతపురం ఎకానమీ క్లాస్ టికెట్‌కు రూ.64,783 ధరను వసూలు చేసినట్లు బుధవారం ఉదయం గుర్తించానని అన్నారు. ప్రైవేట్ విమానయాన సంస్థలపై ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ లేదన్న అంశాన్ని ఇది హైలెట్ చేస్తోందని అన్నారు. ఫ్‌డిటిఎల్ నిబంధనలను నీరుగార్చవద్దని, ఇండిగోకు మినహాయింపులు ఇవ్వద్దని రహీమ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ద్విధాధిపత్య మార్కెట్లో విమాన ఛార్జీలను నియంత్రించడానికి, ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి బలమైన వ్యవస్థను నియమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370